ఆంధ్రసాహిత్య
పరిషత్పత్రిక.

కాకినాడ.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౪.	యువనామసంవత్సరము. మార్గశిరపుష్యమాసములు.	సంచిక ౫.

సుకవి.

జయంతి స్వామినాయనగారు, ముమ్మిడివరము.

సీ. విశ్వమెల్లను నీలోన వెలయు నేమొ, వెలయుచున్నావొ నీవె యీవిశ్వమెల్ల
విశ్వమే నీవొ నీవ యీవిశ్వ మేమొ, లేశ మైనను భావింప లేము కాని
యేము "నిదమిత్థ"మని చెప్ప లేము కాని, నీమహాహృదయంబువిశ్వంబునిండియుండు
నీవిమలబుద్ధి నిశితమై నెగడుచుండు, నీయమృతబోధ సత్యమై నిలిచియుండు
నట్టి నీకెన యెవ్వ రీయవనియందు, సద్గుణోద్దామ! సత్కవిసార్వభౌమ!
నీవు గనరానితావులు లేవు భువిని, నీవెఱుఁగరాని కృత్యముల్ లేవు జగతిఁ
గానిచోఁ బోతుటీఁగకు నైనఁ దూఱ, రాని రాజుల యంతిపురంబులందుఁ
గలవిశేషంబు లెట్లు నీగ్రంథముల య,థాగతిం దెల్ప నేర్తు? విద్వత్కవీంద్ర!
ప్రకృతిసృజియించునట్టి సద్బ్రహ్మ నీవ, ప్రకృతిఁజిత్రించు చిత్రకారకుఁడ నీవ
ప్రకృతి గానంబు సేయు గాయకుఁడనీవ, ప్రకృతి నలరించు సత్కవీశ్వరుఁడ నీవ
ప్రకృతి సౌందర్యమునుజూపుసుకృతినీవ, ప్రకృతికాంతకుముద్దుపుత్రకుఁడనీవ
యట్టినీ కివె జోహారు లందుకొనుము, ప్రథితగుణసాంద్ర! సత్కవిరాజచంద్ర!
అఖిలనిగమేతిహాసరహస్యములను, అఖిలశాస్త్రపురాణరహస్యములను
అఖిలగ్రంథార్థతత్త్వరహస్యములను, బలుకుపలుకుననమృతంబుచిలుకునటులఁ

బదము పదమున రస మ్ముట్టిపడెడు భాతి, మించు వేడ్కను జవులు జనించురీతి
రాజితానేకభావపరంపరలను, మహితసహృదయహృదయంగమంబుగాఁగ
గ్రంథజాలంబులందుఁ జొక్కముగ వ్రాసి, యజ్ఞులను విజ్ఞులను జేయునట్టి నీకు
సాటి యెవరయ్య యీప్రపంచంబునందు, సరసగుణధామ! సత్కవిసార్వభౌమ!
సమయము లెఱింగి సంఘదోషము లెఱింగి, దేశము నెఱింగి ధర్మంబు తెరువెఱింగి
జనముల నెఱింగి వారియాశయము లెఱిఁగి, ప్రకృతితత్త్వంబెఱింగి కర్తవ్యమెఱిఁగి
యఖిలబుధసమ్మతముగ నవ్యవిధముల, నయవినయముల నుద్బోధనంబొనర్చి
గ్రంథముల ధర్మసూత్రములఁ బొందుపఱచి, సకలజనులకు మార్గదర్శకుఁడవైన
నీ కివే వందనములు గోష్మా! కవీంద్ర!
భావనాతీతశబ్దప్రపంచమునకుఁ, గర్తవై భర్తవై పరిహర్త వగుచు
ధర్మసంరక్షణాబద్ధ కర్తవ్యమనుచుఁ, బ్రవిమలపదార్థనిర్ణయప్రౌఢిఁ జూపి
కలమె ఖడ్గంబుగాఁగ నిష్కలుషబుద్ధిఁ, బ్రాంచితానేకవరవర్ణపాలనంబుఁ
జతురతనొనర్చుసుకవిరాట్సార్వభౌమ! మామకనమస్కృతంబు గోష్మామహాత్మ!
తావకోజ్జ్వలదివ్యసందర్శనంబుఁ, జేయునాతఁడు సద్యశశ్శ్రీల నొందుఁ
దావకీనమనోహరోదాత్తప్రబంధ, సంచితార్థంబులెల్ల గ్రహించునతఁడు
దివ్యభోగసుఖాంభోధిఁ దేలియాడు, నీకవద్యనయవిద్య నేర్చునాతఁ
డఖిలధర్మప్రవర్తకుం డగుచు నెగడు; నీమనోజ్ఞవిజ్ఞానబోధామృతంబు
గ్రోలునాతఁడు మోక్షముం గొనితరించు; నహహా నీమహామహిమ లెంతని నుతింతు
సరసగుణధామ! సత్కవిసార్వభౌమ!
అవనిఁ దాపత్రయములచే నవయుమాకు, నమలమణిమయహర్మ్యసౌధాంతరముల
రమ్యభూషణరత్నాంబరములఁ దాల్చి, కాలము వినోదలీలలం గడపుచుండు
కువలయాక్షులఁ జూపించి కొంతసేపు; రమ్యతరలతాగేహాంతరముల వేడ్కఁ
దీఁగెయుయ్యాలలందు నూఁగియాడి, యమృతమయమంజులోక్తుల నాడుచుండు
కొదమజవరాండ్రఁ జూపించి కొంతసేపు; నమలవాఃపూర్ణజలజాకరముల చెంత
విమలతరవాతపోతముల్ వీచువేళ, నెలచలువవెన్నెల బయళ్లఁ గలసిమెలయు
కొమరుదంపతులను జూపి కొంతసేపు; సరసఫలకుసుమాసవాస్వాదనప్ర
మత్తశుకపికమధుకరమధురకూజి, తములఁ గోలాహలంబయి తనరునట్టి
సుందరోద్యానవనముల నందునందు, ఠీవిమై సంచరించు విటీవిటులను
వారి మురిపంపుస్వేచ్ఛావిహారములను, వారిమంజులమధురసంభాషణముల

వారిసుమనోజ్ఞహావభావంబులెల్ల, వివిధరీతుల వర్ణించి వేడ్కతోడఁ
గట్టెదుటఁ జరుగుచున్నట్లు కన్నుఁగవకుఁ, గూర్చిదళుకొత్తఁ జూపించి కొంతసేపు
చిత్తవికలతఁ బాపి రంజిల్లఁజేయు, యుష్మదుద్యత్ప్రభావ మీ యుర్వియందు
సన్మహాకవులు వొగడ శక్యమె ! కవీంద్ర !

విమలమై యొప్పు మెఱుపుఁదీవియల నలరు, సురభిళాంచితకుసుమమంజరులవరసి
యతులితానందమునఁ దేలునట్టి శక్తి, వెలఁదికెమ్మోవి చివురున వెలయుచుండు
మహితమంజులనవసుధామధురిమంబు, గ్రోలి తన్మయత్వముఁ జెందు గొప్పశక్తి
నీక కలుగుట తావకానేకపూర్వ, జన్మకృతపుణ్యఫలమెసూ ! సత్కవీంద్ర !

నిరతిశయమైన మోహవార్ధిని మునిఁగి, యఖిలధర్మక్రియాపరిత్యక్తుఁ డగుచుఁ
గలికిపైఁటచెఱంగునఁ గట్టువడుచుఁ, బడఁతికుచ్చెళ్లకొంగునఁ బందుకొనుచు
మోహనాంగియె స్వర్గంబు మోక్షమనుచు, నుర్వియెల్లను గాంతతో నున్నదనుచు
నన్యములవెల్ల వ్యర్థంబులనుచు నెంచి, కాలముంబుచ్చుచున్నట్టి కాముకునకుఁ
గాంత యనిన ననహ్యత గలుగునటులఁ, గనక మనిన విరాగంబు గలుగునటుల
వాని నీతోడ దండకావనికినైనఁ, గాక హిమవన్నగాగ్రభాగమునకైన
జెక్కలంగట్టి కొంపోయి రేబవళ్లు, నిరుపమానందమూర్తులై నెగడునట్టి
యనుపమోజ్జ్వలగాత్రులై యలరునట్టి, పవనపర్ణాంబుభక్షులై వఱలునట్టి
బ్రహ్మనిష్ఠాగరిష్ఠులై పరఁగునట్టి, యాగతానాగతములెల్ల నరయునట్టి
విజితకామాదిగుణులౌచు వెలయునట్టి, సర్వలోకైకపూజ్యుల సత్యరతుల
శమదమాదిగుణాఢ్యుల విమలమతుల, నఖిలభోగవిరాగుల నధికయశుల
నిగమసూత్రార్థవేదుల నిఖిలఋషులఁ, జూపి కామలోలుపతను బాపి నీవు
సాధనచతుష్టయంబుల బోధచేసి, కర్మవిజ్ఞానభక్తియోగములఁ దెల్పి
యన్నిటికిఁ గల్గుసామరస్యమును జూపి, విహగసోపానమార్గముల్ విశదపఱచి
తత్త్వమస్యాదినిగమసూత్రముల వెలయు, ప్రథితజీవేశ్వరైక్యభావము వచించి
జగ మనిత్యము నిత్యుఁ డీశ్వరుఁడటంచు, నుర్వి నన్నిటఁ బరమాత్మయున్నదనుచు
నలపరంజ్యోతి నీయందుఁ గలదటంచు, నీవ బ్రహ్మంబ వఖిలంబు నీవ యనుచు
విమలపరతత్త్వభావంబు విప్పిచెప్పి, మోక్షమార్గముఁ జూపెడి పుణ్యపురుష !
మామకానేకవినయనమస్కృతములఁ, గైకొనఁగదయ్య సుగుణసాంద్రా! కవీంద్ర!

ప్రాచీనకవి ప్రతిభావిశేషము.

పండితారాధ్యుల సూర్యనారాయణమూర్తిగారు, అమలాపురము.

'ప్రాచీనకవి ప్రతిభావిశేషము' అనుశీర్షిక నెత్తికొనుటలో నాయాశయ మాకవిచంద్రుల యప్రతిమాన ప్రతిభాదులు లోక మెఱుంగ దని కాదు. ఆంధ్రవాఙ్మయమును సృష్టించి, తగురీతిఁ బోషించి, వివిధనియమప్రసాధనసామగ్రీసమగ్రంబుగ బంధురప్రబంధసౌధంబుల గారవించి యత్యున్నతస్థితికిఁ దెచ్చిన యే తన్మహనీయుల మనీషాశక్తు లాధునికాంధ్రకవులయం దెల్లవిధములఁ బ్రతిబింబించుచునే యున్నవి. అట్టికవిబ్రహ్మల యనిర్వచనీయప్రతిభం గూర్చి ముచ్చటింపఁ బూనుట నాయట్టి యల్పజ్ఞునకు సాహసకార్య మగుటం దెలిసియు దేవాలయంబున దేవునికి నమోవాకస్తుతులు యథామతి నర్పించునట్లు నీయాంధ్రసాహిత్యపరిషన్ముఖంబునఁ దదధిష్ఠానదేవత లగువారి స్మరియించి తన్మూలమున జిహ్వాశుద్ధిఁ బ్రాపింపఁ దలంచుటయే.

వర్తమానమున నాంధ్రభాషాసాహిత్య మలవఱిచికొనినవారి కెల్లరకును, గద్యపద్యాదిరూపంబుల భాషాసేవ యొనర్చు నాధునికాంధ్రకవుల కందఱకును, బ్రాచీనకవికృతగ్రంథరాజంబులే గదా యాధారములు. వివిధనిఘంటునిర్మాతలకు మాత్రము మాతృక యేది? ప్రాచీనకవులు ప్రయోగించిన శబ్దజాలమే గదా! ఇన్నివిధముల నాంధ్రవాఙ్మయము పెంపొంది చిరస్థాయిగా నుండుటకుఁ బ్రాచీనకవులే శరణ్యమై యుండ నేతాదృశప్రతిభాదు లాకవులయం దునికికిఁ గారణం బూహింపఁజాలక కొందఱీకాలమునఁ బ్రాచీనకవులకు సంస్కృతము రా దనియు, శాస్త్రపరిచయము లే దనియు, నొరుల ననుకరించుటయే గాని స్వకపోలకల్పనాశక్తి మృగ్య మనియుఁ, బ్రకృతిపరిశీలనము, ప్రపంచజ్ఞానము శూన్యము లనియు మున్నగునజ్ఞానమూలకము లగువాక్యములు పలుకుట వినవచ్చుచున్నది.

కేవలసంస్కృతభాషానిష్ణాతులై యాంధ్రభాషాస్వరూపము నెఱుంగని వారు ప్రాచీనకవులకు సంస్కృతజ్ఞానము తక్కువ యనియును శాస్త్రపరిచయము లే దనియు, నుండినచో సంస్కృతముననే గ్రంథనిర్మాణ మొనరించి యుందు రనియు వింతవాదము లొనర్చుటకుఁ గారణము వారికాంధ్రభాషాజ్ఞానము లేకుండుటయే. ఆంధ్రకవితానిర్మాణమునకు వలయు వస్తుసామగ్రి యంతయు సంస్కృతమునుండియే గ్రహింపఁదగియున్నది.

నన్నయాదిమహాకవు లందఱును గీర్వాణభాషార్ణవమును దఱిచి వివిధ శాస్త్రకళాపారంగతు లైనవారేఁ దటనే యాంధ్రకావ్యనిర్మాణమునకుఁ గడంగిరి. ఏతద్విషయికజ్ఞానము వారి గ్రంథములు పరిశీలించినఁ గానవగును. మూలమునకు భిన్నముగా భారతరామాయణాదులఁ దెనిఁగించుటలోఁ గవిత్రయమువారలయు, భాస్కరునియు నద్వితీయకావ్యకల్పనాస్వతంత్రత వెల్లడి యగుచున్నది, గాని, సంస్కృతము రామింజేసి యనవచ్చునా ?

నన్నయభట్టీయ మను నామాంతరముగల యాంధ్రశబ్దచింతామణి యను నాంధ్రవ్యాకరణమును నన్నపార్యుఁడు సంస్కృతముననే వ్రాసియున్నాఁడు. పాణినీయవ్యాకృతివిజ్ఞానమున నతఁడు పారంబు ముట్టినవాఁ డని యా గ్రంథముదెలుపుచున్నది. శాంత్యనుశాసనికపర్వములందలి విషయములు తిక్కనమహాకవికిఁ గల వేదాంతాదివివిధశాస్త్రపరిచయముఁ జాటుచున్నవి. ఆంధ్రభాగవతనిర్మాత యగు పోతనామాత్యుని వేదాంతశాస్త్రవిజ్ఞానపారమ్యము సామాన్యమా! శ్రీనాథకవిసార్వభౌముని గ్రంథములలోఁ దర్కవిజ్ఞానస్ఫోరకము లగుప్రయోగంబులు పెక్కులుగలవు. శృంగారనైషధములో, రణకండూభర ... కారణసంక్రాంతగుణానుషంగము, మున్నగునవి పెక్కులుగలవు. అష్టదిగ్గజము లని పేరొందిన పెద్దనాదిమహాకవుల గ్రంథములఁ బరిశీలించిన వారికిఁగలగీర్వాణభాషావైదుష్యమును, బెక్కుశాస్త్రంబులం గలయపారపరిచయమును గానవగును. ఉభయభాషాపదగుంఫనములతోఁ గవిత్వ మల్లునేర్పుని జూపుటకై పెద్దనచెప్పిన "పూఁత మెఱుంగు" అను మాలికంబరికింపుఁడు. "సంస్కృతంబు పచరించెడుపట్టున భారతీవధూటీ..."మను చరిత్రమునందు సంస్కృతపదభూయిష్ఠసమాసములు- చకితైణాపాంగి... అనాశ్వాసిత... కుశలత యేవ్రతముల నగునవశనాయాపీడ ... పవమానప్లవమాన... మున్నగునవి పెక్కులు గలవు. ప్రబలభల్లుకనఖభల్ల...

సంగీతశాస్త్రపరిచయమున కుదాహరణము- వాలారుంగొనగోళ్ళ-

జ్యోతిశ్శాస్త్రము- తేజంబబ్జభవాండ-

రామరాజభూషణునకు- సంస్కృతజటిలము. లలనా...

సంగీతము- నను శ్రీరామపదారవింద, అని చెప్పికొన్నారు. అరిగాఁబంచమమేవగించి నవలాలవ్వేళ.

జ్యోతిశ్శాస్త్రము-సారసశైరవంబులకుఁ జంద్రదినేంద్రవిరోధ మంచకుంభారము.

ఆముక్తమాల్యద- ఖనటత్పయోబ్ధిఫీక్ష్యరసాతలా ... కాంచెన్వైష్ణవుఁడర్థయోజన. పింగళి సూరనార్యుని రాఘవపాండవీయము శ్లేషకావ్యము గదా! సంస్కృతభాషయం దసాధారణపాండితి లేక యిట్టిమనోహరశ్లేషకావ్యము వ్రాయఁగలుగునా? ప్రభావతీప్రద్యుమ్నములోఁ బ్రద్యుమ్నునియెదుట శుచిముఖి పలికినవాక్యములు సూరనార్యుని తర్కశాస్త్రనిష్ణాతత్వమును దెలుపుచున్నది. కూచిమంచి తిమ్మకవిం గూర్చి కొందఱు సంస్కృతపండితు లితఁడు దెనుఁగుకవి యని తేలికగాఁ బలికి రఁట. అప్పు డాతఁడు 'నేను దెనుఁగుకవినే, గాని, గీర్వాణమునం గల మీాబుద్ధినైశిత్యము ప్రకాశించునట్లుగా నా యీా పద్యము నన్వయింపుఁ డని "పరిపఱపీలుకర్బురపురక్షణనుఁడు" అని చదివెనఁట-

ఆపద్యము నన్వయింపఁ జాలక తిమ్మకవికిఁ గలనవిశేషసంస్కృతవిజ్ఞానమున కచ్చెఱువడి తమకాంధ్రభాషాజ్ఞానము లేమికి సిగ్గువడి రఁట. ఆంధ్రకవి యనుటతోడనే సంస్కృతము రా దనునపోహము లోకమునఁ జాలవఱకు వ్యాపించి యున్నది. దానికిఁ గారణము లేకపో లేదు. వర్తమానకాలమునఁ గందము రాఁగానే కావ్యమును, ఆటవెలఁది రాఁగానే యవధానమును బ్రారంభించువారు పెక్కురు గలరు. అట్టివారి నాదర్శముగాఁ గొని పూర్వులకు సంస్కృతజ్ఞానమును శాస్త్రపరిచయము లే దనుట యవివేకమూలకము. గ్రంథములను సవిమర్శదృష్టితోఁ బఠించినఁగాని గ్రంథకర్తవిజ్ఞానపరిమితి యెఱుకపడదు. నేటిసాంస్కృతికులకుఁ బెక్కుమందికిఁ దమచదివిన గ్రంథములను గుఱించియే తెలియదు. కాళిదాసత్రయమును రచించినవా రెవరయ్యా యని ప్రశ్నింప 'వావిళ్ల రామస్వామిశాస్త్రిలవారు' అని చెప్పు కావ్యపాఠకులు గొందఱు గలరు. అట్టివారి కాంధ్రకవుల ప్రతిభ యెట్లు దెలియును?

ప్రాచీనకవులకు నొరుల ననుకరించుటయే గాని స్వకపోలకల్పనాశక్తి మృగ్య మని కొంద అన్యభాషాభిమాను లగు నవనాగరకుల యూపాతరమణీయవాక్కులు—ఒకఁడు గ్రంథాదిని షష్ఠ్యంతములు వ్రాసినఁ దక్కినవారుఁ గూడ షష్ఠ్యంతము లేనఁట. ఒకరినిజూచి మఱియొకరు కృతిపతివంశావతారము, పురము, అగర్తమున్నగువానిని వర్ణించుచున్నారఁట. ఇదియే యనుకరణమఁట.

ప్రబంధరచనకుఁ గొన్నిలక్షణము లుండవలయును. అందుచే వా రానియమములఁ బాటించి యష్టాదశవర్ణనలతోఁ బ్రబంధరచనఁ గావించిరి. అదియుంగాక పుర మనునది యిట్లుండవలె ననియును, రా జిట్టివాఁడు గా నుండవలయు

ననియు, లోకములో నాగరకత కాదర్శముగా నుండుటకు వ్రాసిరిగాని వారు వర్ణించిన ప్రతిపురము నట్లే యున్న దనుకొనరాదు. ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశః - అనునియమము ననుసరించి, ఇష్టదేవతా ప్రార్థనము, కృతిపతి కాశీస్సు మున్నగు వానితో గ్రంథారంభ మొనరించిరి. కృతిపతివంశవర్ణనము గూడ విడువరానిదే. సప్తసంతానములలో నొకటి యు నన్నింట మిన్నయు నగు కృతిని గన్యగా భావించి కృతిభర్తను జామాతగా సంభావించియిచ్చుచో నుత్సాహ మినుమడింప- ఏవంగుణవిశిష్టుఁడు తనకృతికన్యం గ్రహింపఁగలవాఁ డని కొన్నిపద్యాంతములతోఁ బేర్కొనుట యనవసరమా? కన్యాదాత యగువాఁడు కూఁతు వివాహసమయమున జామాతవంశమును బేర్కొనుటలేదా? గోత్రోద్భవాయ, పౌత్రాయ, పుత్రాయ, శర్మణేవరాయ-అని.

ఇంతయేల, మన మొకయుత్తరమును వ్రాయునపుడు ప్రారంభములో సంబోధనరూపమున మహారాజశ్రీ యనియో, వేదమూర్తులైన బ్రహ్మశ్రీ యనియో వ్రాయుచుండుట లేదా ? విద్వాంసుఁడు మొదలు ప్రాద్యునిపర్యంతము, నిట్టి నియమముఁ బాటించుటలేదా ? వార్షికసభాసమావేశము జరుగునపుడు పూర్వసభావినిశ్చితాంశములఁ జదువుట, యధ్యక్షుని ప్రారంభోపన్యాసము, మున్నగునవి లేకుండఁ గార్యక్రమము నడచుచున్నదా? స్వప్నమువచ్చుట, ప్రకృతిపరిశీలనము, ప్రపంచజ్ఞానము, ప్రాచీనులకు లేదనువిషయ మాలోచింతము. ప్రకృతిజ్ఞానములేదు, కూపస్థమండూకము లని పలువురు నాగరకమ్మన్యులు సాహసించి పలుకుచున్నారు. ప్రకృతిజ్ఞాన మన నేమిదియో యీనవనాగరకులకే తెలియదు.

భారత భాగవత రామాయణాది పురాణగ్రంథములలో వర్ణింపఁబడిన రాజనీతి, ధర్మములు, ఆరోగ్యశాస్త్రప్రశంస యేతన్మహాకవుల లోకజ్ఞానమును జాటుచున్నవి. అచారవిధులకు నారోగ్యమునకుఁ గలపరస్పరసంబంధమును దెలుపుచు వ్రాసినధర్మములు వారిలోకోత్తరప్రకృతిజ్ఞానము వెల్లడించుచున్నవి. అనుశాసనికపర్వ మందలి యీపద్యమును జూడుఁడు.

వృద్ధువచ్చునపుడు వినుబాలుప్రాణంబు, లెగయఁజూచు వాని కెదురులేచి
ప్రణతిఁజేసెనేని పాదునఁబడి యవి, లొంటియట్లు నిలుచు దురితదూర.

పోతనగారి భాగవతములో భూగోళశాస్త్రమును విపులముగా వర్ణించి యున్నారు. భూమిగుండ్రముగానున్నదా చదునుగానున్నదా యనువిషయమొక ప్రశ్నయే గాదు. ధరావలయము, భూవలయము, నని వాడియున్నారు. శ్రీనాథ

కవి, శృంగారనైషధములో విద్యుద్దీపములను 'ఒకదీపమార్పిన నున్నదీపంబులు నప్పుడె తమకుఁదా మాఱుటయును' వర్ణించినాఁడు.

ఆముక్తమాల్యదలోని యొకయుదాహరణము:—

"తరుణుల్ తల్లియొఱంగుచంబులునుపందచ్చె" శ్లో॥కూపోదకంవటచ్ఛాయా...

ఇంకను దక్షుంగల ప్రబంధములలో-పర్వతములు వానియందు గను లుండుట, లోయలు, నిర్ఝరములు, జలపాతములు, అరణ్యములు, వేఁటలు, జంతుస్వభావములు- వృక్షవిశేషములకు నొనరించు దోహదక్రియలు- ఎంతయద్భుతముగా వర్ణింపఁబడినవో- ఇవి యన్నియు వారికిఁగల లోకజ్ఞానమును బ్రకృతిపరిశీలనమును స్ఫురింపఁజేయుటలేదా.

ప్రభావతీప్రద్యుమ్నములో 'పోలో' ఆట రమణీయముగా వర్ణింపఁబడినది. "ఎగురఁగవై చికొట్టుటది." సుమతిశతకము- లోకజ్ఞానసారము.

తపస్సంపన్నత- ఈయన్నింటికంటెను వారిప్రతిభకు వన్నెతెచ్చునది వారి పవిత్రజీవితము, తపస్సంపన్నతయును.

పంచమవేదమగు భారతమునుఁ దెనిఁగించుటకు మున్నుగా, తిక్కనగారు యజ్ఞముచేసినట్లు వినుచున్నారము. ఇంతియె గాక యితఁడు శుచియై నందిశంకర మధ్యంబునం గూరుచుండి తననోట నసంబద్ధవాక్యము వచ్చెనేని నాలుకను గోసికొందు నని ప్రతినంజేసికొని భారతగ్రంథరచనకుఁగడంగెనందురు. అట్లు కవితాధార నడచుచుండగా నొకచోట-కృష్ణార్జును లిరువురు తమశంఖంబులం బూరించిరని వర్ణించుటలో "దేవదత్తంబుపూరించె," అందులకుం బ్రతిజ్ఞాభంగము కాఁగా నాలుక గోసికొన సంసిద్ధుఁడయ్యెను. అప్పుడు కృతిపతి యగుహరిహరనాథుఁడే సాక్షాత్కరించి "మున్నుగ" అన్నట్లు వినవచ్చి యప్పుడు సమర్థించుకొన్నట్లు వినికిగలదు. పిల్లలమఱ్ఱి పీరభద్రకవి జైమినిభారతమును వ్రాయుటంగూర్చి 'ఒకనాఁటి రాత్రి సహస్రబాహువులతో సరస్వతియే పూరించినట్లు' గాథలు కలవు. రామరాజభూషణుఁడు, అయ్యలరాజు రామభద్రకవి మున్నగువా రందఱు నాంజనేయోపాసకులని, రామోపాసకులని వినుచున్నారము. అడిదము సూరకవి తపశ్శక్తి వాక్శుద్ధిని గూర్చి కొన్ని నిదర్శనములుగలవు. శుచిర్విప్రశ్శుచిః కవిః-వారినాఁటిదే. ఇట్టి ప్రతిభావిశేషములు ప్రాచీనకవులకు సహజముగా నుండుటచేతనే యాంధ్రవాఙ్మయ మొక్కొక్కకాలమున నొక్కొక్కరీతిఁ బెంపువహించి శోభిల్లుచున్నది.

"మహిమముఃవాగనుశాసనుండు."

భాసుఁడు.

—: కిళాంబి రాఘవాచార్యులుగారు ఎం. ఏ., బి. ఎల్., కాకినాడ :—

(1) తిరువనంతపుర నాటకములు.

మహాకవి భాసునింగూర్చియు నతనినాటకములను గూర్చియును బ్రశంస లొనర్పకపూర్వము సంస్కృతవాఙ్మయమున నాటకము లేకాలమున రచింపఁబడినవో, యవి యేరీతి నుత్పత్తి నొందినవో, యెటులు వికాసమును గాంచినవో మనము దెలిసికొనవలసియున్నది. కావ్యములు దృశ్యశ్రవ్యభేదములచే ద్వివిధములు. దృశ్యకావ్యములును రూపకములు, నుపరూపకము లని విభజింపఁబడినవి. నాటకము, ప్రకరణము, భాణము, ప్రహసనము, డిమము, వ్యాయోగము, సమవకారము, వీథి, అంకము, ఈహామృగము, అని రూపకములు పది. గోష్ఠీ, రాసక, హల్లీసక ప్రేంఖణాదులు పదునెనిమిదియు నుపరూపకములు. వస్తు (Plot) నేతృ (Hero) రసాదుల (Sentiment) భేదములచే రూపకభేదములు గలుగుచున్నవి.

'నట-అవస్పందనే' అనుధాతువునుండి నాట్యము, నటుఁడు, నాటకము, మున్నగుశబ్దములు జనించుచున్నవి. కావ్యోపనిబద్ధధీరోదాత్తాదినాయకులఁ జతుర్విధాభినయముచే ననుకరించుచుఁ దాదాత్మ్యమునుఁ జెందుట నాట్యమనఁబడును. నటునియందు రామాదులయవస్థల నారోపించుటచే నది రూపక మనఁబడి, రసాశ్రయముచే నాటకప్రకరణాది దశగతుల నందుచున్నది. రసాశ్రయముగాక గాత్రవిక్షేపార్థక మగునది నృత్యము. తాళలయాశ్రయము నృత్తము. ఇవి రెండును లాస్యతాండవభేదంబులచే ద్వివిధము. (దశరూపకము ప్రథమప్రకాశము శ్లో. 7-10)

ప్రాచ్యపాశ్చాత్యదేశములఁ బ్రథమమున నృత్తనృత్యములే కానవచ్చుచున్నవి. కాలక్రమమున నాటకము లుద్భవించినయవి. పాశ్చాత్యవాఙ్మయములందు నాటకములు మొదట మతవిషయక మగుగాథలఁ బ్రదర్శించుచుండెడి వని విమర్శకు లంగీకరించి యున్నారు (Mystery Plays) కాని హిందూదేశమునఁ బ్రాచీనకాలమునం దట్టివి గలవా యనువిషయ మింకను నిర్ణయ మొనర్పవలసియున్నది. సంస్కృతనాటకరచనము మతముపై నాధారపడి యుండలే దనియుఁ గేవలము లౌకికవిషయములనుబట్టియే వ్యుత్పత్తిని గాంచె ననియుఁ గొందఱు వాదించుచున్నారు. అదియే సమంజస మని తోఁచుచున్నది. భరతుని నాట్య

శాస్త్రానుసార మింద్రాదులు బ్రహ్మను దృశ్యమును, శ్రవ్యము నగు క్రీడనీయక మును సర్వవర్ణోపయోగముగ సృజింప వేఁడి రనియుఁ బరమేష్ఠియుఁ బంచమ వేద మగునాట్యవేదమును సృజించుచు నాసృష్టియందు ఋగ్వేదమునుండి పాఠ్య మును, సామమునుండి గీతమును, యజుర్వేదమునుండి యభినయమును, నాల్గ వది యగు యథర్వణమునుండి రసమును గైకొనియె ననియు, నాతని యాజ్ఞాను సారము భరతునిపుత్త్రు లగుశాండిల్యాదు లతనితోఁ బ్రయోగాదులఁ బ్రదర్శించి రనియుఁ దెలియుచున్నది. దీనివలన నాట్యవేదము చతుర్వేదానంతరము రచింపఁ బడిన దనుట స్పష్టము. ఇది భారతీయుల నాటకరచనోత్పత్తివిషయిక మగు ప్రాచీ నగాథ నై యున్నది.

నాటకరూపము ననుసరించు సంభాషణములు కొన్ని వేదములందుఁ గలవు. ఈసంభాషణములే సంస్కృతనాటకరచనమునకు మూలము లనుట యతి శయోక్తి. పాణినికాలమునాఁడు నటసూత్రములు గల వనియు ను, నవి 'శిలాలి' 'కృశాశ్వ' ప్రణీతము లనియు మనకుఁ దెలియును.

పారాశర్యశిలాలిభ్యాం భిక్షునటసూత్రయోః- అష్టా-4-3-110
కర్మన్దకృశాశ్వాదినిః- ,, 4-3-111

క్రీ. శ. 2 వ శతాబ్దమువాఁ డగుపతంజలి తనమహాభాష్యమున శౌభికులు 'కంసవధ'ను 'బలిబంధము'ను బ్రదర్శించుచుండి రని తెలిపియున్నాఁడు. మఱియు నశ్వఘోషుని శారీపుత్త్రప్రకరణభాగములు కొన్ని యిటీవల దొరకినవి. ఈతఁడు కాళిదాసునకుఁ బూర్వుఁడా యర్వాచీనుఁడా యనువిషయ మింకను విమర్శకులు చర్చించుచున్నారు. తరువాత భాసుఁడు, శూద్రకుఁడు, కాళిదాసుఁడు, భవభూతి, మురారి, విశాఖదత్తుఁడు, రాజశేఖరుఁడు మున్నగుప్రఖ్యాతకవీశ్వరులు తమతమ నాటకములచేసంస్కృతవాఙ్మయమును వృద్ధిపొందించిరి. సంస్కృతనాటక రచనము పాశ్చాత్యనాటకములపై నాధారపడి యున్నదనియును, 'యవనికా', 'యవనీభిః పరివృతః' అనుచోట 'యవన' (Greek) సంబంధము సూచింపఁబడి యున్న దనియు ను పాశ్చాత్యవిద్వాంసుల యభిప్రాయ మైయున్నయది. ఇది సరి కాదు. సంస్కృతనాటకరచనము స్వతంత్రముగ మనదేశముననే యుద్భవించి యభివృద్ధిని గాంచిన దనియు, నన్యదేశీయనాటకరచనము ననుకరించుట లేదనియుఁ బలువురు పండితులు నిర్ధారణ మొనర్చియున్నారు.

క్రీ. శ. 1912 వ సంవత్సరప్రాంతమున ననంతశయనము (Trivendrum) సంస్కృతగ్రంథప్రకాశనకార్యాలయాధ్యక్షు లగు మహామహోపాధ్యాయ టి.

గణపతిశాస్త్రిగారు నాలు గయిదు తాళపత్రగ్రంథములను సేకరించి యందుఁగల రూపకముల 'ననంతశయనసంస్కృతగ్రంథావళి' యందుఁ బ్రకటించిరి. ప్రథమమున 'స్వప్నవాసవదత్త' మను నాటకమును దమగ్రంథావళియందుఁ బదునైదవగ్రంథముగఁ బ్రకటించుచుఁ గాళిదాసాదికవులచేఁ బ్రశంసింపఁబడిన భాసమహాకవియే యీనాటకముల రచించె నని సహేతుకముగఁ దమయుపోద్ఘాతమునఁ జర్చించిరి. నాఁటినుండియుఁ బ్రాచ్యపాశ్చాత్యపండితులు గణపతిశాస్త్రిగారి వాదమునకు ఖండనమండనములుగఁ బెక్కువ్యాసముల రచించియున్నారు. వానిలో ముఖ్యమయినవి మొదటియనుబంధమునఁ జూడనగును. భాసుని వని వారు ప్రకటించిన నాటకము లిట నుదాహృతములు.

	అనంతశయనగ్రంథావళిసంఖ్య.
1. స్వప్నవాసవదత్తము.	15
2. ప్రతిజ్ఞాయౌగంధరాయణము.	16
3. పంచరాత్రము.	17
4. అవిమారకము.	20
5. బాలచరితము.	21
6. మధ్యమవ్యాయోగము.	22
7. దూతవాక్యము.	22
8. దూతఘటోత్కచము.	22
9. కర్ణభారము.	22
10. ఊరుభంగము.	22
11. అభిషేకనాటకము.	26
12. చారుదత్తము.	39
13. ప్రతిమానాటకము.	42

వీనియందు స్వప్నవాసవదత్తాప్రతిజ్ఞాయౌగంధరాయణములు వత్సరాజునకు సంబంధించినవి. ప్రతిమాభిషేకములు రామాయణకథ ననుసరించినవి. ప్రతిమానాటకమున నయోధ్యాకాండమునందలి కథయు సీతాపహరణమును, జటాయుమరణమును రావణవధయు వర్ణింపఁబడినవి. అభిషేకనాటకమునఁ గిష్కింధాసుందరయుద్ధకాండములయందలి కథ యనుసంధింపఁబడినది.

మధ్యమవ్యాయోగము, దూతవాక్యము, దూతఘటోత్కచము, కర్ణభారము, ఊరుభంగము, పంచరాత్రమును భారతకథను వర్ణనమొనర్చును. అందు మొదటి యయిదునాటకము లేకాంకపరిమితములు. పంచరాత్రమున మూఁడంకములు గలవు.

బాలచరితమునఁ గృష్ణునిబాల్యక్రీడావర్ణనమునుఁ గంసవధయును గలవు. అవిమారకనాటకేతివృత్తము పురాణసంగ్రథితము కాదు. కథాసరిత్సాగరమునందలి కథపై నాధారపడియున్నది. చారుదత్తమునందలికథ వసంతసేనాచారుదత్తుల ప్రణయవృత్తాంతము.

విమర్శకు లీనాటకము లేకకర్తృకములా, యేకకర్తృకము లగుచో నివి భాసవిరచితములా? భాసుని దేశకాలము లెవ్వి యనువిషయముల భిన్నాభిప్రాయు లగుచున్నారు. భాసుఁడే యీనాటకముల రచించెననువారును నాతనికాలనిర్ణయమును గూర్చి భిన్నాభిప్రాయులై యున్నారు. కొందఱతని క్రీ. పూ. 4 వ శతాబ్దమువాఁ డగుకౌటిల్యునికిఁ బూర్వుఁ డనియు, మఱికొందఱు క్రీ. పూ. 2 వ శతాబ్దమువాఁ డగుపతంజలికిఁ బూర్వుఁ డనియు వాదించుచున్నారు. కొందఱు పతంజలి కితఁ డర్వాచీనుఁ డని యొప్పికొనియు, నశ్వఘోషుని (వారిమతానుసారము క్రీ. శ. 1, 2 శతాబ్దములు) కిఁ బూర్వుఁడా యనువిషయమున సంశయగ్రస్తు లగుచున్నారు. తిరువనంతపురనాటకములు భాసునివి కావనివాదించు బార్నెటు (Barnett), భట్టనాథస్వామి, పిషరటీ మున్నగువారు వీనిని క్రీ. శ. 8, 9 శతాబ్దముల దక్షిణహిందూస్థానమున బాణకాళిదాసుల యనంతరము రచింపఁబడినవానిగఁ బరిగణించుచున్నారు. వారివారివాదములఁ గలముఖ్యవిషయముల సంగ్రహముగ విమర్శించి తిరువనంతపురనాటకముల కర్తృత్వమును భాసునిదేశకాలములను జర్చించుటయే యీవ్యాసముయొక్క ముఖ్యోద్దేశము.

(2) భాసుని ప్రాచీనత్వము.

మహాకవుల జీవితచరిత్రమును వ్రాయుట కుపకరించు సాధనములు మనదేశమునఁ జాల విరళముగ నున్నవి. కాళిదాసాదిమహాకవులు వారిగ్రంథములవలనను బరంపరాగత మగు గాథలవలనను వాఙ్మయమునం దితరకవుల ప్రశంసావాక్యములవలనను మనకుఁ బరిచితు లగుచున్నారు. వారిదేశకాలములు జీవితవిశేషములు మనకుఁ దెలియుటలేదు. భాసమహాకవిని గూర్చియు నట్టి గ్రంథాంతరసూచనములే మన కాధారము లగుచున్నవి.

సంస్కృతవాఙ్మయమునందలి కావ్యనాటకాలంకారవ్యాఖ్యాన గ్రంథముల వలన మనకు భాసమహాకవి ప్రాచీనుఁ డనియు, సుప్రసిద్ధనాటకకర్త యనియునుఁ దెలియుచున్నది. కవిసార్వభౌముఁ డగుకాళిదాసుఁడు తనమాళవికాగ్నిమిత్రప్రస్తావనయందు 'ప్రథితయశసాం భాస సౌమిల్లక కవిపుత్రాదీనాం ప్రబంధా నతిక్రమ్య వర్తమానకవేః కాళిదాసస్య క్రియాయాం కథం బహుమానః' అని భాసాదులనుఁ గీర్తించియున్నాఁడు[1]. దీనికి 'భాస కవిపుత్ర సౌమిల్లకాః కవయః ప్రాక్తనాః' అని కాటయవేముఁడు వ్యాఖ్యాన మొనర్చెను. 'ప్రథితయశసాం' అనుట వలనను, 'పురాణమిత్యేవ న సాధు సర్వం' అని స్వవిరచిత నాటకోత్తరమునఁ బలుకుచు 'పురాణ' శబ్దప్రయోగ మొనర్చుటవలనను, భాసుఁడు ప్రాచీనుఁ డనియుఁ, గాళిదాసునికాలమునకే ప్రథితయశస్కుఁ డనియు నిస్సందేహముగఁ జెప్పవచ్చును. 'వర్తమానకవేః' యనునది కూడ దానినే సూచించుచున్నది.

2. కాదంబరీహర్షచరితముల రచియించిన బాణుఁడు (క్రీ. శ. 7 వ శతాబ్దము) హర్షచరితమున (శ్లో. 15) భాసు నీవిధముగఁ బ్రస్తుతించియున్నాఁడు.

"సూత్రధారకృతారమ్భై ర్నాటకై ర్బహుభూమికైః
సపతాకై ర్యశో లేభే భాసో దేవకులై రివ"

సూత్రధారునిచే నారంభింపఁబడి, పెక్కుపాత్రములఁ గలిగి పతాకయుతము లగునాటకముల రచియించి భాసుఁడు కీర్తి నార్జించె నని దీనియర్థము. ఇందు భాసునినాటకములందుఁ గలవిశేషలక్షణములు దెలుపఁబడినవి. తిరువనంతపుర నాటకములం దివి కలవా యనువిషయము ముందు విమర్శింపఁబడును.

3. దండి తనయవంతీసుందరీకథయందు (దక్షిణభారతీగ్రంథమాల 3 వకుసుమము) భాసు నిట్లు కీర్తించెను.

సువిభక్తముఖాద్యఙ్గై ర్వ్యక్తలక్షణవృత్తిభిః
పరేతోపి స్థితో భాసః శరీరై రివ నాటకైః (శ్లో-11)

4. క్రీ. శ. 8 వ శతాబ్దమునాఁటి దగు వాక్పతిరాజకృత 'గౌడవధ' మను ప్రాకృతకావ్యమున-

"భాసమ్మి జలణమిత్తే కంతీదేవే అజస్సరహుఅ ఆరేసో బంధవే అ బంధమ్మి హారియందే అ ఆణందో" అని కలదు. దీనివలన భాసుఁడు జ్వలనమిత్రుఁ డనియు

1. భాసధావకకవిపుత్రాదీనాం, భాస్కరసౌమిల్ల కవిపుత్రాదీనాం అనియుఁ బాఠభేదములు గలవు.

నాతనినాటకము లగ్నిలోఁ బరీక్షింపఁబడుటచే వాక్పతిరాజులు వ్రాసె ననియుఁ బండితులయభిప్రాయము. ఇట జ్వలనమిత్త్రుఁ డనుచో నగ్నిమిత్త్రుఁ డనుపర్యాయ నామము గలశూద్రకుఁడు సూచింపఁబడె ననియు, భాసశూద్రకు లొకరే యని యు నొకవిమర్శకులు వ్రాసియున్నారు.[1] ఇది ముందువిమర్శింపఁబడును.

5. అభినవగుప్తుఁడు (క్రీ. శ. 10 వ శతాబ్దము)తననాట్యవేదవివృతియందు 'మహాకవినా భాసేన నాపి స్వప్నబంధే ఉక్తః' అని యొకశ్లోకము నుదాహరించి యున్నాఁడు. మహాకవి యగుభాసుఁ డభినవగుప్తునిచేఁ బేర్కొనఁబడె ననుటయే మన మిటఁ గైకొనఁదగినది.

6. 'ఉదయసుందరీకథ' ను రచియించిన సోఢలకవి (A. D. 1050) భాసు నిట్లు నుతించియున్నాఁడు.[2]

బభూవు రన్యేఽపి కుమారదాస, భాసాదయో హంత కవీందవ స్తే
యదీయగోభిః కృతినాం ద్రవంతి, చేతాంసి చంద్రోపలనిర్మలాని (నిర్మితాని).

7. క్రీ. శ. 11 శతాబ్దమువాఁ డగుభోజుఁడు తనసరస్వతీకంఠాభరణమునఁ గాళిదాసు నిట్లు ప్రస్తుతించియున్నాఁడు. ఆశ్లోకమునభాసునిప్రశంసకూడఁ గలదు.

"భాసయ త్యపి భాసాదౌ కవివర్గే జగత్త్రయమ్
కే న యాంతి నిబంధారః కాళిదాసస్య దాస్యతామ్."

8. రామచంద్రగుణచంద్రు లనుకవులు (A. D. 1175) తమనాట్యదర్పణమునందు భాసుని స్వప్నవాసవదత్తములోని దని యీశ్లోకము నిచ్చియున్నారు.[3]

యథా భాసకృతే స్వప్నవాసవదత్తే—శేఫాలికా మణ్డపశిలాతలా నవలోక్య వత్సరాజః—

'పాదాక్రాంతాని పుష్పాణి సోష్మ చేదం శిలాతలమ్
నూనం కాచి దిహాసీనా మాం దృష్ట్వా సహసా గతా.'

భాసుఁడు స్వప్నవాసవదత్తమును రచియించె నని దీనివలన స్పష్టము. ఇది తిరువనంతపురనాటకమున లేమి, యీనాటకము భాసకృతము గా దని కొందఱయభిప్రాయము. దానిని ముందు విమర్శింతును.

9. సోమదేవుని యశస్తిలకమున—

"పేయా సురా ప్రియతమాముఖ మీక్షణీయం, గ్రాహ్యః స్వభావలలితో వికె

1. The Problem of Bhasa by K. G, Sankar.
2. Baroda Edition- P 154.
3- ,, P 84.

టశ్చ వేషః । యేనేద మీదృశ మదృశ్యత మోహవర్త్మ, దీర్ఘాయు రస్తు భగ

వా నస పినాకపాణిః" ॥

అను శ్లోకము భాసుని దని కలదు. కాని, యిది మహేంద్రవర్మవిరచిత మగు"మత్తవిలాసప్రహసనము"నఁ గననగుటచే సోమదేవుఁడు ప్రమాదవశమున న ట్లుదాహరించి యుండు నని తోఁచుచున్నది.

10. జయదేవకవి (13 వ శతాబ్దము) ప్రసన్నరాఘవనాటకప్రస్తావనయం దుఁ గవితాకన్యకకు భాసుఁడే హాస మనియు, గవికులగురుం డగు కాళిదాసుఁడే విలాస మనియు స్తుతించి యున్నాఁడు.

'భాసో హాసః కవికులగురుః కాళిదాసో విలాసః'.

11. జయానకుఁ డనుకవి తన 'పృథ్వీరాజవిజయ' మున (దీనికే 'పృథ్వీమహేంద్రవిజయ మ'ను నామాంతరము కలదు.)

"సత్కావ్యసంహారవిధౌ ఖలానాం దీప్తాని వహ్నేరపి మానసాని

భాసస్య కావ్యం ఖలు విష్ణుధర్మా త్సోప్యాననాత్ పారతవ న్ముమోచ.

అని వ్రాసియున్నాఁడు. దీనికి జోనరాజు [క్రీ. శ. 15 వ శతాబ్దమున] వ్యాఖ్యాన మొనర్చెను.

(సతాం కావ్యం తద్విషయే సంహారవిధౌ దాహే దోషారోపేణ అగ్నేరపి సకాశాత్ దుర్జనానాం చిత్తాని దీప్తాన్యుజ్జ్వలాని భవంతి. అత్రసాధనమాహ. సోగ్నేరపి భాసమునేః కావ్యం విష్ణుధర్మా ముఖాత్తశ్శక్త్వా నాదహదిత్యర్థః. అత ఏవ పారతవ దిత్యుపమా. అగ్నిర్హి వ స్త్వంతరవత్పారతందగ్ధుమశక్తో ముఖాన్ముంచతి. భాసవ్యాసయోః కావ్య విషయే స్పర్ధాంకుర్వతో సర్వోత్కర్షవర్తిత్వేన పరీక్షకాంతరాభావాత్ పరీక్షార్థ మగ్నిమధ్యే తయో ర్ద్వయోః కావ్యద్వయం క్షిప్తం. తయో ర్మధ్యాత్ అగ్ని ర్విష్ణుధర్మా నాదహ దితి ప్రసిద్ధిః-ఖలైస్తు ప్రాప్తం సత్కావ్యం దహ్యతే ఇత్యగ్నేస్సకాశాత్ ఖలానాం దాహకత్వ మిత్యర్థః)—

పై శ్లోకార్థమును గుఱించిగణపతిశాస్త్రిగారు స్వప్నవాసవదత్తపీఠికయం దు విపులముగఁ జర్చించిరి. భాసుఁడు విష్ణుధర్మము లను గ్రంథమును రచియించె ననియు, దాని నగ్ని దహింపక విడిచె ననియుఁ గొంద ఱభిప్రాయపడుచున్నారు.[1] కాని శ్లోకమునందు 'విష్ణుధర్మా' అనుటకు 'విష్ణుధర్మా' అనియు 'పారతవత్'

1- Indian Antiquary—Vol XLII – 1913–P 52.
'a Poem by Bhasa' by C. Guleri.

అగుటకు 'భారతవత్' అనియుఁ బఠించినచో సర్థసమన్వయ మగు నని మఱియొకరు వ్రాసియున్నారు.[1] అటు లయినచో జోనరాజు వ్యాఖ్యాన మసందర్భముగ నుండును. భాసవ్యాసులకావ్యము లగ్నింబరీక్షింపఁబడెననిన నిరువురు నొకవిషయమును గుఱించియే వ్రాసి రనవలయును గదా. భారతకథావిషయకములగు పంచరాత్రాదినాటకముల భాసుఁడు రచించె నన్నను, నాతని స్వప్నవాసవదత్తమును బరీక్షార్థము గైకొననేల? అందువలన 'పారతవత్' అనుపాఠమునే గ్రహించి 'విష్ణుధర్మక' అని పఠింపవలయునేమో? అపుడు 'సోఽప్యనలాత్' అనుచోఁ బునరుక్తిదోషము ఘటిల్లును. భాసుఁడు రచియించినకావ్య మొకటియగ్నిదగ్ధము కాలే దనియే దీనినిశ్చితాంశము. పైవ్యాఖ్యానమున భాసుఁడు 'ముని' యని వర్ణింపఁబడుటచే నాతని ప్రాచీనత స్థిరపడుచున్న దని గణపతిశాస్త్రిగారు వ్రాసియున్నారు.

12. జల్హణుని సూక్తిముక్తావళియందు రాజశేఖరుని దని యీశ్లోక ముదాహరింపఁబడినది.

"భాసనాటకచక్రేపి ఛేకైః క్షిప్తే పరీక్షితుమ్
స్వప్నవాసవదత్తస్య దాహకోఽభూన్న పావకః"—

ఈశ్లోకమున భాసకవి పెక్కునాటకముల రచించె ననియు, నందు స్వప్నవాసవదత్త మనునాటక మొక్కటియే యగ్నిచే దహింపఁబడలే దనియుఁ దెలుపఁబడినది. ఇది భాసనాటకములలో స్వప్నవాసవదత్తోత్కర్షమునుఁ గూడ సూచింపుచున్నది.

13. క్రీ. శ. 1360 ప్రాంతమున రచింపఁబడిన శార్ఙ్గధరపద్ధతియందు భాసుని రామిలసౌమిలులతోఁ జేర్చినిన శ్లోక మొకటి గలదు.

భాసో రామిలసోమిలౌ వరరుచిః శ్రీసాహసాంకః కవి
ర్మేంఠో భారవికాళిదాస తరలాః స్కంధః సుబంధుశ్చ యః
దండీ బాణదివాకరౌ గణపతిః కాంతశ్చ రత్నాకరః
సిద్ధా యస్య సరస్వతీ భగవతీ కే తస్య సర్వేఽపితే. (188)

ఇదియు 'భాససౌమిల్లకాదీనాం'అను కాళిదాసుని వాక్యమువలె భాసుని ప్రాచీనత్వమును విశదీకరించుచున్నది.

---

1. "The Problem of Bhasa" by K. G. Sankar. Sir Ashutosh memorial Volume Part II at Page 43.

14. శాకుంతలనాటకమునకు రాఘవభట్టు రచియించిన వ్యాఖ్యానమున (నిర్ణయసాగరప్రతి పు. 2.)

భాసుఁడు భరతునినాట్యశాస్త్రమును బోలుగ్రంథము నొకదాని రచించె నని తెలుపఁబడినది.

"అత్రాశిషి సభ్యానాం లాభః। అత ఏవ ఆశీర్నమస్క్రియారూపాః ఇతి భరతేన। భాసేనాపి 'ఆశీర్నమస్క్రియావస్తు' ఇత్యాదా వేవ ఆశీర్నిబద్ధా".

ఆలంకారికు లెవ్వరు ను భాసునిఁ బ్రాచీనాలంకారికునిగఁ గీర్తించి యుండ లేరు. అందువలన రాఘవభట్టు వ్యాఖ్యానమున నుదాహరించిన భాసుఁడు సుప్రసిద్ధనాటకకర్తయా లేక మఱి యొకఁడా యనుసందేహము కలుగుచున్నది.

పైవిషయములవలన భాసమహాకవి ప్రాచీనుఁ డని యు, స్వప్నవాసవదత్తాదినాటకముల రచియించె ననియుఁ, గాళిదాసునకుఁ గొన్నిశతాబ్దము లైనను బూర్వుఁడై యుండు ననియు విస్పష్ట మగుచున్నది.

---

(3) తిరువనంతపురనాటకము లేకకర్తృకములు.

గణపతిశాస్త్రిగారిచే భాసుని వని నిర్ధారణ మొనర్పఁబడిన పదుమూఁడు నాటకము లేకకర్తృకము లని ప్రథమమున నిరూపించి యనంతరము వానిరచయిత భాసుఁ డని మతము సిరపఱుపవలసి యున్నది. ఈక్రిందియంశములవలన వాని నన్నిటి నొకకవియేః రచించియుండు నని సహృదయు లంగీకరింపక మానరు.

1. ఈనాటకచక్రమునందుఁ బ్రతినాటకమును 'నాన్ద్యన్తే తతః ప్రవిశతి సూత్రధారః' యనువాక్యముతోఁ బ్రారంభింపఁబడినది. తరువాత మంగళశ్లోకము పఠింపఁబడినది.

స్వప్నవాసవదత్తమునందు—

"(నాన్ద్యన్తే తతః ప్రవిశతి సూత్రధారః)

సూత్రధారః -

ఉదయనవేన్దుసవర్ణా వాసవదత్తాబలౌ బలస్య త్వామ్। పద్మావతీర్ణపూర్ణౌ వసన్తకమ్రౌ భుజౌ పాతామ్."

అసంపూర్తిగ లభించిన చారుదత్తనాటకమందుఁ దక్క మిగిలిన యన్నినాటకములందును మంగళశ్లోకము సూత్రధారప్రవేశానంతరమే కననగును.

2. మఱియు నీనాటకములలో 'ప్రస్తావనా' యనుటకుబదులు 'స్థాపనా' యని యుపయోగింపఁబడినది. కర్ణభారమున మాత్రము 'ప్రస్తావన' యనియే కలదు.

3. 'ప్రస్తావన'యందుఁ గవినామము గాని, గ్రంథనామము గాని, కాళిదాసాదుల నాటకములందువలె, సూచింపఁబడలేదు. 'పూర్వకవుల నాటకములుండ వర్తమానకవుల నాటకములేల ప్రదర్శింపఁబడవలయు' ననువిమామాంసయే లేదు.

"పురాణ మి త్యేవ న సాధు సర్వం
న చాపి కావ్యం నవ మి త్యవద్యమ్"-అనియు—
"ఏనామ కేచి దిహ నః ప్రథయం త్యవజ్ఞాం
జానన్తి తే కిమపి తాన్ప్రతి నైష యత్నః—
అనియుఁ గవి మెచ్చుటను స్వోత్కర్షాపాదకముగఁ బలికి యుండలేదు.

4. మంగళశ్లోకానంతరము సూత్రధారుఁడు-

'ఏవ మార్యమిశ్రాన్ విజ్ఞాపయామి। అయే కిం ను ఖలు మయి విజ్ఞాపనవ్యగ్రే శబ్ద ఇవ శ్రూయతే! అఙ్గ పశ్యామి!' అని పలుకును. ఈవాక్యములే స్వప్నవాసవదత్త, పంచరాత్ర, దూతఘటోత్కచ, బాలచరిత, మధ్యమవ్యాయోగ, దూతవాక్య, ఛిపే.కో॰రుభంగ నాటకములందును గలవు. ప్రతిజ్ఞాయౌగంధరాయణావిమారకప్రతిమానాటకములందు-

"నేపథ్యాభిముఖ మవలోక్య- ఆర్యే. ఇతస్తావత్" అని కలదు.

స్వప్నవాసవదత్తాదులయందును, బ్రతిజ్ఞాయౌగంధరాయణాదులయందును బ్రస్తావనానంతరమునఁ బాత్రికచే వస్తుసూచన మొనర్పఁబడినది- ఇటఁ బూర్వపక్షము:—'భాసనాటకచక్ర మ'ని పేర్కొనఁబడిన నాటకములయందేకాక మఱియితరనాటకములందుఁ గూడఁ బ్రారంభమున 'నాన్ద్యన్తే తతః ప్రవిశతి సూత్రధారః' అని కలదు. ప్రస్తావనకు 'స్థాపన'యనియు నుపయోగింపఁబడినది. కొన్నినాటకములయందు 'అయే-కిం ను ఖలు మయి విజ్ఞాపనవ్యగ్రే శబ్ద ఇవ శ్రూయతే-అఙ్గ పశ్యామి' అనియు వ్రాయఁబడియున్నది. మహేంద్రవిక్రమవర్మవిరచిత మగు 'మత్తవిలాసప్రహసనము,' శక్తిభద్రుని 'ఆశ్చర్యచూడామణి,' కులశేఖరుని 'తపతీసంవరణ' 'సుభద్రాధనంజయము'లును, వరరుచికృత మగు 'ఉభయాభిసారిక' ఈశ్వరదత్తుని 'ధూర్తవిటసంవాదమును', శూద్రకుని 'పద్మప్రాభృతికము', శ్యామలకుని

'పాదతాడితకము'ను జూడ నగును. దిఙ్నాగుని కుందమాలయందు 'ప్రస్తావనా' యనుటకు 'స్థాపనా' యనియే కలదు.

కావ్యార్థసూచకమును, ఆశీర్నమస్క్రియారూపమును నగుశ్లోకము నాంది నాఁబడును. ['ఆశీర్నమస్క్రియారూపః శ్లోకః కావ్యార్థసూచకః నాన్దీతి కథ్యతే' ఇతి భరతః] ఆనాందీశ్లోకమును సూత్రధారుఁడే పఠింపవలయును.

"సూత్రధారః పఠే న్నాన్దీం మధ్యమం స్వరమాశ్రితః
నాన్దీ పదైః ద్వాదశభి రష్టాభి ర్వా ప్యలంకృతామ్."

నాట్యవస్తువునకుఁ బూర్వము రంగవిఘ్నోపశాంతికొఱకుఁ గుశీలవులొనర్చునది పూర్వరంగ మనఁబడును. దశరూపకమునందు-

"పూర్వరంగం విధా యాదౌ సూత్రధారే వినిర్గతే
ప్రవిశ్య తద్వ దపరః కావ్య మాస్థాపయే న్నటః.
అన్యత్రాపి.
ప్రయుజ్య రంగం నిష్క్రామేత్ సూత్రధారః సహానుగః
స్థాపకః ప్రవిశేత్ పశ్చాత్ సూత్రధారగుణాకృతిః."

అని యుండుటవలనను నాందీశ్లోకమును సూత్రధారుఁడు పఠింపవలయుననియుఁ దరువాత స్థాపకనాముఁ డగునటుఁడు ప్రస్తావనాదివిషయములఁ జరుపవలయు ననియుఁ దేలుచున్నది. 'అభిజ్ఞానశాకుంతల విక్రమోర్వశీయా'దినాటకముల నాందీశ్లోకానంతరమే సూత్రధారుఁడు ప్రవేశించుచుటులు సూచింపఁబడినది. అట్లుగాక పైని దెలుపఁబడిన నాటకములయందు నాంద్యంతముననే సూత్రధారుఁడు మంగళశ్లోకమును బఠించుచున్నాఁడు. శాకుంతల విక్రమోర్వశీయాది గ్రంథముల ప్రాచీనపుస్తకములయందు నాంద్యంతముననే 'వేదాంతేషు' ఇత్యాది శ్లోకములు గానవచ్చుచున్న వని కొందఱు దెలుపుచున్నారు. అందుననే విశ్వనాథకవిరాజు 'సాహిత్యదర్పణము'న (నిర్ణయసాగరప్రతి. పు. 280.)

"అతఏవ ప్రాక్తనపుస్తకేషు 'నాంద్యంతే సూత్రధారః' ఇ త్యనంతరమేవ 'వేదాంతేషు' ఇత్యాదిశ్లోకలిఖనం దృశ్యతే యచ్చ పశ్చాత్ నాంద్యంతే సూత్రధార ఇతి లేఖనం త స్యా య మభిప్రాయః- నాంద్యంతే సూత్రధారః ఇదంప్రయోజిత వాన్. 'ఇతః ప్రభృతిమయానాటక ముపాదీయత'ఇతి కవే రభిప్రాయః సూచితఇతి-"

అని వ్రాసియున్నాఁడు. భాసనాటకచక్రమునఁ గలపద్ధతిని గుఱించి వ్రాయుచుఁ గొందఱు అది దాక్షిణాత్యులశైలి యని వ్రాసి యున్నారు. కాని సాహి

త్యదర్పణకారుఁ డర్వాచీనుఁడు. పదునైదవశతాబ్దమువాఁడు. హర్షచరితమున బాణుఁడు భాసుని స్తుతింపుచు-

'సూత్రధారకృతారమ్భైః' అని వక్కాణించెను గదా. భాసునినాటకముల కిది యొకవిశేషముగ నేలపలుకవలయును. నిరర్థకముగ నిట్లు వక్కాణించె ననుట సమంజసముకాదు. శాకుంతలాది నాటకములయందలి నాందీప్రస్తావనాదులకు భిన్నముగఁ గన్పట్టుటచే, భాసనాటకములు సూత్రధారకృతారంభము లని బాణుఁడు పేర్కొని యుండును. బాణుని యనంతరము మత్తవిలాసాదులలో భాసునిమతమే యవలంబింపఁబడుటచే సాహిత్యదర్పణకారుఁడు రెండుమతములను సమర్థించుకొనవలసివచ్చెను.

"శాకుంతలచర్చా" అనఁబడు వ్యాఖ్యానమున (R. No. 2778. Govt. Manuscripts Library, Madras.) నిటులు వ్రాయఁబడియున్నది.

'బహుస్వాపకాదిభి రనర్ఘరాఘవాదిషు ప్రథమశ్లోకో నాందీ త్యేవ కథితః-తత్ర తావ న్నాంద్యంతే తతః ప్రవిశతి సూత్రధార ఇత్యయం గ్రంథః ప్రథమశ్లోకాత్ పూర్వం కి ముపపద్యతే? ఉతా నంతరం? ఉభయథాపి దర్శనాత్ సంశయః-'కావున భాసుఁడు తననాటకముల యం దవలంబించిన పద్ధతి ననుసరించియే దాక్షిణాత్యకవీశ్వరు లగుశక్తిభద్రాదులు తమనాటకములను రచించిరనవలయును.

'ప్రస్తావన' యనుటకు మారు 'స్థాపన' యని పెక్కునాటకములందుఁ గనఁబడును. 'కర్ణభారము'నందును 'ప్రస్తావన' యనియే కలదు. నాట్యశాస్త్రము దక్షిణదేశపుఁ బ్రతియందు 'స్థాపకః ప్రవిశేత్ తత్ర' యనుదాని యనంతరము 'స్థాపనాం చ తతః కుర్యాత్'[1] యనుపాఠము గానవచ్చుచున్నదియని విమర్శకులొకరు వ్రాసియున్నారు. ఒకవేళ దాక్షిణాత్యమతానుసారము 'స్థాపన' యనియే ప్రయోగింపఁబడి యుండవోపును.

పైని వివరింపఁబడిన విషయములు మాత్రమే తిరువనంతపురనాటకచక్రమునకు సమాన మగుదో, వాని నొకకవియే రచియించె ననుటకు వీలు లేదు. కాని యీ క్రింద విమర్శింపఁబడిన విషయములవలన నవి యేకకర్తృకము లని మనము నిశ్చయింపవచ్చును.

---

1. The Bhasa Problem by K. R. Pisharaoti. Indian Historical Quarterly Vol. I. Part II. Pages 330-340.

౫. ప్రతినాటకమునందును సూత్రధారుని మంగళశ్లోకమున ముఖ్యపాత్ర సూచనయు, విష్ణుస్తుతియుఁ గాననగును. స్వప్నవాసవదత్తమున ముఖ్యపాత్రము లగు నుదయన, వాసవదత్తా, పద్మావతులు సూచింపఁబడిరి. ప్రతిజ్ఞాయౌగంధరాయణమునందలి-

'పాతు వాసవదత్తాయో మహాసేనో ఽతివీర్యవాన్
వత్సరాజ స్తు నామ్నా స శక్తి ర్యౌగంధరాయణః'

అనుశ్లోకమున వాసవదత్తా, మహాసేన, వత్సరాజ, యౌగంధరాయణుల ప్రశంస గలదు.

ప్రతిమానాటకమున—

"సీతాభవః పాతు సుమంత్రతుష్టః సుగ్రీవరామ స్సహలక్ష్మణశ్చ
యో రావణార్యప్రతిమశ్చ దేవ్యా విభీషణాత్మా భరతోఽనుసర్గమ్"

అనుశ్లోకమున సీతారాములు, భరతలక్ష్మణులు, రావణవిభీషణులు, సుగ్రీవసుమంత్రులు పేర్కొనఁబడియున్నారు.

పంచరాత్రమున నాందీశ్లోకము:—

"ద్రోణః పృథి వ్యర్జునభీమదూతో యః కర్ణధారః శకునీశ్వరస్య
దుర్యోధనో భీష్మయుధిష్ఠిరః స పాయా ద్విరా డుత్తరగోఽభిమన్యుః"

ఊరుభంగమున—

"భీష్మద్రోణతటాం జయద్రథజలాం గాంధారరాజహ్రదాం
కర్ణద్రౌణికృపోర్మినక్రమకరాం దుర్యోధనస్రోతసమ్
తీర్ణః శత్రునదీం శరాసనసికతాం యేనప్లవే నార్జునః
శత్రూణాం తరణేషు వః స భగవా నస్తు ప్లవః కేశవః"

ఈపాత్రసూచనము కాళిదాసాదుల నాటకములయందుఁ గానరాదు.

'యా సృష్టిః స్రష్టు రాద్యా' అనుశ్లోకమున 'అష్టాభి రీశః' అను-చో-

యస్మా దేషాం సురేంద్రాణాం మాత్రాభి ర్నిర్మితో నృపః తస్మాదభిభవత్యేష సర్వభూతాని తేజసా"—అనుభృగువచనముచేఁ బ్రభు వగు దుష్యంతుఁడు సూచింపఁబడినాఁ డని వ్యాఖ్యాత లనిరి, కాని, యది క్లిష్టకల్పనాదులచే సాధింపఁదగినవిషయము. భాసనాటకములయం దన్ననో మంగళశ్లోకమున ముఖ్యపాత్రాభిధానములు స్పష్టముగ వివరింపఁబడుట నేకకర్తృత్వమును స్థిరపఱుచు నని యెఱుఁగునది, ఇట్టి యర్థసూచనమునే ముద్రాలంకార మందురు—

'సూచ్యార్థసూచనం ముద్రా ప్రకృతార్థపరైః పదైః
నితమ్బగుర్వీ తరుణీ దృగ్యుగ్మవిపులాచ సా'

6. నాటకాంతమున భరతవాక్య మని స్వప్నవాసవదత్తావిమారక, బాలచరితాభిషేక, ప్రతిమానాటకములయందుఁ గలదు.

"మహీ మేకాతపత్రాంకాం రాజసింహః ప్రశాస్తు నః"

అని స్వప్నబాలచరితములందును,

"ఇమా మపి మహీం కృత్స్నాం రాజసింహః ప్రశాస్తు నః"—

అని ప్రతిజ్ఞావిమారకాభిషేకపంచరాత్రములందునుం గననగును. ఇం దుదాహరింపఁబడిన రాజసింహుఁ డేకాలమునాఁటివాఁడో యేదేశము నేలెనో నిశ్చయింప వీలులేదు. ఒకవేళ గణపతిశాస్త్రిగారి యభిప్రాయానుసారము రాజసింహుఁ డనునది రాజనామము కాకపోవచ్చును. రాజులయందు శ్రేష్ఠుఁ డనునర్థమునఁ బ్రయోగింపఁబడియుండవచ్చును. భరతవాక్యానంతర మభిషేక ప్రతిమానాటకములఁ దక్క మిగిలిననాటకములలో 'స్వప్ననాటక మవసితమ్' ఇత్యాది ప్రయోగములు గానవచ్చుచున్నవి. అభిషేకప్రతిమానాటకముల 'సమాప్తమ్' అనియే కలదు.

7. ముఖ్యముగ శైలియందును నాటకము లొకదానితో నొకటి పోలియున్న వనుట నిర్వివాదాంశము. లలితమై, దీర్ఘసమాసరహితమై ముద్దులొలుకు శైలిని రచింపఁ బడినవి. ప్రౌఢమగు గాడీయపద్ధతి యిందుఁ గానరాదు. అర్థము సులభగ్రాహ్యము. ఆర్షప్రయోగము లందందుఁ గలవు. కాని యవి ముందుచూపఁబడును. మహాకవులలో నొకరిద్దఱు తప్ప మిగిలిన వారల కిట్టి రమణీయ మగు శైలియే యలవడలే దని చెప్పఁగును. ఉపమానములు వాల్మీకి కాళిదాసులఁ దలఁపించును. రసములు చక్కఁగఁ బోషింపఁబడినవి. తత్తక చిత్రపదసంధానములతోఁ గథాంశములును, వర్ణనాదులు నలంకరింపఁ బడినవి. నీతివాక్యములు పలుచోటుల నుద్ఘాటింపఁబడినయవి. పైవిషయములు పక్షపాతరహితము లని యు, నతిశయోక్తులు గావనియు నీక్రిందియుదాహరణములవలన విస్పష్ట మగును.

(a) "కాలక్రమేణ జగతః పరివర్తమానా చక్రారపఙ్క్తి రివ గచ్ఛతి భాగ్యపఙ్క్తిః"
స్వప్నవాస. అం-I-శ్లో 4.

(b) "గుణానాం వా విశాలానాం సత్కారాణాం చ నిత్యశః
కర్తారః సులభా లోకే విజ్ఞాతార స్తు దుర్లభాః" స్వప్న-IV-9;

(c) "ఆదత్తే త్యాగతా లజ్జా దత్తేతి వ్యథితం మనః
ధర్మస్నేహాంతరే న్యస్తా దుఃఖితాః ఖలు మాతరః." ప్రతిజ్ఞా-II-7.

(d) "యత్నేకృతే యదినసిధ్యతి కోఽత్రదోషః
కోవా నసిధ్యతిమమేతి కరోతికార్యమ్
యత్నైశ్శుభైః పురుషతా భవతీహనృణాం
దైవంవిధానమనుగచ్ఛతి కార్యసిద్ధిః" అవిమారక-III-12.

(e) తమోవర్ణనము.

"అప్రకాశా ఇవ దిశో ఘనీభూతా ఇవ ద్రుమాః
సునివిష్టస్య లోకస్య కృతో రూపవిపర్యయః". బాలచరిత-I-16.

"లింపతీవ తమోఽఙ్గాని వర్షతీవాంజనం నభః
అసత్పురుషసేవేవ దృష్టి ర్నిష్ఫలతాం గతా." చారుదత్త-I-19.

"సులభశరణ మాశ్రయో భయానాం
వనగహనం తిమిరంచ తుల్యమేవ
ఉభయ మపి హి రక్షతేఽన్ధకారో
జనయతి యశ్చ భయాని యశ్చభీతః." చారు-I-20.

(f) చంద్రోదయవర్ణనము.

"ఉదయతి హి శశాంకః క్లిన్నఖర్జూరపాండుః
యువతిజనసహాయో రాజమార్గప్రదీపః
తిమిరనిచయమధ్యే రశ్మయో యస్య గౌరా
హృతజల ఇవ పంకే క్షీరధారాః పతంతి." చారు-I-29.

(g) అవిమారకమున రాజకార్యభారవర్ణన మెంత స్వాభావికముగ నొనర్పఁబడి నదో చూడుఁడు:—

ధర్మః ప్రాగేవ చింత్యః సచివమతిగతిః ప్రేక్షితవ్యా స్వబుద్ధ్యా
ప్రచ్ఛాద్యౌ రాగరోషౌ, మృదుపరుషగుణౌ కాలయోగేన కార్యౌ,
జ్ఞేయం లోకానువృత్తం, పరచరనయనై ర్మండలం ప్రేక్షితవ్యం
రక్ష్యోయత్నాదిహాత్మా రణశిరసిపునః సోఽపినావేక్షితవ్యః." అవిమా-I-12.

(h) "స్వః పుత్త్రః కురుతే పితు ర్యదివచః కస్తత్ర భో విస్మయః." ప్రతిమా-I-4.

(i) "సమం బాష్పేణ పతతా తస్యోపరి మమాప్యధః
పితు ర్మే క్లేదితౌ పాదౌ మమాపి క్లేదితం శిరః." ప్రతిమా-I-5.

(j) కాష్ఠా దగ్ని ర్జాయతే మథ్యమానాత్
భూమి స్తోయం ఖన్యమానా దదాతి
సోత్సాహానాం నాస్త్యసాధ్యం నరాణాం
మార్గా రబ్ధాః సర్వయత్నాః ఫలంతి. ప్రతిమా-1-18.

(k) 'తత్ర యాస్యామి యత్రాసౌ వర్తతే లక్ష్మణప్రియః
నాయోధ్యా తం వినా యోధ్యా సా యోధ్యా యత్ర రాఘవః'-
ప్రతిమా-3-22

ఇట్టి వనేకములు గలవు. గ్రంథవిస్తరభీతిచే నిచ్చియుండలేదు. అవిమారకపంచరాత్రములయందు దీర్ఘసమాసములు గానవచ్చుటచే నవి మఱియొకకవిచే రచియింపఁబడి యుండు నని 'పిషరోటీ'గారు వ్రాసియున్నారు.[1] కాని మిగిలిననాటకములయందును రసానుగుణ్యముగ దీర్ఘసమాసములు వాడఁబడియున్నవి.

శ్లో. నిర్భిన్నాగ్రలలాటవాంతరుధిరో భగ్నాంసకూటద్వయః
సాంద్రై ర్నిర్గళితప్రహారరుధిరై రార్ద్రీకృతోరఃస్థలః
భీమో భాతి గదాభిఘాతరుధిరక్లిన్నావగాఢవ్రణః
శైలో మేరు రివైష ధాతుసలిలాసారోపదిగ్ధోపలః- ఊరుభంగ—18.

"అన్యోన్యశస్త్రవినిపాతనికృత్తగాత్ర
యోధాశ్వవారణరథేషు మహాహవేషు." కర్ణ-6.

"విద్యుల్లతాకపిలతుంగజటాకలాప
ముద్యత్ప్రభావలయినం పరశుం దధానం." కర్ణ-9.

'సేనానినాదపటహస్వనశంఖనాదై
శ్చండానిలాహతమహోదధినాదకల్పైః
గాంగేయమూర్ధ్నిపతితై రభిషేకతోయైః
సార్ధం పతంతు హృదయాని నరాధిపానామ్' దూతవా—5.

ఇట్టివి మిగిలిన నాటకములయందును గలవు. శ్లోకపదభావసామ్యములు ముందు చూపఁబడును.

---

1. K. R. Pisharaoti in 'The Indian Historical Quarterly Pages 330 to 340. Vol. I—Part 2.

రాజశేఖరచరిత్రము.

యస్. వీరేశ్వరదీక్షితులుగారు, ఎం. ఏ. సికందరాబాదు.

(మాదయగారిమల్లన.)

విజయనగరాస్థానమున నుండిన యష్టదిగ్గజము లని పేరువడసిన కవులలో నైదుగురు కృష్ణదేవరాయల యాస్థానముననే యుండి రనుట నిర్వివాదాంశము. అల్లసాని పెద్దన మనుచరిత్రమును గృష్ణరాయున కంకిత మిచ్చెను. నంది తిమ్మనయుఁ దనపారిజాతాపహరణమును గృష్ణదేవరాయునికే కృతి యిచ్చెను. అయ్యలరాజు రామభద్రుఁడుఁ గృష్ణరాయనరపాలాఖండలునిచేఁ బ్రేరేపింపఁబడి రాజశ్రేష్ఠులవృత్తాంతమును దెలుపు సకలకథాసారసంగ్రహము ను వ్రాయమొదలిడి పిమ్మట దానిని ముగించెను. ధూర్జటినిఁ గృష్ణదేవరాయలు "స్తుతమతి యైనయంధ్రకవిధూర్జటి పల్కులకేలగల్గెనో యతులితమాధురీమహిమ' యని భూషించినట్లు కుమారధూర్జటి కృష్ణదేవరాయవిజయము ప్రథమాశ్వాసమునఁ బేర్కొనెను. కుమారధూర్జటి యాగ్రంథముననే తృతీయాశ్వాసమున నిట్లు వ్రాసెను.

గీ. అటుల జయలక్ష్మిఁ గైకొని యరుల కరుల,హరుల ధనపంక్తులను దనపరముచేసి
వెలయు శ్రీకృష్ణరాయలవిభవగరిమ, కాంచి కన్నులపండువుగాఁగ నపుడు.

గీ. సరససాహిత్యరచన విస్ఫురణమెఱయ
సారమధురోక్తి మాదయగారిమల్ల
నార్యుఁ డలయల్లసాని పెద్దార్యవరుఁడు
ముక్కు తిమ్మన మొదలైనముఖ్యకవులు. ఆ. 3

దీనింబట్టి మాదయపుత్రుఁ డగుమల్లనకవి కృష్ణరాయునికి సమకాలికుఁడని తెలియుచున్నది. కాన నీతఁడు పదునైదవశతాబ్దాంతమునను బదునాఱవశతాబ్దాదిని జీవించియుండును.

ఇతనిజన్మప్రదేశము గుంటూరుమండలములోని కొండవీ డని వీరేశలింగము పంతులుగారు కవులచరిత్రమున వ్రాసిరి. కొండవీ డని చెప్పుట కేయాధారములును లేవు కాని, యితఁడు, అయ్యంకిపురాగ్రహారికుఁ డని తనగ్రంథముననే వ్రాసెను.

ఉ. శంకరపాదసేవనవశంవదమానసపంకజాత ని
శ్శంకవచోవిలాస రుచిసారవినిర్జితపూర్ణపూర్ణిమై

ణాంక దురక్షరాననభయంకర శౌనకగోత్రపాత్ర య
య్యంకిపురాగ్రహారవిభవాకర మాదయమల్లనక్షితీ.

ఈ అయ్యంకిపురము ప్రస్తుతము కృష్ణామండలములో నున్నది.

ఇతఁ డయ్యంకిపురాగ్రహారికుఁ డని యుఁ దనకుఁ దానే మాదయమల్లన యని చెప్పుకొనుటచే నాతనిగ్రామమున నిద్దఱుమల్లన లుండియుండవచ్చు ననియు నితఁడు మాదయగారి మల్లన యని వ్యవహరింపఁబడె ననియు విశదము కాఁగలదు. ఈపేరు కవులచరిత్రమున కెంతయో యుపకారిగ నున్నది. ఇతనికిఁ బూర్వమున నివసించిన రుక్మాంగదచరిత్రకర్త యగు మల్లన నుండి పిమ్మట చంద్రభానుచరిత్రము వ్రాసిన తరిగొప్పుల మల్లన నుండి వేర్పఱచుటకు వీలగుచున్నది. ఇతని యింటిపేరు తెలియవచ్చుట లేదు. శౌనకగోత్రుఁడు. వీరేశలింగముగా రితనిని శైవబ్రాహ్మణుఁ డనుట కాధార మేమియు లేదు. ఈశ్వరార్చనకళాశీలుఁ డగు శ్రీనాథుఁడు శైవుఁ డైనచోఁ గదా మల్లన శైవుఁ డగుట! ఇతఁడు గద్యములో "ఇది శ్రీమదఘోరశివాచార్యగురుకరుణావిశేషలబ్ధసారస్వత మాదయామాత్య పుత్ర మల్లయనామధేయప్రణీతం బయినరాజశేఖరచరిత్రం బను మహాప్రబంధంబు నందు' అని వ్రాయుటచే నమాత్యశబ్దమును గ్రహించి యితనిని నియోగిబ్రాహ్మణుఁ డనుటయే యుక్తము. ఇతఁడు, అఘోరశివునికడ విద్యనైనను మంత్రమునైనను బొంది తత్సాహాయ్యముచేఁ బండితుఁడును గవియును నై యుండవచ్చును. ఇతని సమకాలికుఁ డగు నియోగివిప్రుఁడగు నంది తిమ్మనసహితము అఘోర శివుని శిష్యుఁడే. అఘోరశిష్యుఁ డైనంతమాత్రమున మల్లనకవిని శైవుఁ డనుట యుక్తము కాదు.

రాయలయుగమే ప్రబంధరచన కారంభము. ఇంతకుఁ బూర్వమే ప్రబంధబీజములు నన్నయ తిక్కనకవితలలో దాఁగియుండి శ్రీనాథునికవితలో నంకురించి తీఁగసాఁగి పెద్దనకవితలో నల్లుకొన సాఁగినవి. అల్లసాని పెద్దన మనుచరిత్ర మను ప్రబంధకావ్యము నారంభించినను మారనకవి వ్రాసిన మనువుకథనే తీసికొని పెంచి పెద్దదానిం జేసెను. సమానులలో నుత్తమశ్లోకుఁడు గావలయు నను తీవ్రవాంఛ మల్లనకుఁ గల్గుటచేతఁ గాఁబోలు రాజశేఖరచరిత్ర మనుగ్రంథమును గొండవీటియందు దండనాయకుఁ డగు నప్పామాత్యున కంకితము చేసెను. నాదిండ్ల అప్పామాత్యుఁడు మంత్రిశేఖరుఁ డగు తిమ్మనకు మేనల్లుఁడు. కాన నీగ్రంథ మప్పామాత్యునికాలమున వ్రాయఁబడినది. ఇది రమారమి 1530 ప్రాంత మగును.

అప్పామాత్యునకుఁ గావలసినది కృతిపతిత్వమే. శివభక్తుఁడగు మల్లన గ్రంథమున నెట్టివిషయము చెప్పినను అప్పామాత్యునకు గ్రంథాదిని వేంకటేశ్వరస్వామి యాశీర్వచన మున్నఁ జాలు. నాయకుని వంశకథనమును షష్ఠ్యంతములను బలికి మల్లన తనకల్పితకథకు ఆవంచికపురమును బ్రధానకారణమును జేసెను. ఒకతొమ్మిదిపద్యములలో నాపురమును (సానులతోఁగూడ) వర్ణించి దాని కధీశ్వరుం డగు హేమధన్వుని నాతనిరాజ్యపాలనావిధానమును బొగడును. బిడ్డలు లేమికి రాజును రాణియు నెంతయో వగచి రాజు శంభుసేవయే యాశాంతను బూరించు నని తలఁచి దేవాలయములనుగట్టించి యొకచోటఁ గట్టజవ్వాదిచే నలికించి కట్టాణిముత్తెముల నిగ్గుతో ముగ్గుపెట్టించి శివపూజను జలుపును. ఒకనాఁడు రాజు కలఁగని కలయందు శివుఁ డొకఫల మిచ్చె నని భార్యకుఁ దెలుపును. పట్టపురాణి గర్భిణి యగును. కుమారోదయ మగును. వానికి రాజశేఖరుఁడను నామ మిత్తురు. ఇట్లు మొదటియాశ్వాసము రాజశేఖరు జననమును గుఱించిన కథతో నిండియున్నది.

ద్వితీయాశ్వాస మీతనిపరాక్రమప్రసంగముతో నొప్పుచున్నది. ముష్టింపచస్వామి హేమధన్వునికడకు వచ్చి విశంకటాసురకృత్యములను దెలిపి రాజశేఖరుని నాశ్రమమునకుఁ దీసికొనిపోవును. స్వామి రాజశేఖరునికిఁ బాణవిద్యోపదేశముచేయును. యుద్ధమున విశంకటుఁడు మరణించును. రాక్షసునితోఁ బోరాడి యుత్సాహము దక్కి కాళికాలయమును జేరఁగా దేవి ప్రత్యక్షమాను. కాళి వానికొక మణినిచ్చి కావలసినవానిని సమకూర్పఁ గలశక్తి దానికిఁ గల దని చెప్పును. ఒకయోగిని వచ్చి ముష్టింపచునికిఁ బుత్రి నీయఁగల దని కూడ చెప్పును. యోగిని యట్లే తాపసిబాలను దెచ్చి తనగృహమున కతిథిగ వచ్చినవాని కొక త్రికాలవేది యగునొకపంజరస్థకీరము నిచ్చెను. ముష్టింపచునకు బిడ్డనిచ్చి తిరిగి వచ్చుచు నొకకాసారమున స్నానముచేయును. దేవీదత్తమణి ప్రభావముచే రాజునకు పాయససహితఘృతభోజనము ప్రాప్తించెను. భోజనానంతర మాశుకము మణివృత్తాంతమును జెప్పును. అది వసంతకాల మగుటచే సింధురాజపుత్రి చెలులతో నచటకు వచ్చి జలక్రీడ పిమ్మటఁ బుష్పాపచయమును సల్పును. రాజు చూతలతాగృహము వెడలి యువతీకోలాహలము గాంచును. రాజపుత్రియు రాజును బరస్పరము చూచెదరు. రాజు చూపు మరలించి చిలుకకడ కేగి యామెవృత్తాంత మరయును.

తృతీయాశ్వాసము రాజశేఖరుని వివాహమునకై యుద్దేశింపఁబడియెను. అరుణపురమున ముకుందుఁడున్ను అరుణుఁడు నను నిర్వురుబ్రాహ్మణులు గలరు. ఇద్ద

ఱును బండితులే. మొదటివాఁడు ధని రెండవవాఁడు నిర్ధని. భార్యాప్రోత్సాహముచే నరుణుఁడు యమునానదికిం జని హరిం గుఱించి తపంబు చేయుచుండును. గంధర్వుఁడగు పుష్పవతీదేశాధిపుని కూఁతురు లత యను నామెయుఁ గనకమంజరి యనుమంత్రి పుత్రియు నచటకు వచ్చిరి. పూలవిషయమై తగవు గల్గెను. తపము చేయు బ్రాహ్మణుని వరింపఁగల్గువారు గెల్చెద రని లత కనకమంజరితోఁ ననును. అప్రకారమే లత పోయి బ్రాహ్మణునికిఁ దపోభంగము కల్గించును. బ్రాహ్మణుఁడు మనుష్యలోకమునఁ బుట్టు మని శపించును. చెలులప్రార్థన నంగీకరించి పదాని యీామె రాజశేఖరుని బెండ్లాడు ననును. ఈవిధముగ శుకముచెప్పిన వృత్తాంతము విని రా జాబాలికను వివాహమాడఁగోరును. కాంతిమతి విరహవేదనను బొందు నపుడు శుక మామెకడకు వచ్చి తండ్రియెదుట రాజశేఖరుఁ బొగడును. పిమ్మట కాంతిమతీరాజశేఖరుల వివాహముజరుగును. ఒంటరిగఁ బోయి జంటగవచ్చిన కొడుకును గాంచి తండ్రి సంతసపడును.

శైలి:—కవి యగువాఁ డపరబ్రహ్మ నాఁబడు. కవి తనభావనాశక్తిచే నూతనవస్తువులను సృజింపఁగల్గును. అందఱికన్నను గవికి వస్తు సౌందర్యపరిశీలనాజ్ఞానమెక్కుడుగ నుండును. అందులకనియే కవి ప్రతివస్తువు ను నొక సుందరవస్తువుతోఁ బోల్చి చూచుచుండును. ఇట్టి పరిశీలనా జ్ఞానము మాత్ర మున్నంతనే కవి కాఁజాలఁడు. తాఁ జూచి యనుభవించు వస్తుసౌందర్యమును మనలను గూడ నాతనితోఁ బాల్గొనఁజేయవలయును. కావునఁ గవికి భావ మెంతగ నుండునో దానికిఁ దగిన భాషయు నుండవలయును. శైలిని బరీక్షించుటలో భావమునెట్టి భాషలోఁ జెప్పెనను విషయము జ్ఞప్తియందుంచుకొనవలయును.

మల్లనకవి చేసినపురవర్ణనము చూడుఁడు. మల్లన పెద్దన ననుసరించియే పురవర్ణనకుఁ గైకొనెను. ఇం దేమియు శిల్పము లేదు. బంగారుమేడలకుఁ గావలి యుండుట కొకరక్షకభటుఁ డైన లేఁడు. కవి కున్న దున్నట్లు వర్ణించుట గుణముకాదని యెఱిఁగినవాఁ డగుటచేఁ దనకుఁ గావలసినంతవఱకే యావంచికపురిని వర్ణించెను. తాను నివసించినకాలమును మఱచిపోక జనాహ్లాదకర మగుటకుఁ గాఁబోలు సానులను గూడ వర్ణించినాఁడు. ఆనగరిం గల పిన్నయేనుఁగుల-

క. అన్నగరిచిఱుతయేనుఁగు,గున్నలపై నెక్కి చిక్కి కోయఁగవచ్చున్
మిన్నేటిపసిఁడితామర, లన్నా మఱి యేమి చెప్ప నందలికరులన్.

అని యతిశయోక్తిగఁ జెప్పినాఁడు. రాణి గర్భిణి యయ్యె ననువిషయము.

“కౌనుదొడ్డతనంబుఁ గని చింతపడుగతిఁ గుచముఖంబులు నీలరుచి వహించె
మందస్మితంబున మరగి రాదన ముద్దుఁబలుచని చెక్కులు పలుకఁబాఱె.’ అ ౧.౮౬.

అని విచిత్రముగఁ జెప్పినాఁడు. ముట్టింపచస్వామి తనకూఁతును రక్కసి గొనిపోఁగాఁ దా నెట్లు సహింపఁగల ననుసది-

సీ. కడుపార దొండపం డిడి ముద్దుగఁ బెంచిన రాచిల్కకొదమలఁ జూచిచూచి
పానులలోనిండఁ బాలోసి పెంచిన చూతపోతంబులఁ జూచిచూచి
తోడికన్నెలుఁ దానుఁ గూడిమాడి చరించు సురపొన్ననీడలఁ జూచిచూచి
బృందావనంబులు పెంచి తిన్నెలమీఁద సూటిఁబెట్టిన ముగ్గుచూచిచూచి
సంతసంబున దేవపూజలు ఘటించి, పారికాంక్షుల సేవకై పరమనియతి
లీల నడయాడుచున్న బాలికలఁ జూచి, హృదయవీథిక నెట్లు భరించువాఁడ.

ఈతనికవిత్వము హృద్య మై, మృదుమధురపదగుంభిత మై సరళభావములను వెల్లడించును. దీర్ఘసమాసముల నుపయోగింపక రచనానైపుణ్యముచే స్వల్పపదముచే విశేషభావమును జూపుచుండును. ‘అల్లసురశాఖ వానింటిమల్లెచెట్టు, కామధేనువు వానింటి గాడిపసరము, ఎదురుచుక్క, పట్టుఁగొమ్మ, వేసవిత్తు, వాకట్టుమందు, తలకట్టు, పూదినతంగెడు మొదలగు జాతీయపదము లిందుల కుదాహరణములు- లోకోక్తుల ననేకములను బ్రయోగించి శైలికి వన్నెఁగూర్చుచుండును. ‘కొఱవిం దలగోఁకుకొనుటకుం దలపెట్టెన్; బెబ్బులిపయిన్ జీంబోతులంఘించునే' అనునవి కొన్ని యుదాహరణములు.

విషయమును హృదయంగమము చేయుటకై పద్యముల నెన్ని రీతులలోనో వ్రాయుచుండెను. బమ్మెర పోతన వ్రాసినట్లుగనే-

సీ. ఒకవేళ సింహమై యుఱుకుచు బెదరించు నొకవేళ హరిణమై యొద్దనిలుచు
సీ. జగదభినిర్మాణచాతుర్యవిఖ్యాతి మెచ్చి ధాతకు నెవ్వ రిచ్చినారు...
సీ. చదివినారలు పెక్కుసంథలఁ గించిత్తుఁ దప్పకయుండ వేదత్రయంబు...
సీ. చిగురాకులే కత్తులగునేని నింతకు దగరకోయిలనోరు తెగకయున్నె...

ఈసీసపద్యచరణములు శ్రీనాథుని సమత గలసీసపద్యములను బుఱడించుచున్నవి. ఇఁక నీతని వచనరచనావిధానము పరికింతము. మల్లనవచనము సంధివాక్యముగ నుపయోగించును. దీర్ఘవచనములు శబ్దాలంకారభూయిష్ఠములై దీర్ఘసమాసభరితములై యుండును. కవి గ్రంథాదిని-

“క. చెప్పఁదలఁచఁ గవిత రసము, లిప్పిల నప్పప్ప భళిభళీ యన లేదా
మెప్పుడు చేయకయుండుట, యొప్పఁజుమీ సుకవి యొంత యుచితజ్ఞుఁడో కో”

అని పలికెను. అట్లే కావ్యమును రసాత్మకముగఁ బరిగణించి తదనురోధము గల్పింపక తదనుగుణము లగుగుణములనే కల్పించి మనయందఱిస్తోత్రములకును మల్లన పాత్రుఁ డగుచున్నాఁడు.

1. మల్లన తెలుఁగు సంస్కృతభవ మని తలఁచువారిలో నొకఁడని తెలియుచున్నది. దీనిని జూడుఁడు.

గీ. సరససంస్కృతపుష్పగుచ్ఛప్రభూత, మగుతెనుంగను నెత్తావి కఖిలదిశలఁ
దరుణపవమాన మగుకవిత్రయవిశేష, చతురవాచానిరూఢి కంజలియొనర్చి.

✓ 2. ఈడ్చుకవచ్చి. ద్వి. ౫౭. 'ఈడ్చుకొని' అని యర్థము. ఇట్టిప్రయోగములు ధూర్జటి, వేంకటకవి మొదలగువారు చేసిరి.

3. కొలకొల మనియెడు నొక్కఁడింపుకొలఁకుం గనియె. ద్వి. ౧౩౧. కొలకొలం + అనియె. ధ్వన్యనుకరణమున మకారాగమము. కొలను, అనియేకవచనమువ నుండవలె నని వ్యాకర్త లందురు. మహాకవిప్రయోగములకే వ్యాకరణములు లోఁగవలయును గదా!

4. అందుకోన్ + అలవికాదు. ద్వి. ౧౪౩.

ఇట్టిప్రయోగములు రాయలకవు లనేకములు వాడిరి.

5. వేఁటునోత్తుకు. తృ. ౫౦. కొలఁకుకు: నకారరహితమైన షష్ఠీరూపము. తృ. ౨౦౬. ఇదియును మహాకవిప్రయోగ మగుటచే సాధువు.

6. కూఁతుం బరుపుము. తృ. ౨౧౨. ఈకవి కూఁతుశబ్దమునకు 'రు'వర్ణాగమము రాదనువారిలో నొకఁడని యూహింపఁదగును.

ముద్దుఁగూఁతును. తృ. ౪౧౮. గేయవిశారదఁ జేసె గూఁతురన్. రామరాయభూ. తృ. ౨౦౮.

7. పులినోరికండ వై. ద్వి. ౧౧౨. ఇట్టిప్రయోగములు మనుచరిత్రములోఁగలవు. ✓

రాజశేఖరచరిత్ర మొకప్రబంధ మని యిదివఱకే గమనించితిమి. దీనికి మూలగ్రంథ మేమియు నున్నట్లు గన్పడదు. సందర్భోచితముగఁ బురవర్ణనమును బుత్రోదయమును ద్వితీయాశ్వాసమున సూర్యాస్తమయవర్ణనము, సరోవరవర్ణనము జలకేళీవర్ణనము, యుద్ధవర్ణనము, మొదలగువానిని దృతీయాశ్వాసమున యమునామాహాత్మ్యము, కాంతిమతీరాజశేఖరుల విరహమును, గీరచాతుర్యమును మొదలగు ప్రబంధవర్ణములను నాతిదీర్ఘముగను, సరసముగను గథావేగము నడ్డుపఱు

పఱుండునట్లుగ నున్నవి. ఇందు, అంగనాంగవర్ణనలు గాని యనౌచిత్యమును బుట్టించు మఱేమియును గాని గానరావు.

సమయానుకూలముగఁ గవి కొన్నిసందర్భములను సృజియించి గ్రంథస్థమగువిషయముపై నుండి మనదృష్టిని మరల్పకుండు నట్లుగఁ జేయుచున్నాఁడు. పుత్రులు లేనివారి బ్రతుకు బ్రతుకుకా దని చెప్పి శివపూజాప్రభావము నీపద్యమునఁ జెప్పెను. 'కడలేని సంసారజలధిలో మునిఁగిన జనులపాలిటినావ శంభుసేవ'. ముష్టింపచస్వామి దనబిడ్డను బొందినపిదప నచటిమునిపత్ను లాతనిం బొగడుపద్యమును జూడుఁడు. (ద్వి. ౧౧౨). బీదతనమునుగూర్చి యేమి చెప్పెనో చూడుఁడు. (తృ.)౧౫. కథావేగము నడ్డుపఱుపక నకఁమనిట్టివాని నుపయోగించినను నవి యందదుకులుగఁ గన్పట్టవు.

మల్లనకవి తనకవితయందొకనూతనకళను బ్రచురము చేసెను. మొట్టమొదట మనకు రసోచితముగ నలయునంతవఱకుఁ దెలిపి పిమ్మట వానింగూర్చి మెచ్చువగను మొదటఁ జెప్పనియంశములను దెలుపుచుండును. మచ్చునకు రెండుమూఁ డుదాహరణములను మాత్రము చూపుదును. 1. హేమధన్వనిపురవర్ణనముఁ జేయుచు మల్లన యందలిసైన్యములను మొదలగువానిం గూర్చి ప్రసంగింపనంతమాత్రమున నవి యాపురమున లేవని మనము భావింపఁ గూడదు. పిమ్మట రాజనపత్యదోషము ననుభవించుచు నిట్లు వాపోవును.

మలయజగంధి యీకరిసమాజము నీహయపంక్తి యీభటా
వలియును గల్గి నా బ్రతుకు వన్నెకు నెక్కదు పుత్రహీనతన్. ప్ర. ౬౦.

2. ఒకనాఁడు హేమధన్వమహీపాలుఁడు పేరోలగం బుండుసమయంబున వచ్చిన మునిం గుఱించి కవి యాతనినామము తక్కినకవులవలె మునుముగఁ జెప్పక యెట్లుచెప్పెనో చూతము.

చ. కనుఁగవ నిప్పుకల్ చెదరఁగా నదరుల్ వెదచల్లు కెంజడల్
పెనఁగొన నక్షహారములు బిట్టుగ నిట్టటు లూఁగ నెంతయున్
గినుక వహించి యొక్కముని కేసరి గొబ్బునఁ జేరవచ్చె న
జ్జనపతియున్ సభాసదులు సాధ్వసమంది వడంకునట్లుగన్.

ఇట్లువచ్చి.

ముంపిరి రాజ్యగర్వమున ముందఱఁ గానవుగాక ధాత్రిఁ బా
లింపరొ తొంటిరాజులు దిలీపముఖు ల్మనికోటికూఁత లా

లింపరో నొంపరో మదవిలీఢకఠోరనిశాటఝాటమున్
నింపరొ దిక్కటాహముల నిర్మలకీర్తి సుధాంశుచంద్రికల్.

అని ప్రారంభించును. హేమధన్వుఁడును నది విని మిమ్ముఁ గలంచిన దుర్మార్గునిఁ దత్తునియలుగావింతుసనును. అప్పుడు మాని-

ఏమనిచెప్పువాఁడ ధరణీశ్వర యే వరతంతుసంయమి
గ్రామణి శిష్యుఁడన్ జటిలకౌశికుఁడన్ బహువేదశాస్త్రవి
ద్యామహనీయుఁడన్ బదరికాశ్రమవాసుఁడ బాలికామణిన్
గోమలపాణి భానుమతిఁ గోల్పడివచ్చినవాఁడ నక్కటా. ద్వి. ౨౩.

అనిపల్కు నీయపరదుర్వాసునిపేరు వినఁ గోరుదుము. కవి దీనిని కథామధ్యంబునం దెలుపక రాచిల్క చేఁ దుదకు హేమధన్వునకుఁ జెప్పించును. ఇంకొకవిషయమును మూఁడవయాశ్వాసమునఁ బరికింతము. గ్రంథాదిని రాజశేఖరుని జన్మమునుగూర్చి తెలుపునపు డీతఁ డొక కంబుఁ డను యక్షవరుఁ డని కవిచెప్పక బ్రాహ్మణమానిచే లతమొక్క దాసులకుఁ జెప్పించెను. పూర్వము యక్షు లయ్యుశాపమున మర్త్యలోకమున జనించిన రాజశేఖరకాంతిమతులకు వివాహముగూర్చుటలోఁ గూడ విశేషముకలదు.

ఈగ్రంథమునందు వ్యర్థపాత్ర మొకటియు లేదు. ముష్టింపచస్వామి రాజశేఖరుం గొంపోయి యాతనిదోర్వీర్యము ప్రకటింపఁ జేయును. ఘోరమాయాజాలవేది యగురక్కసుని యుద్ధమున నుత్సాహమునఁ గాళికాలయముఁ జేరి కాళింబ్రార్థించి రక్కసునిఁ జంపును. కాళి యాతనిసాహసమునకు మెచ్చి యొక యభీష్టసిద్ధి నొందించు రత్నము నిచ్చును. ఈరత్నమే సరోవరతీరమున భోజనాదులను గల్పించెను. తనగృహమరుదెంచిన యోగిని కీరము నొకదాని నిచ్చెను. ఈకీరము త్రికాలవేది యగుటచే గాంతిమతీపూర్వజన్మవృత్తాంతమును, పిమ్మట హేమధన్వునకుఁ బుత్రునివిషయమును దెలుపును. దాసి పంజరమును హేమధన్వునికడకుఁ గొంపోయినపుడు రాజశేఖరుని దోఃప్రతాపమును వర్ణించి కాంతిమతికిఁ దగినవరుఁ డని తెల్పును. పిమ్మటఁ జిలుక పురోహితుఁడై కాంతిమతీరాజశేఖరులవివాహము సల్పును. తృతీయాశ్వాసమున ముకుందారుణుల చరిత్రము సంగ్రహముగ వర్ణింపఁబడినది. ఇం దరుణుఁడు భార్యచేఁ బ్రోత్సహింపఁబడి తపోనిధికై జమున యొడ్డుం జేరును. అఁ డఅమధ్యను రాజశేఖరుఁ డొకకొలికిపూసవలెఁ గానవచ్చు

చున్నాఁడు. ఇందలిపద్యములు నాల్గింటికి మూఁడువంతులు సంభాషణావైఖరిగనే యున్నవి. సింధురాజు-

మ. తనదేవేరిమొగంబు చూచి యిదె కాంతా కంటివే వింత లే
మనివర్ణింపఁగవచ్చు నిచ్చిలుక యాహాపుట్ట నిట్టాడునే
మన మాశ్చర్యపయోనిధి న్మునిఁగె నీమాహాత్మ్య మేరీతిఁ గ
ల్గెనో ము న్నేమితపంబు చేసెనొకొ యాకీరంబుపెం పెట్టిదో.

ఇట్లుదాహరణములు పెక్కులు గలవు. కవి మొత్తముమీఁద తిక్కనాదులవలెఁ గథాంశమునకే ప్రాముఖ్య మిచ్చి వర్ణనాంశములను క్షిప్తపఱచును. చంద్రభానుచరిత్రమును వ్రాసిన మల్లన భారద్వాజాశ్రమమును రమారమియిరువదిపద్యములలో వర్ణించెను. మాదయగారిమల్లన యొక్క పద్యములో నెంతటినేర్పుతో వర్ణించెనో చూడుఁడు.

సీ. హోమధేనువ్రాత మొయ్యనబ్బులు చాఁపఁ గొనగోళ్ళను వ్వెడుక్రోలుపులులఁ
జిగురుదర్భలు గిల్లిమృగపోతముల కర్థి నందంద యిచ్చు పంచాననముల
రాచిల్కబోదలఁ బ్రోచి తెక్కలనీడఁ జల్లగాఁ బొదివెడు సాళువముల
బర్హాణనిలయంపుఁ బన్నగార్భకముల కుగ్గులువెట్టు మయూరములను
దొండముల్సాచి కలఁగక యుండఁ దీర్థ, వారి దరినుండి క్రోలెడు వారణములఁ
జూచి యచ్చెరువంది యస్తోకమౌని, వరతపశ్శక్తి మెచ్చుచు వచ్చునపుడు.

కథానిర్మాణమునందుఁ గవి శిల్పము నేమియుఁ జూపకపోయినను బద్యములు రసవంతములై యొప్పుచుండు ననుటకు సందియము లేదు.

గ్రంథస్వీకారము.

(1) యామినీబిల్హణీయము.

నాటకము. ఆఱంకములు. తూర్పుగోదావరిజిల్లా అమలాపురము తాలూకాలోని కూనవరమునివాసులు ఆకుల పెద్దయ్యగారు రచించినది. ప్రకటనకర్తలు కాకినాడలోని, నూకల వేంకట్రామయ్యగారు, వెల రు ౧.

ఈగ్రంథముపైఁ బలువురు సదభిప్రాయముల నిచ్చియున్నారు. మాకుఁదోఁచిన యభిప్రాయము మేము నిచ్చుచున్నారము. ముద్రణమునకుముం దింక నొకరిద్దఱకుఁ జూపవలసినది. మూలబిల్హణీయముకథ రసవంతమైనది. చాలగడుసుఁ దనముగలది. ఇందుబిల్హణుఁడును యామినియుఁ జాలతావులఁ బేలవముగా సంభాషిం

చిరి. వెఱ్ఱివారివలెనటించిరి. అరసికులుగాఁ గనఁబడిరి. బిల్హణయామినుల దీనాలాపము లుచితముగాఁ గనఁబడవు. తెర లేచును, తెర పడును, బిల్హణుఁ డింట నేదియో చదువుచుండఁగాఁ దెరపడును. ఆవేశముగాఁ బద్యముచదువుచుఁ బ్రవేశించుచున్నాఁడు. అనుట వీథినాటకపద్ధతి.

"ము న్నెందఱో రాజు లనుసంధించిన గాంధర్వవివాహమును నీవ మనుచుఁటివి''—అని కలదు. గాంధర్వవివాహము రాజదంపతులకు మాత్రమే యుచితమేమో. లేచిగుండెలు బాదుకొనుచుఁ గథానాయకురాలు విలపించుట—(ఇటు నటుఁ జూచి) "ఆలసించిన నెవ్వరయిన వత్తురేమో" అని కథానాయకుఁ డనుట వెఱ్ఱిగాఁ గనఁబడుచున్నది.

రాజశాసనమును నెఱవేర్చుటయే తలారులపని. కాని వధ్యుని తన్నిపట్టు కరమ్మనుట నిందించుట బాగుగలేదు. వధ్యునిపైఁ దలవరులకుఁ గోప ముండరాదు. "జీతగాండ్రకు మీకింత కక్ష యేల"యని యామినీపూర్ణతిలక యేయన్నది.

"మనుమేదినీశుఁ డేర్పరించిన ధర్మాధిదర్పణము స్త్రీ లవధ్య లని ఘోషించినది. కంపితజలమగ్నమగు భాస్కరప్రతిబింబము. ఆలస్యమమృతం విషం. సతు దోషస్తువస్తువర్ణనమనేన్యాయంబు. ఇట్టివి కొంచెముసంస్కరింపఁబడవలెనేమో.

అచ్చుతప్పులిందుఁ బెక్కులుగలవు. వ్యర్థముగానన్యదోషాన్వేషకులగు వైతండికులకుఁగాక తక్కినవారి కీనాటకము మనోహరముగానేయుండును. లోకము భిన్నరుచికలది. మచ్చునకుఁ బద్యము.

మ. నవనీతాకృతికాలకూటము మహాన్యాయావతారంబు దు
 ష్టవినీతిప్రథమాంక, మ్మర్కులమర్మ సౌధప్రభిత్కారణా
 బవు సంపాతమహాశనిప్రతి త్వదీయాత్మోద్భవవ్యాజ బాం
 ధవతూలాగ్నికణంబు దీని నయశౌండంబున్ వడిన్ దున్మెదన్.

(2) లియోటాల్‌స్టాయి.

విశ్వసాహిత్యమాల- ౧ వ పుష్పము. మహీధర రామమోహనరావు గారు గ్రంథకర్త. ఈవిశ్వసాహిత్యమాలలో, "ఉత్కృష్టమైన సాహిత్యం వ్యాపకం చేయడం" ప్రధానోద్దేశ మఁట. గ్రంథమాలచందాదారులకు 100 పుటలగ్రంథము రెండణాలచొప్పున దొరకును. పోస్టేజీవేఱుగానుండును. ఇతరులకు మూఁడణాలకుదొరకును. ఈటాల్‌స్టాయి చరిత్రము ప్రపంచమంతయు నెఱుఁగునుగాని యాంధ్రదేశ మెఱుఁగదఁట! ఆకారణముననే యీమహాపురుషుని జీవితచరిత్రము ప్రక

టింపఁ బడినదఁట. ఎఱుఁగనివారికిఁ దెలియఁ జెప్పుట సజ్జనలక్షణమే. మహాపురుషులంగూర్చి లోకమునకుఁ దెలియఁజేయునపుడు స్వచ్ఛమైనభాషలో గ్రంథమును వ్రాసిన బాగుగనుండును గదా. నియమరహితమైన గ్రామ్యభాషలో నుండుట దీనికి గొప్పలోపము. "ప్రతిమనిషికీ, దేశంకీ, జాతికీ," యీగ్రామ్యభాష సంస్కారమెట్లు కలిగించునో తెలియదు. ఎట్టి సాహిత్యవ్యాపక మీగ్రంథమాలవారు చేయుదురో!

అంబాజీపేటపోస్టులోఁ జేరిన ముంగండలో నీప్రచురణగ్రంథములు విశ్వసాహిత్యమాలాకార్యస్థానమున దొరకును.

(3) ఉత్తమస్త్రీలు.

మొదటిభాగము- బుక్కపట్టణము రామానుజయ్యగారిచేత రచియింపఁబడిన వచనగ్రంథము- ఇందు రుక్మిణి, సావిత్రి, తపతి యను ముగ్గురుస్త్రీల యుత్తమచరిత్ర గలదు: వచనరచన జటిలముగా నిర్దుష్టముగ నున్నది- ఈకథ లాంధ్రభారతభాగవతములలోని పద్యానుసారములుగ నగపడుచున్నవి. ఈగ్రంథముపైఁ బలువురు పండితులుఁ బత్రికాధిపతులును సదభిప్రాయముల నిచ్చియున్నారు.

"గ్రంథకర్త తన రచనాసామర్థ్యముచేతను నూతనవిషయ ప్రస్తావనల మూలమునను బ్రాఁతకథలకు వింత సోయగమును జేకూర్చి క్రొత్తవిగా మార్పఁ గలుగుట ప్రశంసనీయము- ఈగ్రంథములోని భాష కొన్నికొన్ని తావులందుపూర్వకవుల గద్యరచనావైఖరిని దలంపునకుఁ దెచ్చును."

రెండవభాగముం ద్వరలోఁ బ్రకటింతురుగాక. వెల రు 0-6-0, గ్రంథకర్తగారికిఁ జెన్నపురి, ఆంధ్రపత్రికా కార్యాలయమునకు వ్రాయవలెను.

(4) శ్రీమదాంధ్రమాఘమాహాత్మ్యము.

ఇది పద్మపురాణాంతర్గతము. శ్రీవేదాంతం శేషాచార్య ప్రణీతము. అమూల్యము. 6 ఆశ్వాసముల పెద్దగ్రంథము. రాయల్ సైజు 258 పుటలు. పద్యకావ్యము. తొందరపడి యచ్చువేసి కాఁబోలును జివర తప్పొలపట్టిక విస్తారముగఁ జేర్చినారు. వాక్యములు చరణములును మార్చివేసినారు. అమూల్యమగు గ్రంథమును దొందరపడి ముద్రించుట యేమి యవసరమో తెలియదు. ఆచార్యులువారాంధ్రగీర్వాణపదజటిలముగ నీగ్రంథమును భక్తకోటి కుపయుక్తమగునట్లు రచించిరి. సంస్కృతపదము లెక్కుడుగా నగపడును. పద్యముల నడక చాలతావుల ధారాళము గాదు. కొన్ని కొన్ని తావులఁ జక్కగా నడచుచున్నది.

ఇందు మాఘమాసములోఁ జేయు దానస్నానాది విషయములు విరివిగాఁ

దెల్పఁబడినవి. మాహాత్మ్యములు విపులముగా వివరింపఁబడినవి- ధర్మములు నాచారములు వక్కాణింపఁబడినవి- రాఁబోవునది మాఘమాసము కావున, భక్తవరులకీగ్రంథము నుచితముగా నొసంగెదరు గానఁ గవిగారి నివాసస్థానమగు నెమలిపురి నుండి తెప్పించుకొని చదివి యానందింతురుగాక. మచ్చుపద్యములు.

గీ. అనిన దూతయనె సువిషయంబు నీవు,నడిగితివి సుబుద్ధి సుహృదయమునఁ గల్గు
నన్యసేవేచ్ఛుఁడనగు నాకజ్ఞరయుట,యనవసర మెఱిఁగినది స్నేహమునఁ జెపెద.

మ. అనలాక్షా! యిటు లప్సరోయుతవిమానాగ్రస్థితుండౌట కిం
పున నీతండను వాజపేయసవనంబుల్ రాజసూయంబు లొన
ర్చెనె మాఘాప్లవమాడెనా పురబహిర్నీరంబున న్నీవు దు
ర్జనులం బ్రోవఁగ నేను నిర్దయను వాండ్రం ద్రుంచుక్రూరుండనా. అ. 4-177.

(౫) వైజయంతి.

కొల్లాపురము, స్నేహలతాకవితా సంఘమునుండి శ్రీ చేబ్రోలు సరస్వతీదేవిగారి సంపాదకత్వమున వెలువడిన మూఁడవవార్షికపత్రిక. వెల రు 1.

ఈతడవఁ బ్రకటింపఁబడిన వన్నియు సలక్షణ పద్యవ్యాసములే. మొదటఁ బండితాభిప్రాయములు గలవు. అవియును బద్యరూపములే. పిమ్మట విద్వాన్ సరిపల్లె విశ్వనాథశాస్త్రి ఎం. ఏ. గారి దేవ్యపరాధస్తోత్రము (మూలోపేతము)- శేషాద్రి రమణకవుల యాత్మకథ-సురవరము ప్రతాపరెడ్డి బి. ఏ, బి. ఎల్. గారి భక్తతుకారాం-శతావధాని పాగోలు సత్యనారాయణగారి భావదీపావళి- చతుర్వేది అమరేశ్వరశాస్త్రిగారి ప్రియాశ్లేషమును- భువనగిరి, విజయరామయ్య బి. ఏ. గారి స్వప్నవృత్తమును బెద్దవ్యాసములు మనోహరములుగ నున్నవి. ప్రియాశ్లేష మతిగా నున్నదేమో యనుకొనుచున్నాము.

ఉ. భావములేని కబ్బము సభాసదులెవ్వరు మెచ్చరమ్మ వా
గ్దేవి సుధామయోక్తులకుఁ గేవలముల్ గవితావిపంచికా
రావము మేళవించి మధురమ్మగు గీతికల్ రచించి సం
జీవినిగాఁ బ్రబంధకవి శేముషికిన్ మణిపాదు వమ్మకో.

మ. కవితల్ వ్రాయుదునా ? పురాతనకృతుల్ కాపాడయత్నింతునా
కవిరత్నంబుల భవ్యకావ్యరచనాకల్పంబు లాలింతునా
భవబంధం బగు ఘోరసంసరణసంబంధంబు లోనుందునా
అవురా ! తోఁచదు నాదుజీవితసమస్యల్ పూర్తికానేర్చునే.

క. ఆవటముక్రిందఁ దలిరుల, నావటముగ శయ్యదీర్చి యందు సమస్త
త్స్థావరమణికోటీర,స్థావరనిజశాసనుండు శయితుం డయ్యెన్. ౬౨

వ. ఆవేళ నాతరుశాఖాంతరంబున నున్న చిరజీవి యను వృద్ధపక్షీశ్వరుండు తన
చుట్టు వచ్చి యున్నపిట్టలం జూచి మీరు దిరిగిన వనంబుల నపూర్వంబు లేమి
గంటి రని యడిగిన వానిలోఁ గుక్షింభరికుం డనువిహంగం బోస్వామీ నీ
వెఱుంగని యపూర్వంబులు లే వట్లున్నను నొకటివింటి మవధరింపుము. ౬౩

మ. ఖగవంశోత్తమ నేఁడు గుంపుగ నుషఃకాలంబున న్వేడ్కతో
గగనాభోగము నిండ నే మెగసి పక్షశ్రేణివాతోద్ధతి
న్నగము ల్దూలఁగఁ బోయి వింధ్యముచఱి న్నానాదిగంతాగతం
బగు నాత్మీయగణంబుఁ గూడి యొకపుణ్యారణ్యమధ్యంబునన్. ౬౪

క. కంకాలఖండనుం డను, కంకము విహగములు గొలువఁగా నిజమిత్రా
తంకం బగుశోకాంబుధిఁ, గ్రుంకఁగ నేఁగితిమి వానికుండుట దెలియన్. ౬౫

క. ఏఁగినఁ నాతం డశ్రులు, దోఁగిననయనములఁ జూపు దోఁపక తనలోఁ
గ్రాఁగుచునుండఁగ నేమా,పాఁ గెఱిఁగినభంగినొయ్యఁ బలికితి మతనిన్. ౬౬

క. పిట్టలము మేము నీకల, చుట్టాలము మమ్ము నేల చూడవు నీకీ
పట్టున వలవనిశోకము, పుట్టెడుకత మేమి చెప్పు పొందుపడంగన్. ౬౭

ఉ. నావుడుఁ జూచి యాతఁడు మనంబు యథాస్థితి నిల్పి యిట్లను
న్వేపురు బాంధవు ల్గలుగ వేదనఁ బొందఁగ నాకు నేల మీ
కీవిధిచొప్పెఱుంగఁ దగునేని వినుం డిఁక వింధ్యకందర
గ్రావముఁ జెంది యుండె నొకరక్కసుఁ డక్కడ నిక్కువంబుగన్. ౬౮

శా. ఆమాంసాశనుఁ డుక్కు పిక్కటిలఁగా నాత్మాంతికద్వాదశ
గ్రామాంతస్థుల నెల్లవారలఁ దినంగా నందఱు న్భీతి నై
స్తోమం బై చని సాఁగి మ్రొక్కి యొకమర్త్యు న్నిత్యము న్నీ బహి
ర్భూమి న్నిల్పెద మారగింపుము నవాపూపాదియుక్తంబుగన్. ౬౯

మ. అని సంప్రార్థన చేసి యేఁగి నిజమర్యాదావిధిం బ్రాప్తుఁ డౌ
మనుజుం గమ్మనిపిండివంటలును సన్మానంబుతోఁ దెచ్చి య
ప్పనసేయం గని యార్చుచు న్వడలి వ్యాపాదించి[1] తృప్తాస్థగాఁ
దినుచుండుం దనుజుండు యత్నమునఁ బత్నీయుక్తుఁడై నిచ్చలున్. ౭౦

---

1 యాశ్చాటించి.

వ. ఇట్లనుదినంబును నరబలి జరగు నెల్లిటిదినంబున. ౭౧

క. మన్నిత్రుఁ డైన యొక్కద్వి, జన్మకుమారకుని వరుస చనుదెంచిన దే
తన్మూలము నాశోకము, సన్నారికిఁ గలియుగమున సౌఖ్యము గలదే. ౭౨

మ. అనిన న్విస్మయ మంది మేము ఖగవర్యా నీకు నవ్విప్రబా
లునకుం జుట్టఱికంబు సేకుఱిన కీలుం జెప్పుమా నావుడున్
వినరయ్యా యుపకారహీనుఁడ భయావిష్టుండ నిర్భాగ్యజీ
వనుఁడం జెప్పెద దీనికారణము మీవాలాయపుంబల్కులన్. ౭౩

ఉ. ఏనును బిల్లలుం గలయ నెల్లెడఁ బ్రుల్లుచు నుల్లసిల్లుచుం
గాననభూమిలోఁ దిరుగఁగా నొకచెంచురు లొడ్డి పోయినం
గానక తూఱుచో మెడలుఁ గాళ్లును జుట్టలుగొన్న దిక్కులన్
దీనులమై కలంగి నలుదిక్కులుఁ జూచుచునున్న యత్తఱిన్. ౭౪

క. ఫలకుసుమసమిత్పర్ణం,బుల కట చనుదెంచి మమ్ముఁ బొడఁగని కరుణా
కలితుఁ డయి యక్కుమారకుఁ, డలజడిఁ బడకుండఁ ద్రెంచె నయ్యురు లెల్లన్.

క. అతనికృప నిట్లు బ్రదికితి, క్షితి రాఁబులుఁగులకు నెల్ల సేవ్యుఁడనై విం
శతివర్షంబులు పెరిఁగితి, గతి సేసిన యతనికీడు గనుఁగొనవలసెన్.[1] ౭౬

క. తనకుపకారము చేసిన, మనుజునకు న్మేలు గోర మరగక[2] దుఃఖం
బున కడ్డుపడక యుండిన, జనునిబ్రదుకు మేఁకయఱితిచన్నుం బోలున్. ౭౭

క. రాక్షసిని జంపనోపను, బక్షిని దుర్బలుఁడ నన్నుఁ బ్రతినిధి గాఁగన్
భక్షింపు మనిన మాంస,ప్రక్షీణతఁ జూచి వాఁడు పైఁబడఁ డిటకున్. ౭౮

చ. అనవుడుఁ దత్ప్రతిక్రియ కుపాయము గానక చింతఁ జెంది యా
తనిఁ దగ నూఱడించి మదిఁ దారుచు వచ్చితి మేము నావుడు
న్వని చిరజీవి పత్త్రి నరవిందభవుం డలికంబునందు వ్రా
సినయది తప్పునే పరులచేతఁ జరాచర భూతకోటికిన్. ౭౯

క. ఈక్రమమునఁ బలుకఁగ విని, విక్రమభూషణుఁడు బాలవిప్రత్రాణో
పక్రమమున నిద్రింపక, శుక్రోదయవేళ కెదురు చూచుచు నుండెన్. ౮౦

గీ. అంతభార్గవోదయం బైన వెలుఁగునఁ, దెరువు గానవచ్చు తెఱఁగెఱింగి
కదలె వింధ్యగిరికి గండభేరుండాది, ఘోర మైనయడవిఁ గొంకు లేక. ౮౧

---

1 గతిగానక యతనికీడు గనుఁగొనఁబడియెన్. 2 మేలుఁజేయ మదిగానక.

చ. జలజల మంచునీ రొలుకఁ జల్లనిగాడ్పులు వీవఁ దారక
ల్లలమల మ్రగ్గఁ జీఁకటి క్రమంబున డిగ్గ విహంగసంఘము
ల్గలకలఁ బల్కఁ దూర్పున వికాసము కెంపునఁ గూడియాడఁగా
బలబలఁ దెల్లవాఱె జనపాలకుఁ డేఁగుచనాంతరంబునన్. ౮౩

క. ఒకసారె యేడుతేజులు,[1]వికలాంగుఁడు సూతుఁ డనిలవీథి తెరువుగా
నొకరథమునఁ ద్రిభువనములు, నొకనాఁటనె తిరుగునాతఁ డుదయముసేసెన్.

క. అపర్వత మెక్కుచు గజ,రూపంబగు తిమిర మణఁచి లోహితకాంతి
వ్యాపితకరనఖరుండై, దీపించె మృగేంద్రుకరణి దినమణి కణఁకన్. ౮౪

సీ. పూర్వదిక్పతి యొద్దఁ బొలుపారు గొడుగుపై ఖచితమౌ మాణిక్యకలశమనఁగ
విబుధబాలురఁ గూడి వేడుకతోడ జయంతుఁ డాడెడి పట్టుబంతి యనఁగఁ
బ్రాచీవధూటికాఫాలభాగంబునఁ బెట్టిన కెంపులబొట్టనంగఁ
దెలివితో నాడెడి దివసఫణీంద్రుని తలమీఁద నున్న రత్నం బనంగ
రక్తకాంతి మెఱయ రచితరక్తాశోక,కింశుకాగ్రగుచ్ఛసంశయంబు
పొడుపుఁగొండమీఁదఁబొడ తెంచెఁద్రైలోక్య, మండనంబు భానుమండలంబు.

క. దల మగుదీధితి నుదయా,చల మలరఁగ రూపబోధజననచ్ఛాయా
కలితం బైయొప్పునిమం,డల మప్పుడు రత్నదర్పణముగతి నొప్పెన్. ౮౬

సీ. ఎవ్వనియుదయ మిారేడులోకములకు దిక్కాలవృత్తులు దెలుపుచుండు
నెవ్వనితేజ మక్షీణమై వైభవముల కాధారమును దానయై వెలుంగు
నెవ్వనిమండలం బెల్లయోగీంద్రులుఁ జేరుముక్తికి మణిద్వారభూమి
యెవ్వనిమూర్తి వాణీశశంకరవిష్ణురూప మౌ వేదస్వాహాకు మంత్ర
మెవ్వఁ డిష్టజనుల కిష్టదర్శనమునఁ, బాపసంచయంబుఁ బాపుచుండు
నట్టిలోకమిత్రుఁ డైన తేజోనిధి, కోకములకు విరహశోక మణఁచె. ౮౭

మ. గిరిశృంగంబుల గైరికాకృతిని శాఖశ్రేణిపైఁ బల్లవో
త్కరలీలం గరిరాజకుంభముల మీఁద న్నక్షత్రచూర్ణాకృతిన్
శరధిద్వీపములం బ్రవాళరుచిఁ గాసారంబుల న్శోణపు
ష్కరకాంతిం దరుణాతపం బడరె దిక్కాంతాంగకాశ్మీర మై. ౮౮

చ. కలువలవైరి జక్కవలఁ గావఁగఁ బూనిన దాత ముజ్జగం
బులకును సాక్షి యంబరవిభూషణ మౌనెలతాల్పువేల్పుకు

1. ఒకతేజికేడుపేరులు,

స్వలపలికన్ను ముక్తి తలవాకిలి చీఁకటిపీడుకోలు నా
వెలుఁగులఱేఁడు తామరలవిందు వెలుంగుచునుండె నయ్యెడన్. ౮౯

క. సంధ్యావందనవిధి యా, వింధ్యానదిలోనఁ దీర్చి విభుఁ డనవరతా
వంధ్యారంభుం డల్లన, వింధ్యాద్రిబిలంబుఁ జేరె విప్రునిఁ గావన్. ౯౦

క. కాలుని కేళీశైలముఁ, బోలెడునచ్చోటి యస్థిపుంజముఁ గని భూ
పాలుఁడు మనమున నధికకృ,పాళుం డై వధ్యభూమి బలియై నిలిచెన్. ౯౧

గీ. అంత నింతిఁ గూడి యసుర యార్చుచు వచ్చి, యోరి పిండివంట లుజ్జగించి
నేఁడు నీవె వచ్చినాఁడ వి దేమిరా, యనుడుఁ దెలియఁబలికె మనుజవిభుఁడు.

క. ఓరాక్షస నే నొక్కని, బ్రాఁకినై యడ్డువడితిఁ బరదేశిఁ బ్రియా
హారముగ మెసవు మక్కా,హారంబులు వెనుకవచ్చునంతకు నన్నున్. ౯౩

మ. అనినం జిత్తములోన దానవుఁడు చోద్యం బందుచు న్నీదుపూ
నినసత్కార్యము సెల్లు మెచ్చితిఁ జుమీ నీకిష్ట మెద్దేని వేఁ
డిన నే నిచ్చెద నావుడుం గరుణాదృష్టిం గల్గ నీక్షించి య
జ్జననాథుండు పరోపకారకరణోత్సాహంబుతో ని ట్లనున్. ౯౪

క. ఇప్పుడు నీ వాడినయది, తప్పకుమీ తలఁచుగాఁగ దానవులకడం
దప్పులు గల వని పెద్దలు, చెప్పుదు రొకచోట సత్యశీలము లేదే. ౯౫

చ. నయమునఁ బూర్వదేవతలు నాఁగఁ బ్రసిద్ధికి నెక్కె రాక్షసా
న్వయము జగంబులో నసురవంశవిభూషణ[1] మీవు నీవచో
నియమముఁ దప్పనేరవు వె నీకుకళత్రము సాక్షి గాఁగ నా
ప్రియమును నీవునుం బ్రియము పెంపునఁ జేయుము[2] నిన్ను వేఁడెదన్. ౯౬

క. దనుజేంద్ర నేఁడు మొదలుగ, మనుజాహారంబు గొనుట మానుము కృపతో
జనులకుఁ బ్రియ మొసఁగుచు నీ,వనమున నెలకొనుము వింధ్యవాసిని కెనయై.

గీ. అనుడునవ్వరమిచ్చెదననితలంచి,ముదితహృదయుఁడై తనయింతిమోముఁజూచి
యితనిసరిపోల్ప నెవ్వరి నెన్నవచ్చు, వనిత యీతఁడు జీమూతవాహుఁడీ వె.

వ. అనిన నా రాక్షసి కుతూహలంబున ని ట్లనియె. ౯౯

—: జీమూతవాహనుచరిత్రము. :—

క. జీమూతవాహుఁ డెవ్వం, డేమి ఘనత[3] చేసి వెలసె నిక్కథఁ దెలియం
గా మనుజాంతక చెప్పుము, నా మనమున హర్షవల్లి నాటుకొనంగన్.

---

1. శిరోమణివీవు. 2 నీదునప్రియము పెంపును జేయర. 3 ఏమితగవు చేసి.

వ. అనుడు న ద్దనుజుండు పుణ్యపురుషుని యెఱుఁగం[1] బుణ్యపురుష కీర్తనం బుచితం
బని యి ట్లనియె. ౧౦౧

సీ. ప్రాలేయగిరిమీఁద భానుబింబద్యుతి మణిమయప్రాకారమహిమతోడఁ
దిరమైన కాంచనపురములో జీమూతకేతుఁడు నాఁగ విఖ్యాతయశుఁడు
ఖచరవల్లభుఁ డొకకనకవతీసంజ్ఞఁ బరఁగెడుకన్యకఁ బరిణయించి
ప్రీతిసంధిల్ల జీమూతవాహుఁ డనఁ దగునట్టి పుత్రరత్నంబుఁ బడసి
రాజ్యలక్ష్మిచేతఁ బూజ్యుఁ డై కడపట, వార్ధకమున భోగవాంఛ వదలి
నిజపదమునఁ బుత్రు నిలిపి నీతులుసెప్పి, వనితఁ గూడి యేఁగె వనమునకును.

క. జీమూతవాహనుండు మ,హామహిమాఖండలుండు యాచకజనచిం
తామణి శరణాగతర,క్షామణి ఖచరేంద్రకులశిఖామణి యయ్యెన్. ౧౦3

క. పితృదత్త మైన కల్ప,క్షితిరుహ మర్థులకు నొసఁగి చిక్కిన ధనసం
హతిఁ దనబంట్లకుఁ బ్రజలకు, హితులకుఁ దగ నిచ్చె రిపుల కెడ రిది యనఁగన్.

గీ. పురముఁ గొనఁ దలంచు నరులఁ జంపఁగఁబూని, జీవహింస కోడి చింతనొంది
తల్లిదండ్రు లున్నఁ దగుఁగాక యిది యేల, యనుచు గురులజాడ నరుగఁ దలఁచె.

వ. తలఁచి సఖుం డైన మధుకరుం గూర్చుకొని యరిగి త జ్జననీజనకులం గని సా
ష్టాంగంబుగాఁ బ్రణమిల్లిన వారలు సంతుష్టాంతరంగు లై యుండం జేరి. ౧౦౬

క. తత్పదపంకజసేవా,తత్పరమతి విరులుఁ బండ్లుఁ దాఁ దెచ్చుచు నా
సత్పురుషుఁడు మలయమహీ,భృత్పార్శ్వమునం జరించెఁ బితృభక్తుఁ డనన్.

మ. ఒకనాఁ డిష్టసఖుండుఁ దాను ఫలపుష్పోపార్జనాసక్తితో
వికచాంభోజసరోవరంబుల నవావిర్భూతచూతాది జా
లకజాలంబుల రాజకీరమదకోలంబాగ్రపుష్పంబులం
బ్రకటశ్రీగుణగణ్యమౌ నొక తపోరణ్యంబు సొత్తేరఁగన్. ౧౦౮

క. ముందల గౌరీమందిర,మందారనవారవిందమాకందలతా
కుందమకరందబిందు,స్పందానందనుఁడు మందపవనుఁడు వీచెన్. ౧౦౯

వ. అంతఁ దదాగతకుసుమామోదవాసిత మలయసమీరాప్యాయన శరీరాయా
సాపహారుం డై. ౧౧౦

క. ఎడపని కూరిమితో న,య్యెడఁ బుత్రికి నీడ యైన హిమశైలము కై
వడి బెడఁ గడరెడు పటికపు, గుడి బొడఁగని యక్కుమారకుం డటుచేరెన్.

1. పుణ్యపురుషుఁడు వినం బుణ్యపురుష.

క. అంగనమున నభ్యంతర,సంగీతాకర్ణనమునఁ జలియింపక వే
డ్కం గనవు మేయకున్నకు,రంగంబులఁ జూచె నంతరంగం బలరన్. ౧౧౨

వ. చూచి తత్సంగీతప్రసంగసాంగత్యకారణం బగు జాణం జూతము రమ్మని యిష్టసఖుం డైన మధుకరుం గూడి తద్ద్వారంబుఁ దూఱి. ౧౧౩

సీ. చిన్నిచన్నులమీఁదఁ జేర్చినవీణియ చేఁదోడుగా శ్రుతిస్థితులఁ దీర్చి
సరిగమపధను లన్సప్తస్వరంబుల గమకంబు లయవిభేదముల నెఱపి
నాదామృతంబున ననిచిన క్రియఁ దంత్రిఁ బెనఁగొని నఖకాంతి గొనలుసాఁగ
రాగకదంబంబు రంజిల్లఁ జేయుచు, నాలతి వీనుల కమృత మొసఁగ
గానరసవశమునఁ గనుఁగవ మోడ్చుచు, బోటిఁగూడి వాణిబోటిఁ బోలె
గారిఁ బాడుచున్న కన్యకారత్నంబుఁ, జూచె నచట బాలఖేచరుండు. ౧౧౪

వ. అంతఁ దదీయలావణ్యమధుమత్తనయనమధుకరుం డై మధుకరునితో నిట్లనియె.

క. వనితారత్నము నవమూ,వనమై పొదరింట నున్నవనలక్ష్మి క్రియన్
దోవ నున్నమరుని బాణం, బన నున్నది యిచట మోహనాకృతితోడన్. ౧౧౫

సీ. ఇది దేవకామిని యేని నింద్రుని వేయిఁగన్నులు సఫలము లగ్గాక యున్నె
యిది నాగకన్యక యేనిఁ బాతాళంబు సోముఁడు లేఁ డని శూన్య మగునె
యిది ఖేచరాంగన యేని మాజాతికిఁ బ్రభ మెక్కు చెఱకునఁ బండుగాదె
యిది సిద్ధబాలిక యేని లోకంబులో సిద్ధకులంబు ప్రసిద్ధిఁ గనదె
యిది వనాంతలక్ష్మి[1] యేని వనం బెల్లఁ, బల్లవింపకున్నె యెల్లయపుడు
నిది సుధాంశురేఖ యేని యీగుడి నున్న, శిలలు చంద్రకాంతశిలలు గావె.

క. పరసతులను దల్లులఁగాఁ, బరికించెడు నాకు దీనిపైఁ జిత్తం బే
పెరవునఁ దగిలెనో యిది కృత,పరిణయ గాకుండఁబోలుఁ బరికింపుదమా.

వ. అని యంతకుమున్న నిజదర్శనంబునఁ జంద్రావలోకనంబునం గరంగు చంద్రకాంతంబు క్రియఁ జిత్తంబు గరంగి మేన ఘర్మజలంబులు మణిగణభూషణంబులుగా లజ్జారాగనిమగ్న యై కనుబేటంబున గాటం బగునారాటంబునఁ దుంట విల్తుండు మానంబు వేఁటాడ[2] బోటి పూఁబోద మాటు సొరం దలంచు నెడ వసంతానుగమ్యమానుం డగు మీనకేతనుని భాతి దగ్గఱి యోలీలావతి నీ వెవ్వరిదాన వీగారిగేహంబున కరుగుదేరం గారణం బేమి నావుడు విని చతు

1. వసంతలక్ష్మి. 2. తుంటవిల్తుచే మానసంబు వేఁటెత్త. చి. పా.

రిక యను తత్సఖి లేచి బాలలకుఁ బ్రౌఢత్వంబు గలదె యేను విన్నవించెద
నవధరింపుఁడు. ౧౧౯

క. వసుమతిఁ బరఁగిన మిత్రా,వసుసోదరి సిద్ధవంశవరుఁ డగు విశ్వా
వసుసుత మలయవతి విభా,వసునిభుఁడగువరుని వేఁడవచ్చిన దిటకున్. ౧౨౦

వ. అనిన నక్కుమారుండు నామాట తప్పదిది కన్యక యగుట వింటివే యనుడు
నమ్మధుకరుండు దైవయోగమ్మున సమాన వయోరూపంబులు గలవధూవరు
లిట్లు గూడుదురే యని- ౧౨౧

క. వనరుహగర్భుని నేరమి, ననురూపసువస్తుయోగ మగపడదు జగం
బున మీాబోంట్లకు నగపడుఁ, గనకము రత్నమ్ముఁ గూడుకైవడి నొకచోన్.

వ. అని చతురికం జూచి నిజసఖుని దెసం జూపి. ౧౨౩

క. జీమూతకేతుసుతుఁ డరి,జీమూతసమీరణుండు చిత్తజనిభుఁ డా
జీమూతవాహనుఁ డితఁడు, జీమూతసిరుఁడు ఖచరశేఖరుఁడు సుమీా. ౧౨౪

క. అనవుడు నది మలయవతిం, గనుఁగొని యిది గాటికరుణఁ గలిగెం జెలియా
మును విందు మితఁడు రూపసి,యనఘుఁడు వరియింపు మితని నతిమోదమునన్.

ఉ. నావుడుఁ గన్యకామణి మనంబునఁ గూరిమి నాటుకొల్ప నా
భావజుబాణము ల్మిగులఁ బజ్జఁ జరించినఁ దత్పరాగమో
నా పిలసిల్లి లేఁజెమట నవ్యముగాఁ గుచసీమఁ దోఁప ల
జ్జావనతాస్యయై నిజవయస్యకు నుత్తర మీాక యుండెనన్. ౧౨౫

వ. చతురిక మఱియు నొత్తి పలుకుచున్నపుడు. ౧౨౬

సీ. జనని పుత్తెంచిన సఖి వచ్చి పిల్చిన నిఁక నుండరా దని యిచ్చఁ దలఁచి
పోయినఁ బ్రియుఁ డెట పోవునో యని నిల్చి తడసినఁ గోపించుఁ దల్లి యనుచుఁ
గదలి వేదన మదిఁ బొదలఁగా నేటికి నెదురీఁదుచాట్పున నింటి కేగి
బలవంతమైన యావలవంత మదిలోన వేఁగుచు నొకచోట వెచ్చనూర్చు
చున్నఁ జూచి చెలియలొయ్యనఁ జనుదెంచి, హృదయతాపమెఱిఁగిమదిఁగలంగి
చంద్రకాంతవేది శయ్యాతలంబుపైఁ, జేర్చి శిశిరవిధులు సేయునపుడు. ౧౨౭

క. పుప్పొడియుఁ బువ్వుఁ దేనెయుఁ, గప్పురమును జందనంబుఁ గలపిన పన్నీ
రప్పొలఁతుకపైఁ జిలికిన, నిప్పుపయిం జిలికినట్టి నెయ్యుం బోలెన్. ౧౨౮

సీ. కుప్పలు గొనఁజల్లుపుప్పొడియెరువుగాఁ బొరిఁబొరివిరహాగ్నిఁ బొగులఁజొచ్చె[1]
ఘనసారమిళితచందనపంక మురమునఁ దొడిఁదొడి నెఱియలు విడిచి చిటిలె

1. విరవిర విరహాగ్ని విరియఁజొచ్చె.

సెజ్జపైఁ బఱచిన చెంగల్వ రేకులు స్రుక్కి మై సోఁకినఁ జూర్ణ మయ్యె
విసనకఱ్ఱలు చేసి విసరుచో నావులఁ గదలీదళంబులు గ్రాఁగి మునిఁగె
మోవి కెంపు డిందె ముత్తియంబులు గందెఁ, గంకణముల లక్క కరఁగిపాఱెఁ
జలువమందు లెల్లఁ జెలువ మందఁగఁ జేయ, నెడఁదమదనతాప మినుమడించె.

క. కలకలఁ బలికెడు చిలుకల, కలకలములుఁ గోకిలముల కలరవములు నా
కులపఱుప నళికులంబులు, నులుకఁగ నయనముల జలము లొలికెం జెలికిన్.

వ. ఇట్లు పెచ్చుగిల్లిన[1] పచ్చవిల్తువెచ్చ వెచ్చు నెచ్చెలిం జూచి కలంగి ప్రబలదర్పి
తుం డగు నాదర్పకుని దూఱం దలంచి చతుర యై చతురిక యి ట్లనియె.

క. వలరాజ నిన్ను దూపున, గలిచిన జీమూతవాహు గెంటింపఁగ లే
కలఘుమతి నబల నొంచెదు, పలువురు విని రేని బంటుపంతము డిగదే. ౧౩౩

మ. అళులారా యలికుంతలం జెలిమితో నానంద మందింపుఁడీ
చిలుకా చిల్లలకొల్లి నేపక సఖీస్నేహంబు వాటింపుమీ
వలరాజా వలవంత మాన్పుము పికద్వంద్వంబ యీద్వంద్వముం
గలయం గోరుము మారుతా మరలుమీ కన్నంత నిక్కన్నియన్. ౧౩౪

వ. అనునప్పు డక్కుమారఖేచరున కైన యత్తాపమునకుం దాప యగు నాదిఖేచ
రుం డాదిత్యుండు కాంతి సడలినట్లు దిరిగి చని ఘనపుష్పరాశితల్పంబునం దన
మేను సేర్చిన. ౧౩౫

క. జడనిధి వెలువడి యెఱ్ఱగఁ, బొడమెడు కిరణములు శిఖలపోలికి నిగుడం
గడఁగి యుడురాజు విరహులఁ,బడబానల మనఁగ నుదయపర్వత మెక్కెన్.

గీ. అంత జగమునిండ నచ్చవెన్నెల పర్వ, నందులోని వేఁడిఁ గంది కుంది
కాఁగఁ బెట్టినయుదకంబులోపల నున్న, మీనుపోలె బాల మిడుకఁజొచ్చె.

వ. ఇట్లధికపరితాపంబునం బురపురం బొక్కుచున్న కన్నియం జూచి కళవళించి
చెలులు మెత్తన నెత్తుకొని చని గురువెదపందిరి క్రింద నరవిందతల్పంబుపై నిడి
దైవం బేమి దలంచునో యని దానిమేని కట్టావులం గ్రాఁగిన తమ్ము నవరించు
కొనుచు. ౧౩౬

క. తను వంట నోడి వనజా
ననకును జేమంతిపువ్వునం గొని పన్ని
రెనయ పెయిఁ బూయుచోఁ గ్రాఁ
గినపెనమున నొలుకు నూనె క్రియఁ జుయికొట్టెన్[2]. ౧౩౭

1. పిచ్చగిల్లిన-పెచ్చుపెరిఁగిన. 2 చుంయనియెన్-చుఱుకంటెన్.

క. అస్తోకంబుగ నత్తా,ళస్తని కుచమండలమున లలనలచే వి
న్యస్త మగుచందనము నవ, కస్తూరీలేపనంబు కైవడిఁ దోఁచెన్. ౧౪౦

వ. అవి యన్నియుం జూచి డగ్గఱి బెగ్గిలి చతురిక న్యాయనిష్ఠురోక్తులం జంద్రు
నుద్దేశించి. ౧౪౧

క. ఉడురాజ నీవు పొడిచిన, జడనిధి యుడుకెక్కి వైక్లబంబునఁ బొంగన్
బడబాగ్ని మీఱి నాపుడుఁ, బడఁతుక నీవేఁడిఁ జిమిడిపడ కెట్లుండున్. ౧౪౨

క. హరిణాక్షి చూడ్కిఁ గన్నుల, సిరిగోల్పడి యుట్టె నిన్నుఁ జేరిన నీ పీ
తరుణిఁ దెగఁజూడఁ బోలును, పరికింపఁగ నెపుడుఁ బక్షపాతివి గావే. ౧౪౩

మ. అమృతాంభోనిధి జన్మభూమి సురభూజైరావతశ్రీసుధా
ప్రముఖంబు ల్తగు తోడఁబుట్టుగు లుమాప్రాణేశుజూటంబు గే
హము బింబం బమృతం బనంగ జగదాహ్లాదంబుగా నిన్నుఁ జూ
తుము నీవేఁడిమి కాలకూటమునకుం దోఁబుట్టు వయ్యెంగదా.[1] ౧౪౪

గీ. నాఁకు నేఁడు నీకు నాఁడుఁదోఁబుట్టువు, లేదె కరుణ లేదు లేశ మైనఁ
బొలఁతిమొగముతోడి పొత్తైనఁ బరికించి, చల్లసేయుమయ్య చందమామ.

వ. అని వేఁడుకొని మలయవతిం జూచి. ౧౪౬

సీ. వనిత నీకన్ను లొయ్యన విచ్చి చూడవే మారుబాణము లరుదేరనోడు
నబల మాపీనుల కమృతంబు చిలుకఁగాఁ బలుకవే చిలుకలు పలుకనోడుఁ
గోమలీ నీదు ముంగురులు పాటింపవే తేఁటిదాఁటులు కొంత దాఁటనోడు
ధవళాక్షి నీముఖదర్పణం బెత్తవే సోముఁడు నీదెసఁ జూడనోడుఁ
బడఁతి మమ్ముఁ దగినపనిఁ బంపఁజీరవే, కోకిలంబు లిచటఁ గూయనోడు
మగువ చల్లనూర్పు నిగిడింపవే యించు, మలయమారుతంబు మలయనోడు.

వ. అని ధైర్యంబు పట్టుకొల్పిన నమ్ముద్దియ తనవేదన దీఱు తెఱంగు చెప్పంబూని
వ్రీడావశంబున నోడి మారుప్రేరణం దవులుకొని చెలిం జూచి. ౧౪౮

క. ప్రథమముననుండి చిత్తవ్యథ యెఱుఁగుదు ప్రాణసఖివి వలనైనమనో
రథ మొనగూర్పక యీమ, న్మథుబారికిఁ ద్రోవ నీకు నాయం బగునే. ౧౪౯

క. రతిపతికిఁ దోడుపడి యో, చతురిక వెనువెంట మందు చల్లుచు నన్నున్
బతిమాలించెద వకటా, హితులుం బగవారిఁ గూడి రేమనవచ్చున్. ౧౫౦

వ. అనిన నోయమ్మ నీ నెమ్మనంబున నింత యుమ్మలికం బేల నమ్ము మతనిం దెచ్చెద
నూఱడు మని చతురిక మనోహరిక యను సఖిం జూచి యీచేడియ గారి

1. దోఁబుట్టుకొటంబామీ–కొటంగదా.

ధామంబున జీమూతకేతు కుమారు సుకుమారుం జూచి వలచినయది యది మనరాజున కెఱింగించుట విచారం బగునే. ౧౫౧

క. చెప్పినఁ బతి గోపించును, జెప్పకయుండినను బాల చిక్కెడు మనకుం దప్పులు దొలఁగునుపాయము, చొప్పడు నేదేని బ్రదుకుఁ[1] జూడఁగ వలయున్.

క. అని తలపోయుచు నుండఁగ
వనజంబులు వెలయఁ గుముదవనములు సొలయం
గనుకని చీఁకటి పొలియఁగఁ
దనరుచి ఖివిఁగలయఁ బాలయఁ దపనుఁడు పొడిచెన్.[2] ౧౫౩

సీ. ఆవేళఁ జతురిక యనువునఁ బ్రాణంబు నిలుపంగఁబూని యానెలఁత లేపి
యిష్టునిఁ గూర్చెద నేతెమ్ము గౌరినివాసమ్ముకడ కని యాసగొలిపి
కొని చని మాధవీకుంజంబులోపలఁ జల్లని పల్లవశయ్య నునిచి
వగవకు జీమూతవాహనుం దెచ్చెద నని నాలు గడుగులు నడచునంత
నెమర మదనుచేత హృదయసంతాపంబు,పొదలఁబువ్వుఁబోదలమెదలఁబూని
సంగడీనిఁ గూడి యంగనఁ దలఁచుమఁ, బలవరించు నలనిపలుకు వినియె.

వ. అది యెట్లన్నను. ౧౫౪

ఉ. మారుని మోహనాస్త్రము, సమస్తవిలాసవిహారభూమి, శృం
గారరసంబు తేట, తొలుకారుమెఱుంగులపుట్టినిల్లు, సం
సారసుఖంబు లేమొలక, చక్కఁదనంబులప్రోక కాఁకబం
గారముచేగ, యాతరుణి కన్నులపండువ గాదె చూచినన్. ౧౫౫

క. నెఱిచెడి యింటికిఁ జనునా, తఱి మొగమున కెగయు తేఁటిదాఁటునకై తాఁ జెఱకడఁ బెడమఱి చూచినఁ,జాఱుకునా నెఱనునాఁటెఁజూ పెనుదూపై.[3]

వ. తన్మూలంబుగా మన్మథుండు బాణవిరహితుండయ్యె నని తదనంతరంబ.[4] ౧౫౭

క. మదనుని యేనమ్ములు నా,హృదయాగ్నిని భస్మమయ్యె నిదిమొదలుగ నీ
పదునాలుగులోకములును, బ్రదుకుఁ గదా వీనిచేతిబాధకు వెలియై. ౧౫౮

క. మధుకర తన్ముఖపంకజ,మధుకరభావమున మిగుల మత్తిల్లి సుధా
మధుర మగు నావధూమణి, యధరము చవిచూడఁ గలుగునా యిఁకనాకున్.

వ. అట్టిబోటి కూటమి లేక మదిం గంది కుంది బ్రతుకుకంటెఁ బ్రాణంబులు దొ

1. చొప్పడు నేదేనిబ్రదుకు చి. మూ. తప్పదుయేపనిదైనను ముప్పవుపున కేమిరైన మోసముల చ్చునే 2. క. మనసిజునియేపు జాఱఁగఁ...తనరుచి దివిగలయ బాలతపనుఁడు పొడిచెన్. 3. నె, న రునాటంజూపె మన్నసంబడమాటై. చిఱికునఁ బెడమఱిచూచిన, నెఱసఖిఁజేరిననాగనె 4. తన్మూ లంబుగాఁ బెడమఱిచూచిన మన్మథుండు తెగఁజూచుట లోకోపకారంబయ్యె.

అంగుట మే లనిన మధుకరుం డో కుమారకంఠీరవ యింతలో ధీరత్వంబు విడు
తురే నావుడు నభిమానించి. ౧౬౧

క. పూదినరసాలభూజముఁ, జూచితిఁ జంద్రాతపమ్ముఁ జొచ్చితి నిన్నుఁ
నీచేతికదళిదళముల, వీచోపులగాలినుంటి వీరుఁడఁ గానే. ౧౬౨

వ. అనునెడం జతురిక డగ్గతి తనచెలి వల పెఱింగింపం బూని. ౧౬౩

క. వీరుఁడవు మేరుభూధర,ధీరుఁడ వత్యంతదానదీక్షాజితమం
దారుఁడవు భూరికరుణో,దారుఁడ వయితేని బాల దయఁ జూడుమికన్. ౧౬౪

వ. అని మఱియును.[1] ౧౬౫

క. మలయాచలసానువుపై, మలయుచుఁ జనుదేర గాలిమందిరమున ని
ర్మలయశుఁడ వైన నిను మా, మలయవతీకన్య చూచె మానముదూలన్.

క. అది మొదలుగ మనసమ్ములఁ, జెదరిన ధైర్యమునఁ జేయి చెక్కిట నిడి స
మ్మద ముడిగి మనము నీపై, గదియించును జూడ్కి బాష్పకణములుదొరఁగన్.

క. భావజనిభుఁ డగు నాతని, భావంబునఁ గూర్మి నిలిపి పరిరంభణసం
భావన సుఖ మొనగూర్చెడు, దైవము నాపాలఁ గలుగదా యని తలఁచున్.

క. అనిమేషంబునఁ బ్రియునిం, గనుఁగొనఁగాఁగోరుకన్నుఁగవ కడ్డము వ
చ్చినఁ దనుఁ గోపించు నోకో, యని కన్నులఁ జేర నిద్ర యలుకుచునుండున్.

క. విను గడు సన్నం బగునీ, మనముఁ బ్రవేశింప నిదియ మరి మగు నని డ
స్సెనొ కాక యనఁగ నంగన, తనతనువునఁ దనువు లేక తనువై యుండున్.

క. సారసములు నారసములు, హారంబులు కంటకప్రహారంబులు క
ర్పూరము విషపూరము శృం,గారము బంగార మయ్యెఁ గామినిమదికిన్.

క. నేనుం దానును నొక్కటి, గా నుండఁగ నోపనిఁ దగిలెఁగా యనుచు నుదా
సీనంబు వీడుకోలుగ, మానినికిన్ లజ్జ దలఁగె మరు బేటమునన్. ౧౭౨

క. పలికెఁ బాడసూపెఁ బ్రియుఁ డదె, పిలిచె ననుం గీరచంద్రపికములనెడ వా
గ్విలసనరవములుఁ బలుకులు, మొలతేరఁగ సంభ్రమించు మ్రొక్కును లేచున్.

క. మోహమున మన్మథానల, దాహముపె ల్లొఱఁగలేక తనప్రాణంబుల్
దేహమునఁ గలుగుటకు సం, దేహముగాఁ జెయ్వులుడిగి దృష్టి మొగుడ్చున్.

క. సతి విడిచిన ప్రాణంబులు, పతి నిలుపఁగ నుండె నేఁగఁ బాడియె యతఁడీ
యతివ డిగవిడిచి తలఁగిన, సతివేగమ తలఁగి పోద మని యున్న వనా. ౧౭౫

క. ఖేచరవంశవిభూషణ, యేచోట వసింపలేక యెత్తుఁబయనమై
నా చెలిప్రాణంబులునినుఁ, జూచిన తావునన మొకురుచూచుచు నుండున్.[2] ౧౭౬

1. ఈక్రిందివి దశావస్థలకందములు. 2. పఠి, గోచరమగు తావులేక గొంతుచునుండున్.

మ. అని చెప్పంగ లతాగృహంబుకడఁ బ్రాణాధీశుచే నేఁడు మ
న్నన లే దింకిట నెన్నిజన్మములకైనన్ భర్త జీమూతవా
హనుఁ డౌఁగాత మటంచుఁ దీఁగెయురిలోన్ నాబాలకంఠంబుఁ దూ
ర్చిన లోకాంబిక వైన యంబిక కృపం జేపట్టి తా నిట్లనున్. ౧౭౭

క. హృద్యాకారిణి యీమర,ణోద్యోగం బుడుగు బాలుఁ డుత్తముఁడు యశో
విద్యోతితుఁ డధికాయువు, విద్యాధరచక్రవర్తి విభుఁ డౌనీకున్. ౧౭౮

వ. అనిన ననుమానించు నెడ నచ్చతురికయు వియచ్చరకుమారుండునుం బఱతెంచి కంఠంబున నున్న లతాపాశం బూడ్చి భుజలతాపాశంబిడి యింత తెంపు సేయుదురే యే మిదె వచ్చుచున్నవార మని బుజ్జగించిన నుజ్జీవిషు వగు నజ్జోటి లజ్జామజ్జదవనతాననాబ్జ యై పులకించి గురుని యనుమతి లేమిం గొందలపడు నెడ మనోహారిణి యనుసఖి వచ్చి గౌరీప్రసాదవిభవం బిట్టిదిగదే యని. ౧౭౯

గీ. అమ్మ నీవు గోరినట్లు మీతండ్రియు, నితని కిచ్చెద నని యెఱుఁగఁజెప్పె
మీకుఁ బెండ్లి సేయ మిత్రావసువునకు, నానతిచ్చె నటకు నరుగుదెమ్ము. ౧౮౦

గీ. అన్నమాటఁ బొంగి కన్నులఁ బ్రియునికిఁ, గన్నె మ్రొక్కి యేఁగె నన్నకడకుఁ
జిత్త ముల్లసిల్ల జీమూతవాహనుం, డాత్మగురులకడకు నరుగుదెంచె. ౧౮౧

వ. తదనంతరంబున మిత్రావసుండు జీమూతకేతుం డున్నకడకు వచ్చి యవ్వధూవరుల పరస్పరానురాగం బెఱుకపడం జెప్పి ప్రార్థించి తదనుమతి వివాహవేళ నిశ్చయించి నానానగరనివాసు లైన కిన్నరకింపురుష గరుడగంధర్వ సిద్ధసాధ్య విద్యాధరులం గూర్చి యుభయవర్గంబులుగా నేర్చి సకలశృంగారాభిరామంబుగా నొనర్చిన కళ్యాణమండపంబున నున్న సురేంద్రాదిసురలు వధూవరులం జూచి సదృశకులవయోరూపలావణ్యంబులు గల మిథునంబుం గూర్చుటకుం బితామహునిం గొనియాడుచుండ. ౧౮౨

సీ. అప్సరఃస్త్రీలు కళ్యాణగానంబులు తెఱఁగొప్పఁ బాడఁగా దివ్యమునులు
ప్రకటించి మంగళాష్టకములు చదువంగ రత్నములుం దలఁబ్రాలుగాఁగ[1]
నగ్నిదేవుండు ప్రత్యక్షమై సాక్షిగాఁ దగ బ్రహ్మమునులు మంత్రములు సెప్ప
నిర్జరకాంతలు నివాళులిడఁ[2] గల్పవృక్షంబు లొగిఁ బుష్పవృష్టి గురియ
సురలు పరిణమింప సురదుందుభులు మ్రోయ, నారదుండు దీవెనలుగఁ బాడ
విశ్వమెల్లఁ బొగడ విశ్వావసునికూఁతుఁ, బరిణయించె ఖచరవరసుతుండు.

1 చేతనం బ్రాలుగాఁగ 2. వాసుకిసుతులునివాళింపఁగా. నిర్జరకాంతలు నివాళింపఁగా.

గీ. పరిణయోత్సవంబు జరిపి సిద్ధవిభుండు, గారవమున నెల్లవారి ననిపె
స్త్రీసమేతుఁ డైన జీమూతవాహుఁడు, గురుపదాంబుజములు గోరి చనియె.

క. జనకుని యనుమతిఁ గతిపయ, దినములు రతితంత్రగతులఁ దేలుచు వనితా
జనతానురాగుఁడై చందనగిరిపై నతఁడు మనము దనియ సుఖించెన్. ౧౮౫

ఉ. అంతట నొక్కనాఁడు ప్రణయాన్వితుఁడై తమ బావఁ గూడి ప
ర్యంతవనాంతభూమిఁ గలయం జరియించుచు వింతకాంతి న
త్యంతసముజ్జ్వలం బయిన యస్థిసమూహముఁ గాంచి పర్వత
ప్రాంతమున న్శరద్ఘననిభం బది యేటిది బావ నావుడున్. ౧౮౬

వ. అతం డిట్లనియె. ౧౮౭

క. పక్షీంద్రుఁడు పక్షానిల, విక్షిప్తం బైన జలధి వేఁటాడి మహా
చక్షుఃశ్రవముల నిత్యము, భక్షించుచునుండుఁ దొంటిపగ మొదలాఁడెన్.

క. ఆగరుడికి వెఱచి మహా, నాగేంద్రుఁడు వచ్చి యనుదినము నొకపాము
న్నీగుంటికడకు నేనై, వేగమె పుత్తెంతు నింక వేఁటాడకుమీ. ౧౮౯

ఉ. దుర్భరపక్షపాతహతిఁ దోయధి పాయలుగాఁగ వచ్చు నీ
యార్భట మెల్లెడ న్విని భయంబున నంద భుజంగమాంగనా
గర్భము లెల్ల నాశిపడఁగా నిది సీధనహాని[1]గావునన్
నిర్భయవృత్తితుండఁ గరుణింపుము నీకుఁ బ్రయాసమేటికిన్. ౧౯౦

మ. అని ప్రార్థించి మహీంద్రుఁ డేఁగి దినమర్యాదన్ ఫణిం బంపఁగా
వినతాపుత్రుఁడుఁ దించు నుండు నవి భావింప న్శతాసంఖ్యముల్
వినుమా తెల్పు లదస్థికూటము జగద్విఖ్యాత మీ తార్క్ష్య వ
ర్తన మిచ్చో మనసంబున న్నిలువ యుక్తంబౌనె లోకోత్తమా. ౧౯౧

గీ. అనుచు దానశూరుఁ డగువాని మది నొంచు, పుట్టకుండ మరలి పోద మనుచుఁ
బిలుచునంతఁ దండ్రి పిలువఁ బుత్తెంచినఁ, బాసిపోయె సిద్ధపతిసుతుండు. ౧౯౨

గీ. అంత నక్కుమారుఁ డహిరాజు మది దూఱి, గరుడువలన నురగమరణములకు
మూల మయ్యె దాన నేలికతన మెద్ది, యేది పెద్దతన మదేటితగవు.[2] ౧౯౩

క. అకటా నాగేంద్రుఁడు స్వ, క్కక జిహ్వలు రెండువేలు గలుగఁగ నొకనా
లుకనైనఁ దన్నుఁ దిని స, ర్పకులము రక్షింపు మనుచుఁ బలుకం దగదే. ౧౯౪

సీ. అని కరుణాకరుండై యేఁగుచో నొక్క వృద్ధకామిని పుత్రు వెనుకఁ దగిలి
హాశంఖచూడ వంశాధార యోయన్న నీచిన్నిమో మెందుఁ జూచుదాన

1. నిర్భరహాని. 2. బ్రదుకు.

పక్షినాయకుబారిఁ బడఁద్రోచి యే నెట్లు నిలుతుఁ బ్రాణంబుతో నీవు సనఁగ
బాధువు లాదటుఁ బగటి కొప్పించిరి యింకిట నీకు దిక్కెవ్వ రయ్య
యనుచుఁ బలవరింపఁ గనుఁగొని యది దాని, జననిఁగా నెఱింగి మనుపఁబూని
వీనిఁ గాచువాఁడ వెఱవకు మోయమ్మ, యనిన గరుఁడుఁ డనుచు నబల వెగడి.

క. పై చీరఁ గొడుకుఁ గప్పినఁ, జూచి యతం డేను వినతసుతుఁడంగా నే
ఖేచరకులజుఁడ నీసుతుఁ, గాచెద వెగ డుడుగు నన్ను గరుడనికిత్తుఁగ. ౧౯౬

వ. అనిన వెగ డుడిగి యప్పడఁతి యిమ్మాట యింక నొకమాటాడుఁ డనిన నతండు నవ్వి. ౧౯౭

క. నేలయు నుదకముఁ దేజము, గాలియు నాకసము నెఱుఁగఁ గాచితి నాకై
కో లిడె రెం డాడఁగ నా, నాలుక మీకులమువారి నాలుక లటులే? ౧౯౮

ఉ. మేరువు సంచలించిన సమీరుఁడు నిల్చిన భూమి గ్రుంగినం
దారక లెల్ల డుల్లిన సుధాకరుఁ డగ్నికణంబు లొల్కిన
న్వారిధు లింకిన న్నభము వ్రాలిన భానుఁడు చల్లనైన నం
భోరుహసూతి దప్పినను బొంకుదునే మునుపాడి క్రమ్మఱన్. ౧౯౯

ఉ. నావుడు నాగకాంత కరుణాకర మోఖచరేంద్ర నాసుతుం
గావఁగఁ బూని వచ్చితివి కన్నతనూజునికంటె నీయెడన్
భావము సార్ద్రమైన మది పన్నగవైరికి నిన్ను నిచ్చి యే
త్రోవల నేఁగుదున్ బ్రదుకు త్రోవ విచారము లేదు నా కిఁకన్. ౨౦౦

గీ. అన్న నీకు నతిచిరాయువు గావుత, మన్న శంఖచూడుఁ డతనిఁ జూచి
కరముఁ జోద్యమంది కరములు మొగిడించి, విన్నఁదనములేక విన్నవించె.

క. వసుధఁ గొఱగాని కడుఁబా,లసులము పులుకాసిపురువులము[1] మాకై నీ
యసువులఁ బగఱకు నొసఁగుట, కసవునకై రత్న మమ్మఁ గడఁగుట గాదే.

శా. సంసారాటవిలోపలం గలవు మత్సామాన్యముల్ వ్యర్థముల్
హింసామూలము లైన జంతువు లసంఖ్యేయంబు లోఖేచరో
త్తంసా నీకెనయైనవారు గలరే ధర్మాధికు ల్వెంచలో
హంసానీకము లేదుగాక బకభేకౌఘంబు లేకుండునే. ౨౦౩

క. మావంటివారి నూర్వురఁ, గావఁగఁ జాలుదువు నీ వొకనిఁ గాచుటకున్
జీవం బిచ్చిన నార్తుల, కేవెరవున బ్రదుకవచ్చు నెడరైన యెడన్. ౨౦౪

---

1. కుటిలపరిచారులము.

క. మాకులమువారు విడిచిరి, నీ కీకృపసేయనేల నీచుట్టమనే
శోకమునఁ జావకుండఁగ, నీకాంతను ముసలిఁ గావు మింతియ చాలున్. ౨౦౫

చ. అనవుడు ఖేచరేంద్రసుతుఁ డచ్చెరువంది ఫణీంద్రనందనా
వినుమిది యేల నాపనికి విఘ్నము చేసెద వింతకాల మీ
వనమున నర్థి వేఁడమి దివానిశము ల్మదిఁ గుందుచుండు నేఁ
డనఘ పరోపకారసమయం బిటు గల్గిన నుబ్బి వచ్చితిన్. ౨౦౬

చ. తనయులు భార్య లన్నలును దమ్ములుఁ జుట్టలు సంగడీండ్రు యౌ
వనము ధనంబు నంచు మది వారక ప్రాణములైన నిచ్చి తా
ననదను నార్తు దీను శరణాగతుఁ[1] గావనివాఁ డజాగళ
స్తన మని యండ్రు వానికి యశంబును ధర్మము నెట్లు చేకుఱున్. ౨౦౭

ఉ. లావు భయార్తరక్షణము లాభము పుణ్యము దేహశుద్ధి స
ద్భావము భూషణం బెఱుక ధర్మము సత్కృప ప్రాభవంబు సం
భావన పాడి సత్యపరిపాలన మే లుపకార మెయ్యెడన్
భావన కీర్తి యాయువు శుభంబు నిజాప్తులు ధాత్రిలోపలన్.[2] ౨౦౮

క. జాణ "లనిత్యాని శరీ,రాణి" యనుచుఁ దెలిపి చెప్పరా[3] భువినాత్మ
ప్రాణంబు లిచ్చి యార్త, త్రాణం బొనరింపవలయు ధర్మజ్ఞులకున్[4]. ౨౦౯

గీ. నీవు లేవేని నొరులకుఁ గావవశమె, ధన్య నీవు బ్రదికిన నీతల్లి బ్రదుకు
నదియు కారణముగ వైరి కడ్డపడుము, నీవు గోరిన యట్ల యీనెలఁతఁ గాతు.

గీ. అనుచు వధ్యచిహ్నమైన రక్తాంశుక, మడిగి మ్రొక్కినంత నతని నిల్పి
యేల ఖేచరేంద్ర యీదివ్యదేహంబుఁ, బాముకొఱకు విడువఁ బాడియగునె.

క. క్షోణీమండలమునఁ గల,ప్రాణుల కెడరైన నడ్డపడుచుఁ దదీయ
త్రాణం బొనరించుచు నీ,ప్రాణంబులతోడఁ గీర్తిఁ బడయందగదే. ౨౧౨

గీ. శంఖధవళమైన శంఖపాలకులంబు, శంఖచూడు చేతఁ జాలఁ గందె
ననఁగ మీఁదఁ బుట్టునపకీర్తి నాకది, చావు గాదె బ్రదుకుత్రోవ యేది. ౨౧౩

వ. కావున నన్ను మన్నించెదవేని నీతెంపు మాని మరలు మని పునఃపునఃప్రణా
మంబు లాచరించి యాతని వేఁడికొని తల్లిం జూచి యోయమ్మ నెమ్మనంబున
బమ్మరింపకుము నాకెన్నిజన్మంబులనైన నీవ జననివి గ మ్మని మ్రొక్కి వీడుకొని
దేవతాప్రణామోన్ముఖుం డై చని యాపొంత. ౨౧౪

1. ననద నఘాఘు నార్తు శరణాగతు. 2. చా వపకీర్తి యశంబు నిజాప్తులు హీనజంతువుల్. 3. యుండరా. 4. తత్త్వజ్ఞులకున్.

క. గోకర్ణరాజకంకణు, గోకర్ణనివాసుఁ బాపగుణగోకర్ణున్
గోకర్ణశాయిమిత్రుని, గోకర్ణేశ్వరునిఁ జూచుకోరికి నేఁగెన్. ౨౧౫

సీ. అట ఖేచరాత్మజుఁ డార్తునిఁ గాచుట చేకూరు టెట్లని చింతనొంది
యర్ణవతీరగోకర్ణంబునకు వాఁడు చని వచ్చునంతకుఁ జనఁ దలఁచి
యత్తవా రిచ్చిన యరుణాంశుకంబులు వధ్యచిహ్నములకు వలనుగాఁగఁ
బులకించి చని వధ్యశిలయెక్కిమదిఁజొక్కి[1] గారుడాగమనంబుఁ గోరుచుండి
తల్లి కనకవతియుఁ దండ్రి ఖేచరపతి, కాంత మలయవతియె గాఁగ నాకు
నీపరోపకార మెల్లజన్మంబులఁ, గలుగ వలయుననుచుఁ దలఁచునపుడు. ౨౧౬

మ. గిరు లల్లాడఁగ స్వర్గుతేరు దూలఁగం గీర్ణంబులై మింటిపైఁ
దవపుల్ గ్రద్దలభంగి నాడఁగ సముద్రం బెల్ల ఘూర్ణిల్లఁగాఁ
హరిదంతంబులు పక్షకాంతి నవసంధ్యాలీలఁ గీలింపఁగా
గరుడుం డార్చుచు వచ్చె నచ్చటికి నాకారంబు ఘోరంబుగన్. ౨౧౭

ఉ. వచ్చి యతండు మస్తమున వ్రయ్యలు వారఁగఁ దన్ని ముక్కునన్
గ్రుచ్చి వియత్పథంబునకుఁ గొంచుఁ జనంగఁ గిరీటరత్నముల్
చెచ్చెర మాంసఖండముల చెల్వున భూమిఁ బడంగ నిచ్చలో
మెచ్చి కుమారకుండు ధృతిమేరువు మే లొనగూడె నా కనన్. ౨౧౮

ఉ. అంబరసీమనుండి మలయాద్రిశిలాస్థలి వ్రాలి యేకచి
త్తంబున మాంసఖండములు దర్పము గ్రమ్మఁగ త్రెంచి మ్రింగఁగా
నంబరచారినందనుఁడు హర్షరసంబున మేను పొంగ వ
క్త్రాంబుజ ముల్లసిల్లఁ బులకాంకితుఁడై విహగేంద్రుఁ జూచినన్. ౨౧౯

వ. అంతఁ బక్షీంద్రుండు. ౨౨౦

ఉ. వేదన మేను స్రుక్క దరవిందముకాంతిఁ దొఱంగ దాననం
బాదరణంబు నాయెడ మహాఘన మైనది యంతరంగ మా
మోదతరంగితంబు నిజమూర్తివిలాసము దివ్య మిట్టి కా
కోదరజాతి లేదు సుగుణోత్తమ యెవ్వఁడ వీవు నావుడున్. ౨౨౧

ఉ. ఎవ్వఁడ నైన నేమి[2] మది నిన్నివిచారము లేల నీకు నేం
డెవ్వఁడు భక్షణం బగు నహీశ్వరబంధువు[3] గాక యియ్యెడన్
మవ్వము దప్ప దంగలత మానవు గంటుల రక్తపూరముల్
క్రొవ్విననమాంస మున్నయది కొమ్ము భుజింపు భుజంగమాంతకా. ౨౨౨

1. వడిఁబొంగి. 2. నైతినేమి. 3. నహీంద్రులఁ దిందువు.

క. అను నెడ నా గోకర్ణే,శునకుం బ్రణమిల్లి శంఖచూడుఁడు మఱలం
జనుదెంచి వధ్యశిలమీఁ,ద నవం బగు రక్తబిందుతతిఁ బొడఁగాంచెన్. ౨౨౩

గీ. కాంచి మున్నతఁడు వందించి వచ్చుట, తెలిసి తన్నుఁ దాన తిట్టికొనుచుఁ
గులముఁ గావనైతి గురునాజ్ఞఁ దప్పితి, నన్ను డాఁచి యొకని మన్నిగొంటి.

గీ. ఇట్టి కష్టజీవన మేటికి నాకని, చాఁ గడంగి యచటి కేఁగుదెంచి[1]
ఖేచరేంద్రతనయుఁ జూచుచుఁ దలయూఁచి, భుజగవైరిఁ జూచి భుజగవరుఁడు.

మ. వినతానందన దీనరక్షణపరుం డీవిద్యాధరేంద్రాత్మజుం
దిన ధర్మం బగునే సహింపు మకటా దృష్టింపవే పాములం
దినవే యాచవి మున్నెఱుంగవె భవద్భృత్యాత్ముఁడా రాజునం
దున నే వచ్చితి నాగపుత్త్రుఁడ ననుం బోనీక భక్షింపుమా. ౨౨౬

వ. అనిన గరుడుండు పడియున్నయక్కుమారకుం జూచి నే నెఱుంగనైతి నీ కీదుర్ధ
రణోద్యోగం బేల యనవుడు నతం డేమని చెప్పను నా యత్నం బంతయు
విఫలం బయ్యె. ౨౨౭

క. వికలము లగుప్రాణంబుల, నొకయుపకారంబు సేయనోపుదు నని కౌ
తుకమున నినుఁ గొలువఁగ వీఁ, డకటా యవసానవైరి వై చనుదెంచెన్.

చ. అనునెడ శంఖచూడుఁడు రయంబున డగ్గఱ వచ్చి యెత్తి యో
ఘనకరుణార్ద్రమానస యకారణబాంధవ సత్యసంధ యీ
వినతసుతుండు నీ వనువివేకము లేక యహీంద్రుఁ డంచు నీ
సునఁ దెగటార్చె నొక్కొ యనుచుం దను వంటఁగఁ జేర్చి యేడ్వఁగన్. ౨౨౯

గీ. వధ్యచిహ్నమైనవసనంబుఁ జూచితి, నెఱుఁగనైతి నీతఁ డెవ్వఁ డనిన
వ్యోమచరవిభుండు జీమూతవాహనుం, డనుడు వెఱఁగుపడుచు నడలి గరుడి.

క. మందరతటమున హిమవ,త్కందరముల మలయసీమఁ గైలాసమునన్
బృందారకసుందరు లా,నందంబునఁ బాడు ఖచరనందనుఁ డితఁడే! ౨౩౧

క. కడుఁ బుణ్యుం డగు నీతని, మడియించిన శోకవహ్ని మడియుట కంటెన్
సుడిగొని జలనిధి నుడికెడు, బడబాగ్నిం బడుదుఁ గడిఁదిపాపం బడఁగన్.

సీ. అనుడు నంతకమున్న తనయుకిరీటరత్నంబు కోడలియంకతలముమీఁదఁ
బడిన నాపడఁతుక పతిశేఖరం బని వెగడుచు ముందటం బెట్టనంతఁ

1. పాఁ గడంగి యచటి కేఁగుదెంచి- చాఁదలఁచి యచటి క్రేవవచ్చి.

గాంతయుఁ దాను నిర్ఘాతపాతం బైన తరువు కైవడిఁ గూలి తడసి తెలిసి
ఫణిఫణామణి యని భావించి సుతునిదిగాఁ జూచి తన్మృతి గలుగు టెఱిఁగి
మూర్ఛనొందుచు శోకాగ్ని మునిఁగి మునిఁగి, యాలుఁ గోడలుఁ దనతోడ నడలి వడఁక
మారుతప్రేరితం బగుపూఁబొమ్మ, భాతి నేతెంచె జీమూతకేతుఁ డటకు. ౨౩౩

వ. ఇట్లు చనుదెంచి యట గురుజనప్రాణభయాకులుం డై నెత్తుట జొత్తిల్లిన యురగ
కుమారునిమీఁద నొరగిన కుమారుమ్రోల వ్రాలి. ౨౩౪

సీ. ఓయయ్య మీ బావయును నీవు నాకుచు నున్నార లని నమ్మి యుంటిఁ గాక[1]
దవ్వేగ నిత్తునే[2] తడసిన రానైతిఁ గులరత్న మా నిన్నుఁ గోలుపడితి
రాజ్యంబు విడిచి యరణ్యంబుఁ జేరియు నీసేవ సౌఖ్యంబు నెగడఁ గంటి
సద్భక్తి సేయవే సరగున నో యన్న[3] చెనఁగుఁ బాముల కేల జీవ మీయ
గరుడనఖముఖాగ్రఘాతంబునకుఁ జొరఁ, బూని మెత్తనైన మేన దెట్లు
మాకు దిక్కు గలరె యో కరుణాకర, చీఁకు చేతికోల చిన్నికఱ్ఱ[4]. ౨౩౫

వ. అని పలవరించుచు మేనంటి మూర్ఛమునుఁగఁ గనకవతియుం గనుఁగవ నశ్రుపూ
రంబు తోరంబుగాఁ బెదవులు దడుపుచు మొగము వెలవెలం బుచ్చుచుఁ గో
డలిం గూడి గోడాడుచు. ౨౩౬

సీ. ఓతండ్రి యెందఱు నొక్కపెట్టునఁ జావఁ గడఁగితి వొకపాముఁ గావఁ బూని
ధనకనకాదులు తనియ నిత్తును గాక ప్రాణంబు లొసఁగెడు ప్రభుఁడు గలఁడె
తనతల్లికడుపు చల్లన చేసికొన నోపి శంఖచూడుఁడు నీకుఁ జావొనర్చెఁ
జీకుపట్టినకోల యీకుమారుం డని గరుడుని కేలొక్కో కరుణ లేదు
దైవమేల యిట్లు దలఁచె నే నెట్లోర్తు, నేమి సేయుదాన నెందుఁ జొత్తుఁ
బాసి యేఁగఁ దగునె మూసినముత్తెమ, పంజరమ్ముచిలుక పసిఁడిబొమ్మ. ౨౩౭

క. మలయవతి మీఁదిప్రేమము, మలయించెనె దైవ మిట్లు మమ్మెడ చేసెం
బలుకొకటి బ్రాఁతి చిలుకల, కొలికి నా చందమామకూనా నీకున్. ౨౩౮

వ. అని విలాపింపంగఁ బ్రాణహానికి శంకించెద రని తన ప్రాణంబులు చిక్కఁబట్టి యు
ల్లవ కనువిచ్చి జననీజనకులం జూచి. ౨౩౯

క. గురులార మీరు నాకై, పొరపొరఁ బొక్కంగవలదు భువి "ధర్మస్య
త్వరితాగతి" యను పలుకునఁ, బరహిత మొనరింపఁ గంటి బ్రదుకిది గాదే.

---

1. మన్నారటంచు నే నుంటిఁ గాక. 2. ధర్మైకనిరత- 3. సద్భక్తిసేయ వేసరితివో యో యన్న. 4. చెలుకుచేతికోల చిన్నికూన.

ఉ. అస్థిగృహంబు దేహము పురాశలఁ జిల్లులు వోవ స్రుక్కి రో
గస్థితిఁ జిక్కి చచ్చు టధికం బగుమోసము గాక, దానిలో
నస్థిర మైనప్రాణమున నగ్గువ[1] మిక్కిలిగా జగంబునన్
సుస్థిర మైనకీర్తిఁ గొన జూచిన లాభమునం గొలంతయే. ౨౪౧

వ. కావున నగ పుడిగి నాగకుమారు నాకుమాఱుగాఁ దలంచుకొనుం డని సాయాసకృతాంజలి యై యంత్యప్రణామం బొనరించిన సవినయానతుం డై వినతాసుతుం డోకుమారచంద్రా నాయజ్ఞాననిద్ర దొలంగె నీధైర్యసాహసపరోపకారగుణంబులం బరిణమించితి నాకేమిహితం బానతి మ్మనిన. ౨౪౨

క. దయసేయుము పాములపై, భయభీతులఁ గావు ధర్మపథమునఁ జను ని
శ్చయ మిది దురితము దీసను, లయ మగు నుదకమునఁ బడ్డలవణముభంగిన్.

క. అని చెప్పి శంఖచూడా, వినుమా గురుజనులసేవ విడువకు మింక నీ
జనని కను బెగడకుండఁగఁ, జనుమీ యని పలికి హృదయజలజములోనన్.

క. రుద్రునిఁ దలఁచుచు గీర్తన,ముద్రుండు పరోపకారమున నలసిన యా
ముద్ర తన మేనఁ దోఁపఁగ, నిద్రించినకరణి దీర్ఘనిద్రం జెందెన్. ౨౪౫

వ. అంతం దత్సహచరీసహితు లయిన జననీజనకులు తమ యురోముఖశిరోఘాతహాహాకారమహారావంబులు మలయగహ్వరంబున నుపబృంహితంబు లై దిక్కులు పిక్కటిల్ల బిట్టేడ్చుచు మూర్ఛిల్లుచు నుభయకృత్యోపచారంబులఁ దెలియుచు నలయుచుఁ బలవరించుచు. ౨౪౬

గీ. పురము ధనము రాజ్యభోగంబు విడిచియు, మున్నుఁ గలసి యిచట మాయనుజ్ఞ
నబలఁ గూడి పిదప నందఱఁ బాసి నేఁ, డొంటి నేఁగ నీకు నుచిత మగునె.

వ. అనవుడు ననుగమనోద్యోగ గావున మలయవతీకన్య ధైర్యం బవలంబించి.

క. ప్రాణము కొఱకై యితరుల, ప్రాణము దినుచుండు వాని ప్రాణము గావం
బ్రాణం బెడఁబాసిన నా, ప్రాణేశుం డిపుడు మనలఁ బాయుట యరుదే. ౨౪౯

క. మనకుండుట యిల్లిటిఁగియు, మన కుండుట తగునె యితనిమార్గంబున నా
మనమరిగెడు గతిఁ దడయక, మన మరిగెను తెఱఁగుఁ గనుఁడు మఱి వగ పేలా.

గీ. అనిన శంఖచూడుఁ డాదటఁ జావుల, కేన నూఱాల నైతి నితనివెంట
నరుగువాఁడ ననిన నాపె కాఁగ మేను, మున్న సత్తు ననియెఁ బన్నగారి. ౨౫౧

---

1. అన్నువ, అల్పత.

గీ. నాపుకు మీఁద కిందఆకుం[1], జావం బనిలేను సుతునిజాడ నెయ్యేఁగం
గావలయుఁ జిలి వేగమె, కావింపుము శంఖచూడ కడుఁ బుణ్య మగుఁగా.

గీ. అనుడు సభయుఁ జూచి యమరవర్గములార, ఘనపరోపకారమునకు మెచ్చి
యమృత మైనఁ జల్లి యన్న ప్రాణంబులు, గావరయ్య మమ్ముఁ బ్రోవరయ్య.

వ. అని జననీజనకులు (క్రమంబున) వేఁడినఁ దజ్జననోపాయుం జెఱింగి విహగేంద్రుం డింద్రుం బ్రార్థించి యమృతంబుం దెచ్చి యిచ్చట విపన్నుఁబు లగుపన్నగంబుల తోడ నిప్పన్నగకుమారరక్షకుం గాచెద నని పూని. ౨౧౪

ఉ. పోయుదుఁ బ్రాణము ల్లగుడఁ బూనిక దప్పిన మేను వర్ధిలోఁ
ద్రోయుదు నెల్లదేవతలఁ దోలుదు నాకముఁ బట్టి పాఱఁగాఁ
జేయుదు సప్తదిక్పతులఁ జెండుదు మేదినిఁ గ్రింద మీఁదఁగాఁ
ద్రేయుదు నీనిపై నమృతవృష్టి వడిం గురియింతు నింతటన్. ౨౧౫

క. అని గరుడుఁ డెగసి యేఁగినఁ, దనయునిదెసఁ జూడలేమిఁ దడయక ఫణినం
దనుచేత ఖచరసతి చం,దనచితు లొనరించు కొనియెఁ దత్పార్శ్వమునన్.

వ. అంత నత్యంతసతీమండనంబులు గైగొని మలయవతి పతిచితికిం బ్రదక్షిణంబు గాఁ దిరుగుచు గౌరి నుద్దేశించి. ౨౧౬

క. ఓయంబిక యుత్తముఁ డధి,కాయువు విద్యాధరేంద్రుఁ డగుఁ బతి యనుచు
న్నాయుదొసఁగం బుడిపితి, నీయాజ్ఞతి దప్పె నింక ని న్నేమందున్. ౨౧౭

క. అని దూఱఁగ ముందఱఁ గాం,చనలతగతి మెఱుఁగుఁదీఁగ చాడ్పునఁ గాత్యా
యని వచ్చి పుత్రి నిలునిలు, మని తత్పతిమీఁదఁ జేతి నమృతము చల్లెన్.

క. చల్లిన సంజీవితుఁ డై, యుల్లన సుఖనిద్ర దెలియునటువలె నతఁ డు
త్ఫుల్లముఖుం డై గజముఖు,తల్లికిఁ బ్రణమిల్లెఁ దల్లిదండ్రులుఁ దానున్. ౨౨౧

క. మగలను మగఁ డగునటునిం, దెగఁ జూచిన శివునికిక్కు దృక్కుల నిడి యా
మగతనము సగముచేసిన, మగువా మాపాలఁ గలిగి మన్నించితివే. ౨౨౨

వ. అని యాదఱు నానంద బున వందనం బొనర్ప మలయవతి కృతాంజలి యై.

క. కరకము మింగినపతికి, స్మరణముఁ దప్పించి మెఱయు మంగళసూత్రా
భరణము గలదేవత వని, పరిచర్య యొనర్చినట్టిఫల మిటఁ గంటిన్. ౨౨౩

క. అని మ్రొక్కఁగ దివిఁ దూర్య, ధ్వను లొలయఁగ సకలదేవతలుఁ గొనియాడ
న్వినతానందనుకతమున, ననిమిషకుసుమములతోడ నమృతము గురిసెన్.

(1) కిద్దఆకుఁ.

క. ఆయమృతంబున నస్థిని, కాయము సప్రాణ మైనకాయంబుల న
త్యాయతలక్షణమణిరుచి సము, దాయము మెఱుఁగిడఁగ నెగసె దక్షకరముల్.

క. చెలువుం జుట్టలుఁ గలయం, జెలరేఁగి సుధాంబుపూర్తి చెలువునఁ బాముల్
చెలఁగుచు మలయాచలమున, సెలయేఱులభంగి జలధిఁ జేరఁగఁ బాఱెన్.

గీ. అంత నమరసిద్ధయక్షగంధర్వులు, గొలువ గగనతటిని జలకమార్చి
సిరులు మిగుల గౌరి జీమూతవాహను, ఖచరచక్రవర్తిగా నొనర్చె. ౧౬౭

వ. అట్టియెడ నత్యంతసంతుష్టాంతరంగుం డై గరుత్మంతుండు చనుదెంచి నీకేదియి
ష్టంబు వేఁడు మనిన నక్కుమారుం డురగహరణం బుడిగి దృఢప్రతిజ్ఞుండవు గమ్మం
తియ చాలు నీప్రసాదంబున నాకేమియుం గొఱంత లేదు. ౧౬౮

క. అనవలఁ గాచితి నాగుల, జనముల ప్రాణములు నిలిచె సర్వేశ్వరిమ
న్నన గలిగె నీవు మెచ్చితి, విను రాజ్యం బబ్బెనేమి వేఁడెద నింకన్. ౧౬౯

చ. అని వినయోక్తిఁ బల్కి జగదంబికఁ గ్రమ్మఱఁ బ్రస్తుతించి య
జ్జననికి మ్రొక్కి యిష్టజనసంగతుఁ డై చని తొల్లి యున్నకాం
చనపురిఁ జొచ్చి రాజ్యసుఖసంపదఁ దేలుచు నేలుచుండె న
వ్వనితయుఁ దాను నాత్మగురువందననందితచిత్తవృత్తి యై. ౧౭౦

వ. కావున నట్టిపరోపకారశూరుం డెవ్వఁడు గలఁడు. ౧౭౧

గీ. వింటి మతనిఁ దొల్లి కంటి మీతని నేఁడు, వీండు మిప్ప లోకవిక్రమార్క
వనిన నతనికనిత దనుజేంద్ర విక్రమా, దిత్యుఁ డితఁ డొక్క తెలియు మనియె.

వ. నావుడు నారక్షసుం డోనరోత్తమ నీ వడిగినవరం బిచ్చితిఁ బుణ్యపురుషుండవు
బొంకకు నీ వెవ్వండ వనిన నవ్వసుమతీవల్లభుండు పూర్వదేవుండవు నీ వెఱుం
గవే విక్రమార్కుండ నగుదు నాచరిత్రంబు జను లెఱుంగకుండఁ గృప చేసితాం
తుండవు గ మ్మని మ్రొక్కి తదనుజ్ఞాతుం డై యజ్ఞాతభావంబున మగిడి నిజపు
రంబగు నుజ్జయినీపురంబునకుం జనుదెంచెం గావున. ౧౭౩

క. ఇట్టిగుణంబులు నీ కే, పట్టున సమకూరకునికిఁ బాఁడి వ చను మి
ట్టట్టను బోరలకు మనవుడు, దిట్టతనం బుడిగి వసుమతీపతి మగిడెన్. ౧౭౪

—: పంచదండవబొమ్మకథ :—

వ. మఱియుం గొన్నిదినంబు లరిగిన. ౧౭౫

క. కంబూపమగళు మృగమద, జంబాలీకృతమహావిమ కృత్తిసకృత
స్తంబేరమచర్మాంబరు, లంబోదరగురుఁ గృపావలంబునిఁ గొలుతున్. ౧౭౬

చ. అని మదిలోఁ దలంచుచు ధరాధిపుఁ డిష్ట జనోపదిష్టమా
దినమున నెక్కఁ బూని యరుదేరఁగ నచ్చటిబొమ్మ చూచి యో
జనవర విక్రమార్కుగతి సాహసదానగుణంబు లేక నీ
కెనయఁగ దేవతాసనము నెక్కఁగవచ్చునె[1] నిల్వు నావుడున్. ౧౭౭

క. అతనికడ నట్టిసాహస,వితరణగుణ మెట్లు చెల్లె వినిపింపు మనం
బతిగుణములు పండ్రెండన, ప్రతిమ యెఱింగింప భోజపతి కిట్లనియెన్. ౧౭౮

మ. విను మావిక్రమభూషణుండు విమలోర్వీనాథసందోహత
ర్జనసంపన్నజయాభిరాముఁడు సదాచారప్రవాహోచితా
త్మనయప్రాభవధర్మనందనుఁడు విద్వత్పాలనాకేళిసం
జనితానందుఁడు సాగరాంతముగ నీక్ష్మామండలం బేలఁగన్. ౧౭౯

గీ. అతనిపీట నర్థపతి కేఁయగు భద్ర,సేనుఁ డనఁగ నొక్కసెట్టి గలఁడు
వాని కొడుకు గలిగె దానసుందరుఁడు పు,రందరుం డనంగ నందనుండు.

క. ఆకోమటి కడపటఁ బర,లోకమునకుఁ జనిన నర్థలోభ ముడిగి సు
శ్లోకుండు పురందరుఁ డీ,లోకము నొనియాడ దానలోలుం డయ్యెన్.[2]

క. అతని దగువ్యయముఁ గనుఁగొని, హితు లందఱు వచ్చి బుద్ధి యిది గా దుచిత
స్థితినడుపు మహాదార్యో, న్నతి దారిద్ర్యంబు వచ్చు నరపతి కైనన్.[3]

గీ. ధనము గలుగువాఁడె ధన్యుండు మాన్యుండు, ధనము గలుగువాఁడె ఘనుఁడు జగతి
ధనము గలుగువాఁడె తగవులకాఘ్యుండు, ధనము గలుగువాఁడె మనుజవిభుఁడు.

గీ. ధనము గలిగె నేని ధర్మార్థకామమో, క్షముల నచల నచట జుపవచ్చు
ధనముగలుగువేళ జను లెల్లఁ దమవారు, ధనము లేనివానిమనికి చావు.

మ. అని చెప్ప న్విని యప్పురందరుఁడు గర్వాక్రాంతుఁడై నవ్వి యి
ట్లనియెన్ దానము భోగముం దగవుఁ జేయం బాడి గాదేని యా
ధన మేలా మఱి లాభ మేల సుఖికిన్ దారిద్ర్యమే మేలు నాఁ
జనదే మర్త్యుఁడు మంటిపాలయిన నేసౌఖ్యంబు భోగించెడున్. ౧౮౦

క. మును దనకుం గానున్నది, పనివడి యగు నారికేళఫలరసముక్రియం
జననున్నది చనుఁ గరిగ్ర, స్తన మ్రింగిన వెలఁగపండుగుంజను బోలెన్. ౧౮౧

---

1. యెత్తుక నచరాసనంబు నెదఁ ద్రొక్కఁగ వచ్చునె. 2. క. ఆకాశసాగరాంతర...... శ్లోకుఁడు పురందరుండీ, లోకము నొనియాడ దానలోలుం డయ్యెన్. 3. సమున్నతి ధనముఁ జొప్పకు హీనత దారిద్ర్యమువచ్చు.

క. తోడఁ గట్టఁ బూయఁ బెట్టం, గుడువం జెప్పెడువారు గాక గొనకొని గడియుం
జెడిపెడి బ్రదుకున కిడుమం, బొడివోసికొనంగఁ జెప్ప బుధులుం గలరే.[1]

చ. అనుచు ననాదరంబున నిజాప్తుల దూఱి యుదారబుద్ధిఁ జం
దనమృగనాభిపుష్పవస్త్రవనితాపరిభోగవిషక్తచిత్తుఁడై
యనుదినముం ధనంబుఁ గలయ న్వెదచల్లుచు నొయ్యనొయ్య వి
ర్ధనదశ నొంది వంది యనుతాపము నెమ్మదిఁ గంది కుందుచున్. ౨౭౯

క. ముసిసిఁగయూరనె కడపటఁ, దిరియుట యని సమ్మ టనుచు ధృతిమాలి పురం
దరుఁ డొకనెపమున దేశాంతర మరిగెన్ మిత్రు లెల్లఁ దను నవ్వంగన్.

వ. ఇట్లరిగి. ౨౮౦

ఉ. అక్కడ నక్కడం గల నయంబుఁ బ్రియంబు సువస్తుజాతముం
జక్కనికాంతల న్రతిరసజ్ఞలఁ జూచుచు నాదరంబుతో
నొక్కొకయూరఁ గర్ణనయనోత్సవలీలల నిచ్చ మెచ్చుచుం
బెక్కుదినంబు లుండెఁ దనపేరు నిజాప్తు లెఱుంగకుండఁగన్. ౨౮౧

క. ఒకనాఁడు మధురలోపల, నొకచోద్యం బెఱిఁగి మగిడి యుజ్జయినీభ
ర్తకు విన్నవింతు నని[2] యిం, చుక రవణముతోడ వచ్చెఁ జుట్టలు పొగడన్.

ఉ. వచ్చినవానిఁ జూచి జనవల్లభుఁ డీవు చరించు భూమిలో
నచ్చెరు వేమి గంటి వని యానతి యిచ్చిన నప్పురందరుం
డిచ్చకు వచ్చున ట్లడిగె నీధరణీవరుఁ డంచు నాత్మలో
మెచ్చుచు విన్నవించెఁ బతిమె చ్చొదవంగూడ యథాక్రమంబుగన్. ౨౮౩

సీ. ఈపురి వెడలి యే నెల్లతీర్థంబులుఁ దిరుగుచుఁ గేదారధరణి కేఁగి
మగిడి వచ్చుచు హేమమణిమయప్రాకారరమ్యమౌ మధురాపురంబుఁ జూచి
చని యొప్పిదం బెల్లఁ గనుఁగొని రే యొక్క ద్విజునింటిపొంత నిద్రించునప్పు
డఃద ననాథ నిరాధారఁ గావరే యనుచు బీతెంచె నార్తారవంబు[3]
దాని కుల్కి మిగుల దయ గల్గియును లావు, లేమి నేమియు ననలేక యుండి
రేపకడన లేచి యాపురజనుల న, య్యబలవార్త దెలియ నడిగి వింటి. ౨౮౪

వ. ఎట్లనిన. ౨౮౫

క. చెలువొనరెడు పురి చేరువ, బిల్వవనాంతమున రేయి భీమాకృతితో
నిల్వలనిభుఁ డొకదనుజుఁడు, చెల్వం బెడుకళల మొత్తి చెందుచు నుండున్.

1. బుద్ధులు గలవే. 2. వినిపించెదనని 3. మహార్తరవము- చి. నూ.

క. ఆపొలఁతుక రేయెల్లను, వాపోవుచునుండ నసుర వాపింపంగా
నోపరు పరు లెవ్వరుఁ బృథ్వీపాలక యేను విన్న తెఱఁ గిది చుమ్మీ.[1] ౨౯౭

ఉ. నావుడుఁ జోద్యమంది నరనాథుఁ డనాథ కృశాంగి నంగనం
గావఁ గడంగి హస్తమున ఖడ్గము తోడుగ నెట్టెఁ గూడి యా
త్రోవన యేఁగి దూరగతి దోఁపఁగ నల్లన నొక్క నాఁడు ల
క్ష్మీవిభవాఢ్య హా మధురఁ జేర నినుం డపరాద్రిఁ జేరఁగన్. ౨౯౮

క. మలయుచు నెయ్యెడఁ గలయం, దెలివిపడ న్వెలిఁగి భువనదీపము చనినన్
మలినాకృతితోఁ గాటుక, మలక[2] క్రియ న్నభము తిమిరమయమై పొలిచెన్.

గీ. అప్పు డధిపుఁ డాపురాంతికవనభూమి, యమున పగిదినున్న తమముఁ జూచి
నైరృతనయ వెఱవ వల దని తెలుపుచు, ననట నసురరాక యరయుచుండె.

గీ. వాలుఁగంటిమొఱ్ఱ వాలాయ మగు నాన, వాలుగాఁగఁ జీకు వాలు సొచ్చి
వాలుపెఱికికొనుచు వాలుమగం డేఁగె, వాలు దైత్యునుపటి వ్రాలు దుడువ.

క. ఈరీతిఁ గాచియుండఁగ, నారాక్షసుఁ డంత నంగనామణి మొత్తం
గా రావము వినవచ్చిన, నారాజును నాలకించి యతిరభసమునన్. ౩౦౨

క. వెఱవకు వెఱవకు తరుణీ, మొఱ యాలించితి[3] నృపాలముఖ్యుఁడ నీకై
పఱతెంచితిఁ బరిపరిగాఁ, గఱకు టసురఁ జెండివైతుఁ[4] గాచెద నిన్నున్. ౩౦౩

వ. అని. ౩౦౪

శా. ఓరీ రాక్షస వట్టిగర్వమున నీ వుప్పొంగి దీనానన
న్నారీరత్నము నేల నొంచె దిటు లన్యాయంబు గావింతువే
యేరా చెప్పఁగనైన మున్నెఱుఁగవే యే విక్రమార్కుండ నీ
క్రూరత్వంబును దర్పము న్బలిమియు న్రూపార్చెద న్నిలువుమా. ౩౦౫

క. అనవుడు రోషంబున ని, ట్లను మాయాబలసమగ్రుఁ డగుదుందుభికి
న్ననుమఁడ నోరి నరాధమ, ఘనభుజదర్పుఁడఁ గఠోరకరుఁడం జుమ్మీ. ౩౦౬

క. ఆలమునఁ బంద[5] పగతుఱ, నాలం బొనగించినట్టు లాడెద విటు నా
పాలం బడితివి[6] నేఁడు నృపాలాధమ నిన్ను భూతబలి గావింతున్. ౩౦౭

క. నీకొలఁదివారిమొనకలు, నాకోఱలసందిఁ జిక్కె నలుతును నీవే
లోకము సొచ్చిననైననుఁ, బోకార్చెద నిన్నుఁ బదరి[7] పోవక నిలుమా. ౩౦౮

---

1. బృథ్వీపాలక దీనికతము దేవర యెఱుఁగుఁడు. 2. కాటుకమలక = మసిమాఁకుడు. 3. మొఱగ విచ్చితి. 4. టసురని పుడె చెండి, 5. ఆలమునఁబడిన, 6. నావాలునఁబడితివి. 7. బెదరి.

వ. అనిన వీరరసభీషణంబు లగుభాషణంబుల విక్రమభూషణుండును దోర్దండమం
డితారాతిరాజమండలదండితప్రచండభుజాగ్రమండనాయమాన మండలాగ్రధ
రుం డగుచు నద్దండిమగ లొండొరులం దలంపడి. ౩౦౯

క. మదకరులకరణి సింగపుఁ,గొదమల క్రియఁ బులులభంగి గురుపోతుల ప్ర
ల్లదముల[1] శరభంబులగతిఁ, గదిసిరి కదనమున కవని గ్రక్కదలంగన్. ౩౧౦

ఉ. బంధురవిక్రమస్ఫురితబాహులు దైత్యుఁడుఁ బార్థివుండుఁ గ్రో
ధాంధత మీఱి పోరిరి దశాననుఁడు న్రఘునాయకుండు న
య్యంధకుఁడున్ హరుండు నరకాసురుఁడు న్నలినాక్షుఁడు న్జరా
సంధుఁడు వాయుసూనుఁడును జంభుఁడు నింద్రుఁడుఁ బోరుకైవడిన్. ౩౧౧

వ. ఇట్లు పోరునెడఁ బ్రభాతం బైనఁ దత్కాలోచితంబుగ. ౩౧౨

క. క్రందటి తనతేజమునఁ[2] బు,రందరుదెసఁ దెలివిగలుగ రాత్రించరునిన్
మ్రందించె విక్రమార్కుఁడు, సుందరి ముఖపంకజమున సొంపు నటింపన్.

గీ. మండలేశ్వరుండు మండలాగ్రంబున, దండి మిగులఁ గలిగి దండిదైత్యుఁ
జెండి పాఱవైచి చండాంశువిధమున, నుండెఁ గండ లుర్విఁ గుండుకొనఁగ.[3]

గీ. దిశలఁ దెలివి గలిగె దివ్యతూర్యంబులు, చెలఁగె నారదుండు మలసి యాడె
నాకసమున నిల్చి యమరవర్గము జన,విభుని మీఁదఁ బుష్పవృష్టి గురిసె.

గీ. నృపుఁడు సంతసిల్లి నీరజాననఁ జూచి, పడఁతి యిట్లు కొట్టఁబడఁగ నీకు
నేమికతము దీని నెఱిఁగింపవచ్చునేఁ, జెప్పు మనిన వినతి చేసి పలికె. ౩౧౬

గీ. వసుమతీరమణ యవంతిదేశంబులో, ధర్మశర్మ యనఁగఁ దగినవిప్రు
భార్యఁ గాంతిమతి నకార్యంబు గావించి,కులము చెఱిచి మిగులఁగుఱుచనైతి.[4]

ఉ. భవ్యుఁడు ధర్మశర్మ తనబాంధవవర్గము చెప్పఁగా మదీ
యవ్యభిచార మట్లెఱిఁగి యార్తిఁ గలంగియు, నింతి దానవాం
తవ్య[5] యటంచుఁ దెం పుడిగి దానవుచేతికశాహతి న్శరీ
రవ్యథఁ గుందుచుండు బహురాత్రులు నీ వని శాప మిచ్చెన్. ౩౧౮

క. వడవడ వడఁకుచు మానము, సడలఁగ ధరఁ జాఁగి మ్రొక్కి శాపావధి యె
న్నఁడు నాకుఁ గలుగు ననుచుం, దడవోర్వమి విన్నవింప దయతో నతఁడున్.

క. అసహాయశూరుఁ డగునొక,వసుధాపతి వచ్చి కేలు వగఁబెట్టుకున
య్యసురఁ బోరిగొన్నయప్పుడ, వెస నీశాపమున కెల్లవీడ్కో లనియెన్.[6] ౩౨౦

శా. ఆశాపంబున నీనిబాఱిఁ బడి దేహం బెల్ల మ్రందంగ న
య్యాశాబంధము పేర్మిఁ బ్రాణములఁ బాయంజాల కే నుండఁగా

1. పెట్టిదమున. 2 కెందలిరు తేజమునను. 3. మెండుకొనఁగ. 4. కులముచెడితి మిగులఁ గుటిలనైతి. 5. కామినీవహంతవ్య- 6. వెసనీపాపమున కదిరొఱవీడ్కోలరయన్.

నీ శస్త్రప్రభ నాతమం బడఁచి మన్నించెం గృపం జూడు భూ
మీశాధీశ్వర! నీకు మే లొకటి యే నిచ్చోటఁ గావించెదన్. 3౨౧

సీ. ఇక్కడి గుడితూర్పు దిక్కునఁ బక్కి[1] చెట్టున్నది దానికి నుత్తరమునఁ
[2]బరువేఁడు దవ్వున బరివెంక పనుమటి నెలవునఁ దొమ్మిది నిధులమీఁఁది
దనుజుఁడు దాఁచిన ధనము పెక్కున్నది కైకొమ్ము నామీఁదఁ గరుణసేయు
చనియెద నని మ్రొక్కి వనిత యేఁగిన రాజు వెఱఁగంది యక్కువ వెదకి కాంచి
దీనుఁ డైనభద్రసేనతనూజున, కిచ్చి వేడ్క మగిడి వచ్చెఁ బురికి
నిట్టిగుణము లేక యిది యెక్కవచ్చునే, పొమ్ము చాలు నింక భోజరాజ. 3౨౨

క. అనవుడు నంతకు నంతకు, విన నింపగు నతని తెంపు విని సభ యెల్లన్
మన మలరఁగ నవమానం,బును[3] సిగ్గును ముడివడంగ భోజుఁడు మగిడెన్.

ఉ. అక్షీణప్రతిపక్షభావసముదగ్రాటోపజాగ్రన్మనో
రక్షోనాయకపక్షతల్లణవిహారక్షిప్త కౌక్షేయకుం
గుక్షిస్థ న్తసమస్తలోకభరణక్షుణ్ణాక్షయాత్మావృతి
ప్రక్షేపోచిత వాహనీకృతమహాపక్షీశు లక్ష్మీశునిన్. 3౨౪

శా. ఉల్లాసోద్ధతచండతాండవవిహారోత్తుంగరంగజ్జటా
వల్లీమండలమల్లికాకుసుమభావప్రాప్తబాలేందుసం
ఫుల్లేందీవరరేణుసంగకబళీభూతాభ్రకూలంకషా
కల్లోలోపరిబిందు మౌక్తికమయూకల్పోత్తమాంగున్ శివున్. 3౨౫

మాలిని. ధరణిధరవిభూషా ధర్మనిర్మాణతోషా
సరసిజభవసేవ్యా సంతతార్తియభావ్యా
నిరుపమనిజలీలా నిత్యకళ్యాణశీలా
పురహరహరిరూపా భుక్తిముక్తి స్వరూపా. 3౨౬

గద్యము. ఇది రాయగజగంధవారణ వైరిమండలికభేకఫణీంద్ర వీరఘోట్టవిభాళా
దిబిరుదప్రకటచారిత్ర కళింగదేశనిర్ధూమధామ త్యాగనాగార్జున కర్ణాటద్రవి
ళాంధ్రమహారాష్ట్ర భూపాలరూపనూపురసుందరచరణారవింద సనదప్రోలిపుర
వరాధీశ్వర వెలనాటి పృథ్వీశ్వరరాజ్యసముద్ధరణ శ్రీకొఱవి వెన్నయామా
త్యపుత్ర హారితసగోత్రపవిత్ర సకలసుకవిమిత్ర కసవరాజతనూజ గోపరాజ
విరచితం బైనసింహాసనద్వాత్రింశిక యనుకావ్యంబునందు విక్రమార్కు మహా
దార్యంబునుజీమూతవాహనోపాఖ్యానంబును సాహసాంకునిసాహసౌదార్యం
బులును నన్నది పంచమాశ్వాసము.

ప్రథమభాగము సంపూర్ణము.

---

1. పరికెచెట్టు- (బరివెంకయఁ బక్కి నామాంతరము. పరికె వృక్షవిశేషము.) 2. పరువుడ
వ్వున- 3. నపురాగంబును,

వ. అనిన వీరరసభీషణంబు లగుభాషణంబుల విక్రమభూషణుండును దోర్దండమండితారాతిరాజమండలదండితప్రచండభుజాగ్రమండనాయమాన మండలాగ్రధరుం డగుచు నద్దండిమగ లొండొరులం దలంపడి. ౩౦౯

క. మదకరులకరణి సింగపుఁ,గొదమలక్రియఁ బులులభంగి గురుపోతులప్రల్లదములు[1] శరభంబులగతిఁ, గదిసిరి కదనమున కవని గ్రక్కదలంగన్. ౩౧౦

ఉ. బంధురవిక్రమస్ఫురితబాహులు దైత్యుఁడుఁ బార్థివుండుఁ గ్రోధాంధత మీఱి పోరిరి దశాననుఁడు న్రఘునాయకుండు వ
య్యంధకుఁడున్ హరుండు నరకాసురుఁడు న్నలినాక్షుఁడు న్జరా
సంధుఁడు వాయుసూనుఁడును జంభుఁడు నింద్రుఁడుఁ బోరుకైవడిన్. ౩౧౧

వ. ఇట్లు పోరునెడఁ బ్రభాతం బైనఁ దత్కాలోచితంబుగ. ౩౧౨

క. క్రందఱి తనతేజమునఁ[2] బు,రందరుదెసఁ దెలివిగలుగ రాత్రించరునిన్
మ్రందించె విక్రమార్కుఁడు, సుందరి ముఖపంకజమున సొంపు నటింపన్.

గీ. మండలేశ్వరుండు మండలాగ్రంబున, దండి మిగులఁ గలిగి దండిదైత్యుఁ
జెండి పాఱవైచి చండాంశువిధమున, నుండెఁ గండ లుర్విఁ గుండుకొనఁగ.[3]

గీ. దిశలఁ దెలివి గలిగె దివ్యతూర్యంబులు, చెలఁగె నారదుండు మలసి యాడె
నాకసమున నిల్చి యమరవర్గము జన,విభుని మీఁదఁ బుష్పవృష్టి గురిసె.

గీ. నృపుఁడు సంతసిల్లి నీరజాననఁ జూచి, పడఁతి యిట్లు కొట్టఁబడఁగ నీకు
నేమికతము దీని నెఱిఁగింపవచ్చునేఁ, జెప్పు మనిన వినతి చేసి పలికె. ౩౧౬

గీ. వసుమతీరమణ యవంతిదేశంబులో, ధర్మశర్మ యనఁగఁ దగినవిప్రు
భార్యఁ గాంతిమతి నకార్యంబు గావించి,కులము చెఱిచి మిగులఁగుటిలనైతి.[4]

ఉ. భవ్యుఁడు ధర్మశర్మ తనబాంధవవర్గము చెప్పఁగా మదీ
యవ్యభిచార మ ట్లెఱిఁగి యాత్మఁ గలంగియు, నింతి దా నహం
తవ్య[5] యటంచుఁ దెం పుడిగి దానవుచేతికశాహతి న్సరీ
రవ్యథఁ గుందుచుండు బహురాత్రులు నీ వని శాప మిచ్చినన్. ౩౧౮

క. వడవడ వడఁకుచు మానము, సడలఁగ ధరఁ జాఁగి మ్రొక్కి శాపావధి యె
న్నఁడు నాకుఁ గలుగు ననుచుం, దడవోర్వక విన్నవింప దయతో[6] నతఁడున్.

క. అసహాయశూరుఁ డగునొక,వసుధాపతి వచ్చి రేలు వగఁబెట్టెడున
య్యసురఁ బోరిగొన్నయప్పుడ, వెస నీశాపమున కెల్లవీడ్కో లనియెన్. ౩౨౦

శా. ఆశాపంబున నీనిబారిఁ బడి దేహం బెల్ల మ్రందంగ న
య్యాశాబంధము పేర్మిఁ బ్రాణములఁ బాయంజాల కే నుండఁగా

1. బెట్టిదమున. 2 కెందలిరు తేజమునను. 3. మెండుకొనఁగ. 4. కులము చెడితి మిగులఁ గుటిలనైతి. 5. కామినీవహంతవ్య- 6. వెసనీపాపమున కదిరొమీడ్కోలనయన్.

నీ శస్త్రప్రభ నాతమం బడఁపి మన్నించెం గృపం జూడు భూ
మీశాధీశ్వర ! నీకు మే లొకటి యే నిచ్చోటఁ గావించెదన్. ౩౨౧

సీ. ఇక్కడి గుడితూర్పు దిక్కునఁ బక్కి చె[1]ట్టున్నది దానికి నుత్తరమునఁ
[2]బరువేఁడు దవ్వున బరివెంక వసుమతి నెలవునఁ దొమ్మిది నిధులమీఁకి
దనుజుఁడు దాఁచిన ధనము పెక్కున్నది కైకొమ్ము నామీఁదఁ గరుణసేయు
చనియెద నని మ్రొక్కి వనిత యేఁగిన రాజు వెఱఁగంది యిక్కువ వెదకి కాంచి
దీనుఁడై సభద్రసేనతనూజున, కిచ్చి వేడ్క మగిడి వచ్చెఁ బురికి
నిట్టిగుణము లేక యిది యెక్కవచ్చునే, పొమ్ము చాలు నింక భోజరాజ. ౩౨౨

క. అనవుడు నంతకు నంతకు, విన నింపగు సతని తెంపు విని సభ యెల్లన్
మన మలరఁగ నవమానం,బును[3] సిగ్గును ముడివడంగ భోజుఁడు మగిడెన్.

ఉ. అక్షీణప్రతిపక్షభావసముదగ్రాటోపజాగ్రన్మనో
రక్షోనాయకవక్షతల్పణవిహారక్షిప్రకౌక్షేయకుం
గుక్షిన్యస్తసమస్తలోకభరణక్షుణ్ణాక్షయాత్మావృతి
ప్రత్యక్షపోచితువాహనీకృతమహాపక్షీశు లక్ష్మీశునిన్. ౩౨౩

శా. ఉల్లాసోద్ధతచండతాండవవిహారోత్తుంగరంగజ్జటా
వల్లీమండలమల్లికాకుసుమభావప్రాప్తబాలేందుసం
ఫుల్లేందీవరరేణుసంగకబరీభూతాభ్రకూలంకషా
కల్లోలోపరిబింబమాక్తికమయూకల్పోత్తమాంగున్ శివున్. ౩౨౪

మాలిని. ధరణిధరవిభూషా ధర్మనిర్మాణతోషా
సరసిజభవసేవ్యా సంతతాత్మీయభావ్యా
నిరుపమనిజలీలా నిత్యకల్యాణశీలా
పురహరహరిరూపా భుక్తిముక్తి స్వరూపా. ౩౨౫

గద్యము. ఇది రాయగజగంధవారణ వైరిమండలికభేకఫణీంద్ర పీరఘోట్టవిభాళా
దిబిరుదప్రకటచారిత్ర కళింగదేశనిర్ధూమధామ త్యాగనాగార్జున కర్ణాటద్రవి
ళాంధ్రమహారాష్ట్ర భూపాలరూపనూపురసుందరచరణారవింద సనదప్రోలిపుర
వరాధీశ్వర వెలనాటి పృథ్వీశ్వరరాజ్యసముద్ధరణ శ్రీకొలని వెన్నయామా
త్యపుత్ర హారీతసగోత్రపవిత్ర సకలసుకవిమిత్ర కసవరాజతనూజ గోపరాజ
విరచితంబైన సింహాసనద్వాత్రింశిక యనుకావ్యంబునందు విక్రమార్కు మహా
దార్యంబును జీమూతవాహనోపాఖ్యానంబును సాహసాంకుని సాహసౌదార్యం
బులును నన్నది పంచమాశ్వాసము.

ప్రథమభాగము సంపూర్ణము.

---

1. పరికెచెట్టు- (బరివెంకయఁ బక్కి నామాంతరము. పరికె వృక్షవిశేషము.) 2. పరువుడ
వ్వన- 3. నవురాగంబును,